ఆంధ్రసచిత్రవారపత్రిక



23-7-58
25 నయాపైసలు

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



సౌందర్యతిలక

ఫోటో : నందగోపాల్—హైదరాబాదు.



మండు వేసంగిలో చల్లటి ముంజలు

చిత్రకారుడు: వెల్లటూరి—పూర్ణానందశర్మ.]

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25 న.పై

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 48
23-7-58

Founder : K. NAGESWARA RAO

విలంబి శ్రావణ శుద్ధ సప్తమి బుధవారం

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
హిందీనటి నూతన్

అంతరిక్షయాత్రలో భారరహితస్థితి

శూన్యాకాశంలో ప్రయాణం చేయదలచిన మనిషిని ఎదుర్కొనే అనేక సమస్యలలో ముఖ్యమైనది భార రహితస్థితి భూమి చుట్టూ తిరిగేటప్పుడూ, చంద్రగోళం వైపు ప్రయాణించేటప్పుడూ ఈ స్థితి సంభవిస్తుంది అమెరికాలో సైనిక, పౌర పరిశోధనాలయాలలో పనిచేస్తున్న శాస్త్రజ్ఞులకు ఇది చాల గడుసమస్యగా తయారైంది భూమి వాతావరణంలో ఈ స్థితిని ఎక్కువసేపు సృష్టించి పరిశోధనలు జరపటానికి వీలులేకపోవటమే దీనికి కారణం ఒక్కొక్కసారికి మహా అయితే ఒక నిమిషంలోపుసేపు మాత్రమే భార రహితస్థితిని కల్పించవచ్చు ఆ కాసేపటిలోనే చేయదలచిన ప్రయోగాలు చేసేయాలి ఆ స్థితిని ఎలా కల్పిస్తారో, అప్పుడెలా ఉంటుందో స్వయముగా చూడటానికి "టైమ్ పత్రిక వైద్యశాఖ సంపాదకుడు గిల్బర్ట్ కాంట్ ఈ ప్రయోగాల్లో పాల్గొన్నారు ఆయన అమెరికన్ విమానశాఖ తాలూకు సూపర్ సేబర్ జెట్ విమానంలో లూటినెంట్ కర్నల్ బ్రెట్‌తో కలిసి ప్రయాణం చేసి తన అనుభవాలను ఇలా వర్ణించారు —

"కర్నల్ బ్రెట్ ఇదివరలో ఎన్నోసార్లు భారరహిత స్థితిలో కొద్ది సెకనులసేపు ఉన్నారు కాని వీలైనంత ఎక్కువసేపు ఉండటానికి ప్రయత్నించమని ఈ సారి ఆయనకు ఉత్తర్వులిచ్చారు అది ఆయనకూ కొత్తే, నాకు సరే, పూర్తిగా కొత్త అనుభవము

575 మైళ్ల తరవాత మా విమానం క్రిందికి 'డైవ్' చెయ్యటం మానేసి పైకి దూసుకుపోవటం మొదలుపెట్టింది వేగం మార్పును కొలిచే 'జి మీటర్'లో ముల్లు పైకి పోసాగినది. నేను 'జి సూట్' తొడుక్కున్నాను నా కడుపులో ఏదో రాక్షసహస్తం నొక్కుతున్నట్లు బోధకలిగింది మరో రెండుజతల రాక్షసహస్తాలు నా తొడలచుట్టూ, పిక్కల చుట్టూ నొక్కిపట్టి కాళ్లలోకి నెత్తురంతా చేరిపోకుండా చేస్తున్నాయి 'జి మీటర్'లో ముల్లు నెమ్మదిగా రెండునుంచి మూడుకూ, మూడునుంచి నాలుగుకూ పాకుతోంది. నా మామూలు బరువు 145 పౌనులూ 580 పౌనులదాకా పెరిగింది నన్ను నొక్కివేస్తున్నట్లు, నేను కుంగిపోతున్నట్లు అనిపించింది కామెరామటర్‌ను తెరవటానికుపయోగించే తేలిక రబ్బరుబంతి కూడా మొయ్యలేనంత బరువెక్కింది కనుగుడ్లు బరువుతో కిందికి జారిపోతున్నట్లు, కనురెప్పలు ఇనపతలుపులంత బరువుగా ఉన్నట్లు అనిపించింది ఎంతో ప్రయత్నిస్తేగాని రెప్పలెత్తి మీటర్లూ అవీ చూడటానికి వీలులేకపోతోంది

మేము బాగా ఎత్తుఎక్కి, చేరుకోదలచిన ఔన్నత్య శిఖరం చేరుకునే సరికల్లా '4 జి' ఉన్నట్టుండి మాయమైంది. భూమ్యాకర్షణ శక్తి సిద్ధాంతాన్ని ఛేదించుకుని భారరహిత స్థితిలోకి వెళ్లాము మా బరువు సున్నాకు దిగిపోయింది

లాంగ్లీలోంచి బయలుదేరిన కొన్ని నిమిషాలకే మా సూపర్ సేబర్ వర్జీనియాలోని చి[illegible]డి నేలలు దాటి ఉత్తర కారోలినాలోని చౌవన్ నదిమీదకు వచ్చేసింది ఆ ప్రాంతం ప్రత్యేకంగా వైమానిక ప్రయోగాలకోసం కేటాయించబడినది. అక్కడికి ఇతర విమానాలేమీ రాకుండా కట్టుదిట్టాలు చేశారు కర్నల్ బ్రెట్ ఎందుకైనా మంచిదని మరీ ఎత్తుగా పోకుండా కొంచెం దిగువగానే విమానాన్ని పోనిచ్చారు మైక్రోఫోనులను 'ఆన్' చేసే ఉంచాము. ఒకరి ఊపిరి మరొకరికి వినిపిస్తున్నది ఆయన నన్నడిగారు "రెడీయేనా?" అని అప్పుడు విమానాన్ని పైకి రాకెట్ చేశారు

కిందికి దిగుతున్నప్పుడు, పైకి ఎక్కుతున్నప్పుడు నా చేతిలో నాలుగౌన్సుల బరువున్న సీసపుసింకర్ పట్టుకు నేనున్నాను. ఇది సముద్రపుటడుగున చేపలుపట్టే వారు ఉపయోగించే రకం. భార రహిత స్థితిని కొలవటానికి విమానశాఖ లక్షలకొలది ఖర్చుపెట్టి తయారుచేసిన ఎలక్ట్రానిక్ యాక్సిలరోమీటర్ కంటే ఏడు సెంట్లవెలకు దొరికే ఈ సింకర్ చాలా ఉపయోగకారిగా ఉన్నది. భార రహితస్థితిలోకి వెళ్ళగానే కూర్చున్న చోటినుంచి కొద్దిగా తేలాను. సింకర్‌ను నా ముఖంముందు వదలిపెట్టాను. అది అక్కడే తేలుతూ ఆగిపోయింది. కొంచెం ముట్టుకుంటే అది అలా దూదిపింజలా తేలుతూ అటూ ఇటూ ఎగరసాగింది చిన్నపిల్లడిలాగ అదిచూసి ఎంతో సంబరపడ్డాను ఈ భారరహిత స్థితిలో సీసపు బెలూన్లకు మంచి మార్కెట్ లభిస్తుందని నాకు ఒక ఆలోచన వచ్చింది.

కాని ఆస్థితి క్షణంలో ఆఖరైంది. కర్నల్ బ్రెట్ కంట్రోల్స్‌తోను, మీటర్లతోనూ కుస్తీ పడుతున్నారు నేను చిత్రమైన ఆ క్షణికానుభవంలో మైమరచిపోయాను అందుచేత ఆ భారరహితస్థితి సరిగ్గా ఎంతసేపు ఉన్నదో ఆయనా చూడలేదు, నేనూ చూడలేదు బ్రెట్ మళ్ళీ ఎత్తుకుపోనిచ్చారు. ఒక నిమిషం ఆగి "మళ్లీ రెడీయేనా?" అని అడిగారు విమానం ఒక్కసారిగా కిందికి దిగి మళ్ళీ ఎక్కటం మొదలుపెట్టింది జి మీటర్ ముల్లు మళ్ళీ పైకిపోవటం, నామీద

అంతరిక్ష యాత్రలో భారరహితస్థితి

కొండంత బరువు మోపినట్లు భావించటం జరిగింది. క్రమంగా బరువు తగ్గిపోయి భార రహితస్థితిలోకి జారాము.

ఈసారి మరికొంత ఎక్కువసేపు ఆస్థితిలో ఉన్నాము. మళ్ళీ సీసపు సింకర్‌తో ఆడుతున్నాను. ఎప్పుడు కిందికి దిగిపోవటం మొదలెట్టామో నేను గమనించనే లేదు. సింకర్ నా చేతులో నించి జారిముందుకు పోవడం మొదలుపెట్టింది. దాని పట్టుకోటానికి ప్రయత్నించానుగాని అది చిక్కలేదు. మైక్‌లో క్రెట్‌కు చెప్పాను. "సీసపు సింకర్ మీ ఎడమ భుజం మీదుగా వస్తోంది" అని. ఆయన తలఎత్తి నెమ్మదిగా వచ్చే సింకర్‌ను చూశారు. అదను కనిపెట్టి విమాన ముఖాన్ని పైకెత్తారు. ఆ కదలికకు సింకర్ నెమ్మదిగ ఆయన వళ్ళో వాలింది. దాన్ని పట్టుకుని చూపిస్తూ, దాన్ని కట్టివెయ్యటానికి ఒక తాడు కూడా అందించారు.

రకరకాల ఎత్తులలో, కోణాలలో, వేగాలలో ఒక గంటలో ఈ మాదిరిగా 18 సార్లు చేశాము. ప్రతిసారీ 4 జి నన్ను యమయాతన పెట్టింది. అది ఎన్ని సార్లకీ అలవాటు కానేలేదు. లాంగ్లీకి తిరిగి పోతున్నప్పుడు క్రెట్ తనకు భారరహిత స్థితిలో ఏమీ కొత్త అనిపించలేదనీ, మిగతా వైమానిక ప్రయోగాలలో మాదిరిగానే ఉన్నదని నాతో చెప్పారు. దీనికి కారణం ఆయన పొందిన తర్ఫీదే నని నేను గ్రహించాను.

మళ్ళీ ఇంధనాలు నింపుకొని ప్రయోగ ప్రాంతానికి బయలుదేరాము. క్రెట్ విమానంలో మామూలుగా వెనక సీటులో కూర్చునే ఫస్ట్ లూటినెంట్ ఆర్థర్ బ్రాట్క్స్ నాకు తెలివితేటల పరీక్ష తయారు చేశారు. ఒక నోటుబుక్కులో మూడు తేలిక లెక్కలు ఇచ్చారు. భారరహితస్థితిలో ఆకాశప్రయాణికని మతి సరిగా ఉంటుందో లేదో కనుక్కునేందుకు ఈ పరీక్ష పనికివస్తుంది.

రెండోసారి ప్రయాణంలో మొదటిసారిగా భారరహితస్థితిలోకి పోగానే మొదటిలెక్క చేయసాగాను. 13 ను 9 పెట్టి హెచ్చవేయాలి. ప్రాణవాయు కవచంలోంచి చూస్తున్న నాకు 9 కి ముందు డెసిమల్ ఉన్నదా, లేక అది కాగితంలో స్వతహాగా ఉన్న మచ్చా అని అనుమానం కలిగింది. ఆ వేసే డెసిమల్ ఏదో కాస్త గట్టిగా వెయ్యకూడదా అని బ్రాట్క్స్ మీద నిష్కారణంగా కోపంవచ్చింది. నేనా లెక్క చెయ్యకపోతే కొంపమునిగే ప్రమాదమేమీ లేదు. అయినా అది చాలా ముఖ్యమైనదన్నట్లు అకారణంగా ఒక భావం కలిగింది. అందుచేత డెసిమల్‌తో ఒకసారీ, లేకుండా ఒకసారీ రెండురకాలుగానూ లెక్క చేశాను. అక్కడికది అయింది.


రెండోసారి భారరహిత స్థితిలోకి వెళ్ళినప్పుడు రెండో లెక్క చేశాను.

ఈ లెక్కలో 45 ను 22 పెట్టి భాగించాలి. కాగితంమీద కాకుండా మనసులోనే చేయాలనే తొందరకొద్దీ లెక్క చేసి, సమాధానం 5 అని తప్పు చేశాను. మూడోసారి మూడో లెక్క చేశాను. నాలుగేసి స్థానాలున్న అయిదు సంఖ్యలను కూడటం ఈ లెక్క. ఇది సులభంగానే చేశాను. దాంతో కాస్త అలవాటైతే భార రహిత స్థితి కూడా మామూలుగానే ఉంటుందని నిశ్చయించుకున్నాను.

31 వ సారి, అంటే ఆఖరుసారిగా భార రహితస్థితిని సాధిస్తూ కర్నల్ క్రెట్ నలభై సెకండ్లసేపు ఆ స్థితిని నిలపగలిగాడు. అందులో 27 సెకండ్లసేపు పూర్తిగా భార రహితస్థితి. మొత్తంమీద ఆరోజున దాదాపు భారరహితంగా 7 నిమిషాలసేపు, పూర్తి భారరహితంగా 5 నిమిషాలసేపు ఉన్నాము. మొత్తం 2½ గంటలసేపు పరిశోధనలు చేశాము. అయినా మానవుడు రోజుల తరబడి, నెలల తరబడి భారరహిత స్థితిలో గడపవలసివస్తే, రక్త ప్రసారం, శ్వాస ఏయేమార్పులకు లోనవుతాయో అనేది మేము ఊహామాత్రంగానైనా సిద్ధాంతీకరించలేకపోయాము. ఒకటి మాత్రం నిశ్చయంగా తేలింది. తెలివితేటలు యథాప్రకారంగానే ఉంటాయి. అంతే కాదు చేతుల, కాళ్ల కదలికలతో దెబ్బలు తగిలించుకునే ప్రమాదంకూడా లేదని స్పష్టమైంది.

భార రహితస్థితిలో మనసు చాలా ఉల్లాసంగా ఉంటుందని కూడా నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. కేవలం కొత్త గనక అలా అనిపించిందనేందుకు కూడా వీల్లేదు. మేజర్ హెర్బర్ట్ స్టాలింగ్స్ ఎప్పుడెప్పుడైతేనేం మొత్తంమీద 38 గంటలసేపు భారరహితస్థితిలో ఉన్నారు. అయినా ఇప్పటికీ ప్రతిసారీ ఆయన భారరహితస్థితి అంటే ఉబలాటపడుతున్నారు. "వళ్ళుతడవకుండా ఈతకొట్టినట్లు" ఉంటుందని ఆయన అంటారు. కర్నల్ క్రెట్‌కు అలాంటి ఉల్లాసమేమీ కలుగలేదు. ఆయనకు కలిగినదల్లా, '4 జి' బరువుగల సంతృప్తి మాత్రమే." ★

—టైమ్ నుంచి




మంత్రుల కార్యక్రమాలకు అనవసర ప్రచారం

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

భాషావివాదం వార్తాపత్రికలలో మళ్ళీ ప్రముఖస్థానం వహించింది. పంజాబులో హిందీ తగాదాను మళ్ళీ రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వార్తలు వినబడుతున్నాయి ప్రధానమంత్రి పత్రికా విలేఖరుల గోష్ఠిలో ఉర్దూను ఉద్ధరించాలని ఉద్ఘాటించారు ఔత్తరాహులు దాక్షిణాత్య భాషలు నేర్చుకోవాలని రాష్ట్రపతి దక్షిణ భారత శ్రోతలకు శ్రవణానందంగా సలహా ఇచ్చారు దాక్షిణాత్య భాషలను ప్రోత్సహించాలని రాష్ట్రపతి దక్షిణాదిన ఎందుకు చెప్పాల్సి వచ్చిందో తెలియదు. ఈ ముక్కలు బీహారులోనో, యు. పి. లోనో చెబితే చాలా బాగుండేది ఉత్తరాదివారు దక్షిణాది భాషలను ఏమైనా సరే నేర్చుకోరని రాష్ట్రపతికి తెలిసే ఉండాలి ఉత్తర భారతంలో పుట్టిన ఉర్దూనే ఔత్తరాహులు నేర్చుకోవటం లేదు. హిందీకంటే మంచి సాహిత్యం ఉన్న బెంగాలీనికూడా వారు నేర్చుకోరు హిందీనొక్కదాన్నే నేర్చుకుంటారు మిగతా భారతీయ భాషల్ని అన్నిటినీ అలక్ష్యం చేసి.

దక్షిణ భారతానికి సంబంధించినంత వరకూ హిందీని బలాత్కారంగా రుద్దటంవలన జరిగినదేమిటంటే, స్కూళ్ళనుంచీ, కాలేజీలనుంచి, కోర్టులనుంచి ఆఫీసులనుంచి హిందీని తొలగించారు భారత దేశపు ప్రజాస్వామ్య సిద్ధాంతాన్నే అగ్ని పరీక్షకు పెట్టినట్లయింది. ప్రభుత్వం తన సిబ్బందిలోనే ముఖ్యంగా తంతి తపాలా సిబ్బందిలోనే క్రమశిక్షణను అమలుచేయలేకపోతోందే, ఇక హిందీని దక్షిణ భారత దేశానికి రాజభాషగా ఎలా అంటగట్టగలుగుతుంది?

మద్రాసు ముఖ్యమంత్రి ఒకరకంగా మార్గదర్శి అయ్యారు. ఆయనకి తమిళంతప్ప మరో భాషరాదు. తమిళేతరులతో మాట్లాడవలసివస్తే దుబాసీలను తెచ్చుకుంటారు ఇలాంటి వారు ముందు ముందు ఇంకా ఎక్కువ కావచ్చు 1965 తరవాత, ఏ కేంద్రమంత్రి అయినా దేశంలో పర్యటించాలంటే తను చెప్పేది ప్రజలకు అర్థం అయ్యేందుకుగాను ప్రత్యేకంగా పెద్దదుబాసీల సిబ్బందిని వెంటపెట్టుకుని వెళ్ళాల్సివుంటుందేమో అప్పుడు మళ్ళీ భారతదేశంలో అంధకారయుగం ఉదయిస్తుంది.



ఆంధ్ర పితామహ
శ్రీ మాడపాటి హనుమంతరావు
ఆంధ్ర ప్రదేశ్ ఎగువ శాసనసభ అధ్యక్షులుగా జూలై 7 న ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

* * *


భారతీయులపై భారతీయులకంటే బ్రిటిష్ వారికే ఎక్కువనమ్మకం ఉన్నట్లు కనిపిస్తోంది. ఈరోజులకంటే బ్రిటిష్ దొరతనం రోజుల్లోనే అధికార సమాచారం తేలిగా లభ్యమయ్యేది.

ప్రభుత్వ ఆర్థికపరిస్థితిని తెలియజేస్తూ దాదాపు 1947 ఆగసు 15 దాకా ప్రతినెలా గెజెట్ లో ఆయవ్యయాలు ప్రకటించేవారు. ఈ పద్ధతిని తరవాత రద్దుచేసేశారు వాణిజ్యానికి సంబంధించిన లెక్కలు కూడా ఆలస్యంగా ప్రకటించటంవలన అవి ఎందుకూ పనికిరాకుండా పోతున్నవి. కస్టమ్సు, ఎక్సైజు ఆదాయాన్నిగూర్చి శాఖాగా ప్రకటించిన లెక్కలు 1958 జనవరి లోవి వీటిని మొన్న 11 వ తేదీన ప్రకటించారు విదేశాలలో భారతీయ వాణిజ్యానికి సంబంధించిన 1957 డిసెంబరు లెక్కలను ఈమధ్యనే పెద్దగ్రంథంగా ప్రకటించారు.

1958 జూన్ రిజర్వుబాంకి నివేదికలో 1957 మార్చితో అంతమైన కాలానికి విదేశీ వాణిజ్యపు లెక్కలను ప్రకటించారు.

1939 వరకూ సైన్యం జాబితాలాగానే ప్రభుత్వ ప్రచురణలుకూడా కొనుక్కోటానికి దొరికేవి. ఈనాడు ఇవి అతిరహస్య పత్రాలుగా పరిగణించబడుతున్నాయి. సైన్యం ఉత్తర్వులను, ఆదేశాలను ప్రచారం నిమిత్తం వార్తాసంస్థలకు ఇదివరలో కొల్లలుగా సప్లయిచేసేవారు ఇప్పుడు వీటిని రహస్యాలుగా పరిగణిస్తున్నారు. ఇప్పుడు వీటిబదులు ప్రతి చిన్న కార్య

(48-వ పేజీ చూడండి)



[ఆదిపర్వము — తృతీయాశ్వాసము]

శ్రీమచ్చళుక్యవంశ శిఖామణి మనుమార్గ రాజ కంఠీరవ వై
ర్యామర ధరణీధర ధరణీమండన ధర్మనిరత నిత్యాభ్యుదయా.

వ్యాసుఁడు జనమేజయునకు భారతకథఁ దెలుప వైశంపాయను నియోగించుట

వ. అక్కథకుండు శౌనకాదిమహామునులకుం జెప్పెనట్లు జనమేజయుం డుపసంహృత సర్పసత్త్రుం డయి యథావిధి సంపూర్ణ దక్షిణల ఋత్విజులను సదస్యులనుం బూజించి దీనానాథజనంబునకుఁ గోరిన ధనంబు లిచ్చి య[illegible] పురాణ పుణ్యకథాశ్రవణ కుతూహలపరుం డగుచు విద్వజ్జన గోష్ఠినుండి యొక్కనాఁడు

మ. పరమబ్రహ్మనిధిం బరాశరసుతుం బ్రహ్మర్షి ముఖ్యుం దయా
పరుఁ గౌరవ్యపితామహుం జనహిత ప్రారంభు గృష్ణాజినాం
బరు నీలాంబుదవర్ణదేహు ననుహూపప్రాంశు నుద్యద్దివా
కరరుక్పింగజటాకలాపు గత రాగద్వేషు నిర్మత్సరున్

వ. వైశంపాయన ప్రభృతి శిష్యవరంబులతో ననేక మునిగణపరివృతుం డయి కనకమణి మయోద్యానంబున నున్న వ్యాసభట్టారకు నతిభక్తి నర్ఘ్యపాద్యాదివిధులం బూజించి వినయ వినమిత శిరస్కుండై నమస్కరించి జనమేజయుం డిట్లనియె.

సీ. ప్రీతితో మీరును భీష్మాదికురువృద్ధ, రాజులు నుండఁడి భూ రాజ్యవిభవ
మెల్ల విభాగించి యిచ్చినం దమతమ వృత్తుల నుండక వీఁగి పాండు
ధృతరాష్ట్రనందనుల్ ధృతి సెడి వారేమి, కారణంబునఁ బ్రజాక్షయముగాఁగ
భారతయుద్ధము పారపరాక్రముల్ సేసిరి మీ పంపు సేయరైరి
ఆ. మొఱఁగి మొఱఁగి వారి నేటికి వారింప, రిట్టిగోత్రకలహ మేల పుట్టె
దీనికల తెఱంగు దెలియంగ నానతి,యిండు నాకు సన్మునీంద్రవర్య

వ. అని యిట్లు పాండవధార్తరాష్ట్ర విభేదన కథాశ్రవణ కుతూహలపరుం డయి యడిగిన జనమేజయునకుం [illegible] కృష్ణద్వైపాయనుండు వైశంపాయనమునిం జూచి శ్రీ మహాభారత కథాఖ్యానం బాద్యంతం బితనికి సవిస్తరంబుగాఁ జెప్పుమని పంచి నన

భారత మహిమ

క. జనమేజయుండు విద్వ, జ్జనపరివృతుఁడై సమస్త జనపాలసభా
జనయోగ్యుని వైశంపా,యనమునిఁ బూజించి వినతుఁడై వినువేడ్కన్

వ. ఆ వైశంపాయనుండును నఖిలభువనవంద్యుం డయిన కృష్ణద్వైపాయన మునీ... నమస్కారంబు సేసి విద్వజ్జనంబుల యనుగ్రహంబు వడసి

సీ. కమనీయ ధర్మార్థ కామమోక్షములకు, నత్యంతసాధనం బయినదాని
వేడ్కతోఁ దవిలి తన్ వినుచున్న వారల, కభిమతశుభకరం బయినదాని
రాజుల కఖిలభూ రాజ్యాభివృద్ధిని, త్యాభ్యుదయప్రదం బయినదాని
వాఙ్మనఃకాయ ప్రవర్తితానేకజన్మాఘనిబర్హణం బయినదాని

ఆ. సత్యవాక్ప్రబంధ శతసహస్రశ్లోక,సంఖ్యమయినదాని సర్వలోక
పూజ్య మయినదాని బుధనుతవ్యాసమహాముని ప్రణీత మయినదాని.

చ. వినుతపరాక్రముల్ ధృత వివేకులు సత్యసమన్వితుల్ యశో
ధనులు కృతజ్ఞు లుత్తములు ధర్మపరుల్ శరణాగతానుకం
పను లనఁగాఁ బ్రసిద్ధు లగు భారతవీరుల సద్గుణానుకీ
ర్తనముల నొప్పుదాని విదితం బగుదాని సభాంతరంబులన్.

శా. ఆయుష్యం బితిహాసవస్తుసముదాయం బైహికాముష్మిక
శ్రేయఃప్రాప్తినిమిత్త ముత్తమసభా సేవ్యంబు లోకాగమ
న్యాయైకాంతగృహంబు నాఁ బరఁగి నా నావేదవేదాంతవి
ద్యాయుక్తం బగుదానిఁ జెప్పఁ దొడఁగెం దద్భారతాఖ్యానమున్.

ఉపరిచరవసు మహారాజు వృత్తాంతము

వ మఱియు నిట్టి శ్రీమహాభారతంబునకుం గర్త యయిన శ్రీ వేదవ్యాసుని జన్మంబు సవిస్తరంబుగాఁ జెప్పెద వినుము

సీ వాసవప్రతిముండు వసు వనునాతండు, చేదిభూనాథుండు శిష్టలోక
నుతకీర్తి మృగయావినోదార్థ మడవికిఁ, జని యొక్క మునిజనాశ్రమమునందు
నిర్వేదమున మహానిష్ఠతో సన్న్యస్త,శస్త్రుఁడై తపమొప్పఁ జలుపుచున్న
నాతనిపాలికి నమరగణంబుతో, నింద్రుండు వచ్చి తా నిట్టు లనియె

ఆ ధరణిఁ బ్రజఁ గరంబు దయతోడ వర్ణధ,ర్మాభిరక్షఁ జేసి యమలచరిత
నేలి రాజ్యవిభవ మిది యేల యని తపశ్చ,రణ నునికి నీక చనియె ననఘ.

వ నీవర్ణధర్మప్రతిపాలనంబునకుఁ దపంబునకు మెచ్చితి నీవు నాతోడం జెలిమి సేసి నాయొద్దకు వచ్చుచుం బోవుచు మహీరాజ్యంబు సేయుచునుండు మని వానికి దేవత్వంబును గనకరత్నమయం బైన దివ్యవిమానంబును నెద్దానినేని తాల్చిన నాయుధంబులు దాఁకనోడు నట్టివాడని వనజంబులు గలిగిన యింద్రమాలయను కమలమాలికయును దుష్టనిగ్రహశిష్టపరిపాలన క్షమంబైన యొక్క వేణు యష్టియు నిచ్చిన నవ్వసువును దద్విమానారూఢుండై యుపరిలోకంబునం జరించుటం జేసి యుపరిచరుండు నాఁ బరఁగి యక్కమలమాలికయుఁ దనకుం జిహ్నంబుగా నవ్వేణుయష్టికి మహావిభవంబు మెఱసి యేఁటేఁట నింద్రోత్సవం బను నుత్సవంబు సేయుచు నీశ్వరునకు నింద్రాది దేవతలకు నతిప్రీతి సేసె నది మొదలుగా రాజు లెల్లం బ్రతిసంవత్సరంబు నింద్రోత్సవంబు సేయు చుండుదురు

క. ఘనముగ నయ్యింద్రోత్సవ,మొనరించు మహీపతులకు నొగి నాయుర్వ
ర్ధనము నగుఁ బెరుఁగు సంతతి,యనవరతము ధరణిఁ బ్రజకు నభివృద్ధియగున్.

వ అట్టి యింద్రోత్సవంబున నతిప్రీతుం డయిన యింద్రువరంబున నుపరిచరుండు బృహద్రథమణివాహన సౌబల యదు రాజన్యు లనియెడి కొడుకుల నేవురం బడసి వారలం బెక్కు దేశంబుల కభిషిక్తులం జేసిన నయ్యేవురు వసువులు వేఱువేఱ వంశకరులయి పరఁగి ర ట్లుపరిచరుండు లబ్ధసంతానుం డయి రాజర్షి యయి రాజ్యంబు సేయుచు నిజపుర సమీపంబునం బాఱిన శుక్తిమతియను మహానదిం గోలాహలంబను పర్వతంబుగాంచి యడ్డంబు వడినదానిం దన పాదంబునం జేసి తలఁగం ద్రోచిన నన్నదికిఁ బర్వతసమాగమంబున వసుపదుం డను కొడుకును గిరిక యను కూఁతురుం బుట్టిన నయ్యిరువురను శుక్తిమతి దద్దయు భక్తిమతియై గిరినిరోధంబువాయ నుపకారంబు సేసిన యుపరిచరునకు మెచ్చి కానిక యిచ్చిన నాతండు వసుపదుం దనకు సేనాపతిం జేసికొని గిరికం దనకు ధర్మపత్నింగాఁ జేకొని యున్నంత నగ్గిరిక ఋతుమతి యయిన దీనికి మృగమాంసంబు దెచ్చి పెట్టుమని తన పితృదేవతలు పంచిన నప్పు డయ్యుపరిచరుండు మృగవధార్థంబు వనంబున కరిగి

సీ. పలుకుల ముద్దును గలికిక్రాల్గన్నుల, తెలివును వలుఁద చన్నులబెడంగు
నలఘుకాంచీపద స్థలములయొప్పును, లలితాననేందు మండలమురుచియు
నళినీలకుటిలకుంతలములకాంతియు, నెలజవ్వనంబున విలసనమును
నలసభావంబున పొలుపును మెలుపును, గలుగునగ్గిరికన తలఁచి తలఁచి

ఆ. ముదితయందుఁ దనదు హృదయంబు నిలుపుటఁ, జేసి రాగమడర భాసురముగ
రమణతోవనాంతరమున రేతస్స్కంద, మయ్యె నవనిపతికి నెయ్యె మొనర.

వ అయ్యమోఘ వీర్యం బొక్కయ జీర్ణపర్ణపుటంబున నిమ్ముగా సంగ్రహించి యొక్కడేగ యఱుతంగట్టి దీనిం గొని పోయి గిరిక కిమ్మని యుపరిచరుండు పనిచిన నదియు నతి త్వరితగతి నాకానం గడచి యాకాశంబునం బఱచు నప్పుడు

క. ఆమిష మని దానిం గొనఁగా మది నమకట్టి ఖగ మాఖగముఁ
వ్యోమమునఁ దాఁక దివి సంగ్రామం బొరెంటి కయ్యెఁ గడురభసమునన్

క. సునిశితతుండహతిని బ్రవస్సినపర్ణపుటంబు వాసి చెదరుచు నృపనం
దనువీర్యము యమునానది,వనమధ్యమునందు వాయువశమునఁ బడియెన్.

వ తొల్లి బ్రహ్మశాపనిమిత్తంబున నద్రిక యను నప్సరస యమునయందు మీనయి క్రుమ్మరుచున్నయది యవ్వసువీర్య బిందుద్వయంబు త్రావి గర్భంబు దాల్చిన దశమమాసంబునందు

తే తెరలవల వైచి జాలరి దిగిచి దాని,యుదరదళనంబు సేయ నం దొక్కకొడుకు
నొక్కకూఁతును గనివారి నొసఁగఁదెచ్చి, దాశరాజున కొప్పించెఁ దక్షణంబ.

మత్స్యగంధి వృత్తాంతము

వ అయ్యద్రికయు మానుషప్రసవం బొనరించినం దనకు శాపమోక్షణంబగునని బ్రహ్మవచనంబు గలుగుటం జేసి మీనయోని విడిచి దివ్యవనిత యయి దేవలోకంబునకుం జనియె మఱియును మత్స్యోదరంబునఁ బుట్టినయక్కొడుకు మత్స్యరాజు నాఁ బరఁగి ధర్మపరుండయి మత్స్యదేశంబున కధిపతియయ్యె నక్కూఁతును దాశరాజు దనకూఁతుంగాఁ జేకొని పెంచినం బెరుఁగుచు

క. అంబుజముఖి యక్కన్య ప్రియంబొనరఁగ మత్స్యగంధి యనఁగా ధర్మా
ర్థంబుగఁ దనతండ్రి నియోగంబున నయ్యమున నోడఁ గడపుచునుండెన్.

వ అంత

చ గతమదమత్సరుండు త్రిజగద్వినుతుండు వసిష్ఠపౌత్త్రుఁ డు
న్నతమతి శక్తిపుత్త్రుఁ డఘ నాశన ఘోరతపోధనుండు సు
వ్రతుఁ డయి తీర్థయాత్ర చను వాఁడు పరాశరుఁ డన్మునీంద్రుఁ డ
య్యతివఁ దలోదరిం గనియె నయ్యమునానదిరేవునన్.

వ ఇట్లేకతంబయేకవస్త్రయై యోడనెక్క వచ్చువారి నిరీక్షించుచున్న సత్యవతింజూచి యామునివరుండు దానియందు మదనపరవశుండై దాని జన్మంబు దన దివ్యజ్ఞానంబున నెఱింగి యయ్యోడ యెక్కిదానితో నొక్కటఁ జనిచని,

సీ. చపలాక్షిచూపుల చాడ్పున కెడ మెచ్చుఁ, జిక్కని చనుఁగవ జీఱఁ గోరు
నన్నువకౌఁదీఁగ యందంబుమది నిల్పు, జఘనచక్రంబుపైఁ జలుపుదృష్టి
యభిలాష మేర్పడు నట్లుండఁగాఁ బల్కు, వేడ్కతో మఱుమాట వినఁగఁ దివురు
నతిఘనలజ్జావనత యగునక్కన్య, పైఁ బడి లజ్జయుఁ బాపఁ గడఁగు

ఆ. నెంతశాంతు లయ్యు నెంతజితేంద్రియు, లయ్యుఁ గడువివిక్త మయినచోట
నతులగోష్ఠిఁ జిత్త చలన మొందుదు రెందుఁ,గాముశక్తినోర్వఁ గలరెజనులు.

వ ఇట్లు విగతలజ్జాపరవశుండయి మునివరుండు దన యభిప్రాయం బక్కన్యక కెఱింగించిన నదియును దీనికొడం బడనినాఁడు నాకలిగి యిమ్మునిశాపంబిచ్చునోయని వెఱచి యిట్లనియె

తరలము తనువు మీనొ్సల వల్చుజాలరి దాన నట్లును గాక యే
ననఘ కన్యకఁ గన్యకావ్రత మంతరించిన నెట్లు మ
జ్జనకునింటికిఁ బోవ నేర్తుఁ బ్రసాదబుద్ధి యొనర్చు న
న్మునిగణోత్తమ నాకు దోష విముక్తి యెట్లగు నట్లుగాన్

వ అనిన నమ్మునివరుండు గరంబు సంతోషించి నాకు నిష్టంబుసేసిన దాన నీ కన్యాత్వంబు దూషితంబుగా దోడకుమని దానికి వరంబిచ్చి నీవు వసువను రాజర్షివీర్యంబునం బుట్టినదానవు గాని సూతకుల ప్రసూతవుకావని చెప్పి దాని శరీర సౌగంధ్యంబు యోజనంబునంగోలె జనులకు నేర్పడునట్లుగాఁ బ్రసాదించిననది గంధవతి యనియు యోజనగంధి యనియుఁ బరఁగి తత్ప్రసాదంబున ననేక దివ్యాంబరాభరణభూషితయు నయి యమునానదీద్వీపంబున నోడ పేర్చి

తే. ఎల్లవారును జూడంగ నిట్టిబయల, నెట్లు సంగమ మగు నని యింతి యన్న
నమ్మునీంద్రుండు గావించె నప్పు డఖిల,దృష్టిపథరోధినీహార తిమిర మంత.

శ్రీ వేదవ్యాసమునీంద్రుని యవతారము

క. పరమేష్ఠికల్పుఁ డగున,ప్పరాశరుసమాగమమునఁ బరమగుణైకా
భరణకు ననవద్యమనో,హరమూర్తికి సత్యవతికి నమ్మునిశక్తిన్.

క. సద్యోగర్భంబున నహి,మద్యుతితేజుండు వేద మయుఁ డఖిలమునీం
ద్రాద్యుఁడు వేదవ్యాసుం, డుద్యజ్జ్ఞానంబుతోడ నుదితుం డయ్యెన్.

ఆ. ఆయమునాద్వీపమున న,మేయుఁడు కృష్ణుండు పుట్టి మెయిఁ గృష్ణద్వైఁ
పాయనుఁ డనఁ బరఁగి వ్రచ,శ్శ్రియుతుఁడు దపంబువలనఁ జిత్తము నిలిపెన్.

వ. పరాశరుండు సత్యవతి గోరినవరంబు లిచ్చి నిజేచ్ఛ నరిగె నంతఁ గృష్ణద్వైపాయనుండును కృష్ణాజినపరిధానకపిల జటామండలదండక మండలుమండితుండై తల్లిముందట నిలిచి కరకమలంబులు మొగిచి మ్రొక్కి మీకుం బని గల యప్పుడ నన్నుం దలంచునది యాక్షణంబ వత్తునని సకలలోకపావనుండఖిలలోక హితార్థంబుగాఁ దపోవనంబునకుం జని యందు మహాఘోరతపంబు సేయుచు

ఉ. సంచితపుణ్యుఁ డంబురుహ సంభవువంశము దాల్చి పుట్టి లో
కాంచితుఁ డైనవాఁడు నిఖిలాగమపుంజము నేర్పడఁ విభా
గించి జగంబులందు వెలిఁ గించి సమస్తజగద్ధితంబుగాఁ
బంచమవేద మై పరఁగు భారతసంహితఁ జేసె నున్నతిన్.

వ. అనిన విని జనమేజయుండు వైశంపాయనున కిట్లనియె

సీ. అభ్యస్తవేదవేదాంగులు విధిదత్త, దక్షిణాప్రీణిత ధరణిదేవు
లనవరతాశ్వమేధావభృథస్నాన,పూతమూర్తులు కృత పుణ్యు లహిత
వర్గజయుల్ ప్రాప్త వర్గ చతుష్టయుల్, సత్యాదిసద్గుణ జన్మనిలయు
లాభరతాదిమహామహీపాలకు, లిద్ధయశోర్థు లెం దేనిఁ బుట్టి

ఆ. రట్టికౌరవాన్వ యంబుఁ బాండవన్నృప,రత్నములకు వారి రాశి యైన
దాని వినఁగ వలతుఁ దద్దయుఁ బ్రీతితో, విప్రముఖ్య నాకు విస్తరింపు.

వ. అని యడిగిన జనమేజయునకు వైశంపాయనుం డిట్లనియె.

కౌరవవంశ వివరణము

చ. నిరుపమధర్మమార్గపరినిష్ఠితు లై మహి నెల్లఁ గాచుచుం
బురఁగినతొంటిపూరుకురు పాండుమహీశులపేర్మిఁ జేసి భూ
భరవహనక్షమం బగుచుఁ బౌరవకౌరవపాండవాన్వయం
బురుగుణసంపదం బెరిగిఁ యొప్పె సమస్తజగత్ప్రసిద్ధమై

వ. అది యెట్లనినం దొల్లి దాక్షాయణియైన యదితికిఁ గశ్యపునకుం బుట్టిన వివస్వంతునకు వైవస్వతుం డనుమనువును యముండును శనైశ్చరుండును యమునయుఁ దపతియు ననం బుట్టి రందు వైవస్వతుం డనుమనువువలన బ్రహ్మక్షత్రియవైశ్యశూద్రాదు లైనమావులు పుట్టిరి మఱియు వానికి వేనప్రముఖు లైన రాజులేఁబండ్రు పుట్టి వంశకరు లై తమలోన యుద్ధంబు సేసి చనిరి మఱియు నమ్మనుపుత్త్రి యైన యిల యనుదానికి సోమపుత్త్రుం డైన బుధునకుఁ బురూరవుండు పుట్టి చక్రవర్తి యై

క. ఇమ్మహిఁ ద్రయోదశద్వీ,పమ్ములు దనశౌర్యశక్తిఁ బాలించి మదాం
ధ్యమ్మున విప్రోత్తమవి,త్తమ్ములు దానపహరించె ధనలోభమునన్.

క. విని దాని నుడుపఁగా బ్రహ్మనియుక్తుం డై సనత్కుమారుఁడు మహికిం
జనుదెంచె బ్రహ్మలోకం,బుననుండి యనేకదివ్య మునిసంఘముతోన్.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
బాలల సంఘం

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 1958 జులై 1-వ తేదీ నుంచి 'బాలలసంఘం' స్థాపించాము జులై 1-వ తేదీ నాటికి 15 సంవత్సరాల వయస్సు నిండని, ఐదేళ్ళ వయస్సుకు తక్కువ గాని ప్రతి తెలుగుబాలుడూ, బాలికా సభ్యత్వం పొందవచ్చు సభ్యత్వానికి రుసుమేమీ చెల్లించవలసిన పనిలేదు తెలుగు బాలబాలికలందరూ వెంటనే సభ్యులుగా చేరి సచిత్ర వారపత్రిక అప్పుడప్పుడు నిర్వహించే చిన్న చిన్న పోటీలలో పాల్గొని "సంఘం" ఆశయాలను జయప్రదం చెయ్యడానికి సహాయపడతారని ఆశిస్తున్నాము.

గమనిక

పదకొండు మొదలు 15 సంవత్సరాలవరకూ వయస్సుగలవారిని 'A' వర్గంగానూ, ఆరు మొదలు 10 సంవత్సరాల వయస్సువరకూ గల వారిని 'B' వర్గంగానూ విభజించడం జరుగుతుంది

ముఖ్య విషయాలు

సభ్యులుగా చేరదలచిన బాలబాలికలు చేయవలసిందొకటే. దీనితోపాటు ఒక సభ్యత్వపు దరఖాసును ముద్రిస్తున్నాము అందులోని ఖాళీ స్థలాలను మీ వివరాలతో జాగ్రత్తగా నింపి (కొట్టివేతలు, దిద్దుపులు వుండకూడదు) ఆ అచ్చు దరఖాస్తును తిన్నగా కత్తిరించి కవరులో.

సంపాదకుడు,

ఆంధ్ర పత్రిక సచిత్ర వారపత్రిక,
తంబుచెట్టివీధి, మద్రాసు-1

అనే చిరునామాకు పంపాలి కవరుమీద వెనుకవైపు "సచిత్ర వారపత్రిక బాలల సంఘం" అని స్పష్టంగా వ్రాయాలి మామూలు కాగితాలమీద వ్రాసిపంపే దరఖాస్తులను స్వీకరించము

ఒక్కొక్క దరఖాస్తుమీదా ఒక్కొక సభ్యుని, లేదా, సభ్యురాలి పేరుమాత్రమే వుండాలి సభ్యత్వపు దరఖాస్తును సచిత్ర వారపత్రికలో సాధ్యమైనంతవరకు వారం వారం ప్రచురిస్తుంటాము

సభ్యులుగా చేర్చుకున్నట్లు ఒక్కొకరి పేరా విడివిడగా ఒక్కొక సభ్యత్వపు కార్డును పంపుతాము ఆ కార్డుమీద సభ్యత్వ క్రమాన్ని సూచించే ఒక సంఖ్య వుంటుంది ముందు ముందు సభ్యులుగాని, సంఘంగాని జరిపే ఉత్తర ప్రత్యుత్తరాలలో ఆ సంఖ్యను ఉదహరిస్తూండడం జరుగుతుంది.

పదిహేనేళ్ళ వయస్సు పూర్తికాగానే, ఆ తేదీతో బాలల సంఘంలో సభ్యత్వం దానంతటదే రద్దయిపోతుంది

లక్ష్యాలు

(1) సభ్యులుగా చేరే బాలబాలికలను ఆరుమొదలు పదేళ్ళవరకూ ఒక వర్గంగానూ (B) పదకొండు మొదలు పదిహేనేళ్ళ వరకూ మరొక వర్గంగానూ (A) విభజించి ఉభయ వర్గాలకూ విడివిడిగా అప్పుడప్పుడు రెండురకాల పోటీలు నిర్వహించి ప్రథమశ్రేణిలో నెగ్గేవారికి మాకుతోచిన బహుమతుల నివ్వడం (ఈ విషయంలో పోటీనిర్వహణకర్తలదే తుదినిర్ణయం)

(2) సభ్యులలో వారివయస్సుకు తగినట్లుగా రచనా[illegible], పరనాసక్తినీ, కళాభిమానాన్నీ యథా[illegible] పెంపొందచేయడం

(3 [illegible]చిత్రలేఖనం, నృత్యం అభినయం, గాత్ర[illegible]ణ, వయొలిన్ మొదలయిన లలిత కళలల[illegible], వ్యాయామక్రీడలలోనూ ప్రత్యేక అభిరు[illegible] ప్రవేశం కనబరిచే బాలబాలికలను బహుమ[illegible]ద్వారానూ తదితర విధంగానూ ప్రోత్స[illegible]హించడం

(4) [illegible] ప్రాంతంలో నివసిస్తున్నవారైనప్పటికీ తెలుగు బాలబాలికలందరిమధ్యా స్నేహ సమైక్యభావాలను పెంపొందజేయడం

(5) ఉన్నత పాఠశాలలలో చదివే విద్యార్థులకు ఉచిత విద్యార్థివేతనాలను బహూకరించడం (దీనికి సంబంధించిన వివరాలను ముందు ప్రకటిస్తాము)

ఆంధ్ర సచిత్ర వారపత్రిక
బాలల సంఘం
[సభ్యత్వపు దరఖాస్తు]

GROUP
A లేక B

సభ్యుని (సభ్యురాలి) పూర్తిపేరు (విడివిడి అక్షరాలలో)

ఏండ్లు : నెలలు :

పుట్టినతేదీ నెల, సంవత్సరం జులై 1 నాటికి వయస్సు .

తండ్రి లేక సంరక్షకుని పూర్తి పేరు ,

ఊరిపేరు, జిల్లా, తాలూకా పోస్టు [వీధి నెంబరు] .

* చదువుతున్న తరగతి, లేక, ఫారము : .

పాఠశాల పేరు .

ప్రధానోపాధ్యాయునిపేరు (తెలిస్తే) :

ఆర్యా

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘములో నన్ను సభ్యునిగా/సభ్యురాలుగా చేర్చుకొనప్రార్థన పై వ్రాసిన విషయాలన్నీ యదార్థములు. ఇట్లు

[తేదీ : -1958] (సంతకము)

* పరా వి పాఠశాలలోనూగాక ఇంటివద్దనే ట్యూషన్ చెప్పించుకొనే బాలబాలికలు కూడా సభ్యులుగా చేరవచ్చు 'చదువుతున్న తరగతి' అనే విషయానికి ఎదురుగా 'ప్రైవేట్ స్టడీ' అని వ్రాయాలి

సంచిక: **23-7-58** | ఈ దరఖాస్తు **26-7-58** నాటికి మాకు చేరాలి

★ కొందరు సభ్యుల పేర్లు ★

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘంలో ఇప్పటివరకు సభ్యులుగా చేరిన వారిలో మరికొందరి పేర్లను ఇక్కడ ప్రచురిస్తున్నాము. సభ్యత్వపు కార్డులు తయారవుతున్నవి, సాధ్యమైనంత త్వరలో వాటిని సభ్యులకు అందజేస్తాము.

(1) కె రేణుకారామ్ (కాకినాడ) (2) నంబూరి సత్యనారాయణరావు (విజయవాడ) (3) చెన్నూరి ఆనంద్ (తణుకు) (4) అజీజుల్లాఖాన్ (గుంటూరు) (5) వెలగల గోపాలకృష్ణారెడ్డి (తాడేపల్లిగూడెం) (6) పర్నా కవితారత్నం (ఇలెందు, ఖమ్మంజిల్లా) (7) తల్లం తాతారావు (గుంటూరు) (8) కొండపల్లి సత్యకుమారి (ఉప్పాడ, తూ॥ గో) (9) మార్గాండపల్లి వెంకటకమలాకరం (తాడికొండ, గుంటూరుజిల్లా) (10) పసుమర్తి వెంకటరామకనకఆంజనేయులు (తాడికొండ) (11) అద్దంకి వెంకటలక్ష్మీ హనుమంతరావు (నాయునిపల్లె, వేటపాలెంపోస్టు, గుంటూరుజిల్లా) (12) ఎడుమూరు నరసారావు (బోయినపల్లె, బద్వేలు తా॥ కడపజిల్లా) (13) గోవిందవఝుల బాలగోపాలరావు (విజయవాడ) (14) కుమ్మలూరు సత్యలక్ష్మి (విశాఖపట్నం) (15) శిరిగిబత్తిన నారాయణరావు (కొవ్వూరు) (16) రాయచూరి లక్ష్మీ వైజయంతి (హైదరాబాదు) (17) గడ్డం సుమిత్ర (నెల్లూరు) (18) నాగంటి మీనాక్షి (విశాఖపట్నం) (19) టి. కస్తూరి (చిత్తూరు) (20) రామచంద్రుని శశికళ (మద్రాసు).

(21) వోరుగంటి సోమసుందరరావు (బలిజిపేట, శ్రీకాకుళంజిల్లా) (22) సామినేని వెంకటమాధవ (విశాఖపట్నం) (23) కె ఎం. ఆనందమూర్తి (చంద్రగిరి, చిత్తూరుజిలా) (24) గుంటూరు గోపాల సత్యనారాయణ (విశాఖపట్నం) (25) పాలపర్తి శివరామప్రసాద్ బాబు (గుడివాడ) (26) తాడిమేటివెంకటచలం (అత్తిలి) (27) గోడాబాల సరస్వతీదేవి (విశాఖపట్నం) (28) కోటనరసింహ విఠల్ (అనంతపురం) (29) సి కె. ఎస్ రమణి (మద్రాసు) (30) జొన్నవాడ ఇందిర (హైదరాబాదు) (31) చావలి శివసుబ్రహ్మణ్యం (కదిరి, అనంతపురం జిల్లా) (32) చిరుమామిళ్ళ అన్నపూర్ణకుమారి (చల్లపల్లి) (33) మద్దిపూడి సూర్యభాస్కరం (ఉలిమేశ్వరం, తూ॥గో॥జిల్లా) (34) చల్లా కృష్ణ (కాకినాడ) (35) రాయసం వెంకట హనుమంతరావు (విజయవాడ) (36) కోడవరలక్ష్మీబాయి (అక్కుపల్లి, శ్రీకాకుళం జిల్లా) (37) మోటుపల్లి మూరు శ్రీరామ్ (కరోల్ బాగ్, న్యూఢిల్లీ) (38) వి. రవి (దిగువమాఘం, చిత్తూరుజిల్లా) (39) డి సుధాకర్ నాయుడు (దిగువమాఘం) (40) చింతా శ్యామలరావు (నర్సాపురం, ప॥గో)

(41) పతాసేని సరేశ్వరరావు (అంగర, తూ॥ గో॥) (42) సి దీనదయాళు చౌదరి (కమతంపల్లె, చిత్తూరు) (43) గురజాడ దుర్గాప్రసాదరావు (విజయనగరం) (44) మామిడన్న సుబ్బలక్ష్మి (రాజమండ్రీ) (45) వెణుతురుపల్లి సూర్యకాంత విశాలాక్షి (ఎలమంచిలి, విశాఖ జిల్లా) 46 కూచిభొట్ల భాస్కరరావు (విశాఖపట్నం) 47. అంగర నాగుబాయి (కొవ్వులపాలెము, తూ॥ గో॥) 48 పాటిబండ్ల సత్యనారాయణ (జంపని, గుంటూరుజిల్లా) 49 దువ్వూరి సుందరం (కాకినాడ) 50. సోల ప్రభావతి (నెల్లూరు) 51 అద్దంకి హైమవతి (నెల్లూరు) 52. పాలడుగు సతీష్‌కుమార్ (ఆత్కూరు, కృ॥ జి) 53 గోవుల చెన్నకేశవరెడ్డి (గద్వాల, మహబూబ్‌నగర్ జిల్లా) 54. జి. శివశంకర్ (ఇచ్ఛాపురం, శ్రీకాకుళం జిల్లా) 55 మన్ని సుదర్శనం (మధురపాకం, చెంగల్పట్టుజిల్లా) 56 పి. మధుసూదనరావు (నెల్లూరు) 57 ఎం ఎస్. బెనరీ (కర్నూలు) 58 ఉప్పలూరి దుర్గా విజయలక్ష్మి (మద్రాసు) 59 దండా భార్గవీ రెడ్డి (కణేకల్, అనంతపురంజిల్లా) 60 పి. విజయలక్ష్మి (రాజోలు, తూ॥ గో॥)

61 ఒగేటి సుబ్రహ్మణ్యమూర్తి (తాడేపల్లి గూడెము) 62. ముదునూరి లక్ష్మీనరసింహ సుబ్బరాజు (రాజమండ్రీ) 63. పంతుల నారాయణరావు (శ్రీకాకుళం, 64 వాడపల్లి కాంతామణి (భీమవరం, ప॥ గో॥) 65 జి. వి శ్రీనివాసరావు (విజయవాడ) 66 గండికోట వెంకట సోమయాజులు (చీపురుపల్లి, శ్రీకాకుళం జిల్లా) 67 జావెంపాటి వీరవరలక్ష్మి (భీమడోలు, ప॥ గో) 68 తాళ్లూరు నాగేందురేఖ (కాళహస్తి) 69. కూచిమంచి అన్నపూర్ణ (సామర్లకోట) 70 గండికోట శివకామసుందరి (చీపురుపల్లి, శ్రీకాకుళంజిల్లా) 71. జోస్యుల గౌరీదేవి (కలకత్తా) 72. బి. లక్ష్మి (చిత్తూరు) 73 అంగర ఉషారాణి (మేడపాడు, తూ॥ గో॥) 74 సర్వాభట్ల వెంకటసుబ్బమ్మ (కడప) 75 సువ్వా పరమేష్ (కర్నూలు) 76. పి. వెంకన్‌గౌడ్ (గద్వాల్, మహబూబ్‌నగర్ జిల్లా) 77. ఓ. దామోదరరావు (వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లా) 78. వి. సూర్యప్రకాశరావు (విజయవాడ) 79 కైగాల కృష్ణ (వీరేశ్వరపురం, ప॥ గో॥) 80. కాకాని వీర వెంకట సత్యనారాయణమూర్తి (హైదరాబాదు).

81. రామరాజు లక్ష్మీనారాయణమూర్తి (గుంటూరు) 82 యండమూరిసూర్యకుమారి (విజయనగరం) 83. తటవర్తి నారాయణరావు (కానూరు, ప॥ గో॥) 84 గరిమెళ్ల భాను (చోడవరం, విశాఖజిల్లా) 85. గ్రంథి దండాయుధపాణి (అనకాపల్లి, విశాఖజిల్లా) 86 అల్లమరాజు వెంకట రామకృష్ణ (బరంపురం, గంజాంజిలా) 87 అబ్బూరి విశ్వేశ్వరరావు (కాకినాడ) 88 యగళ్ల రామకృష్ణ (శ్రీకాకుళం) 89 మోదర్ల శ్రీహరికృష్ణ (భీమవరం) 90 శ్రీపతి హనుమచ్ఛాస్త్రి (బాపట్ల) 91. రామడుగు రామమోహనరావు (మార్కాపురం, కర్నూలుజిల్లా) 92 వై. జితేంద్ర రెడ్డి (నెల్లూరు) 93 కమతం మార్కండేయులు (నెల్లూరు) 94. అలవలపాటి పార్వతి (అగడూరు, కడపజిల్లా) 95. మేడూరి మధుసూదనరావు (చీరాల) 96. ఏ. రుక్మిణీదేవి (ప్రొద్దుటూరు, కడపజిల్లా) 97. జి. సత్యనారాయణ (సంగారెడ్డి, మెదక్) 98. మావులేటి మధుసూదనరాజు (గుండుగొలను, ప॥ గో) 99. ఎస్. కస్తూరిబాయ్ (చిత్తూరు) 100 కల్లె వెంకటేశ్వరరావు (కాకినాడ) 101. కేసరి బాలలింగము (విజయవాడ) 102. కింతలి చంద్రమోహనరావు (బరంపురం.)

—వచ్చేవారం మరికొన్ని

కూచిపూడి నాట్యం

కూచిపూడి నాట్యకళపై ఇటీవల రేగిన దుమారం ఒకవిధంగా మంచికే నని పిస్తోంది. కూచిపూడి నాట్యం శాస్త్ర బద్ధమైనది కాదంటే సాధారణంగా ఎవ్వరూ ఒప్పుకోరు. నిజంగా ప్రతి ఆంధ్రుడూ తన సంస్కృతి చిహ్నంగా చెప్పుకొని గర్వించ దగ్గది కూచిపూడి నాట్యం! కాని, అసలు విషయాలు ఈ వాదోపవాదాలలో మరుగు పడి పోతున్నాయేమోనని నా బాధ! కూచిపూడి నాట్యకళ ప్రస్తుత పరిస్థితులలో ఎంత వరకు సజీవంగావుంది? ఈ స్థాయికి దిగజారటానికి కారణం యెవరు? సిద్ధేంద్ర యోగికి ఎంతవరకు భక్తిశ్రద్ధలు చూపుతున్నారు?" అని ప్రశ్నలు వేసుకొని హృదయపూర్వకంగా జవాబులు చెప్పుకొన్నట్లయితే కూచిపూడి నాట్యకళ ప్రస్తుత స్వరూపంగా గోచరమవుతుంది.

వేదిక పైకెక్కి ఐదారు ముద్రలుపట్టి, కళ్ళుత్రిప్పి, మూతిటు విరిచి, నాలుగు గంతులువేసి ఘనంగా వుపన్యాసం దంచి కళామతల్లి కన్నీరు కారుస్తోందని కల్లబొల్లి కబుర్లుచెప్పి వాపోయే కొందరు మహారథుల వల్ల నే గదా నేటికీ స్థితి దాపురించింది? క్షుణ్ణంగా, దీక్షతో, అదొక పరమపవిత్ర కార్యంగా ఈ నాట్యకళను అభ్యసించిన వారు బహు కొద్దిమంది శాస్త్రాన్ని సలక్షణంగా చెప్పగల కళాప్రపూర్ణులు కరువయ్యారు. నిన్న మొన్నటి వరకు మన కళ్ల యెదుట నిలచి, కూచిపూడి నాట్యకళకు ఒకదారి యేర్పరచమని వేడుకొన్న కళాప్రపూర్ణులు వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రిగారు జీవించి వున్నంతవరకూ అటు ప్రభుత్వంగాని, ఇటు రసజ్ఞులుగాని, వారి ఆశయాలు కార్యరూపం దాల్చటాని కేమాత్రమూ సహాయకారులు గాకపోయారు. తీరా ఇప్పుడు ప్రతివారూ ఆందోళన వెలిబుచ్చేవారే!

ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఎవరో ఒకరు కాదన్నంతమాత్రాన, లేదా, ఏకాడమీవారు గుర్తించినంత మాత్రాన కూచిపూడినాట్యం శాస్త్రీయం గాకపోదు, కూచిపూడి నాట్యకోవిదులు, కళాకారులు, ఒక సమావేశం జరిపి, భావ్యత్కార్య క్రమం నిర్ణయించుకొని, కూచిపూడినాట్య


కొమాండూరి
రామానుజాచార్య

పునరుద్ధరణకు పూనుకోవాలి కూచిపూడి నాట్యం సంస్కరింప బడవలసిన అవసరం ఎంతైనావుంది. ముఖ్యంగా సాహిత్య పరంగా కొన్ని లోపాలున్నాయి క్రమశిక్షణకూడా కొంత కఠినతరం చేయవలసిన అవసరంవుంది

భారతీయనాట్యంలో ఒక ప్రధాన విభాగంగా పేర్కొనబడుతున్న "కథకళి"కి కూడా ఒకప్పుడు, నేడు కూచిపూడి నాట్యానికి పట్టిన దుస్థితే పట్టింది శ్రీ. శ్రీ. మహాకవి వల్లత్తోళ్ "కేరళ కళా మండలమ్"ను స్థాపించేటంతవరకూ దాన్ని శాస్త్రీయమైన నాట్యపద్ధతిగా గుర్తింపులేక పోయింది వారు దాన్ని సంస్కరించి, యువనటులను చేరదీసి వారికి కట్టుదిట్టంగా నాట్యశిక్షణ గరపి, 'కథకళి'కి విశేషప్రచారం తీసుకరాగలిగారు. నేడు కూచిపూడి కళాకారులు కూడా ఇటువంటి కష్టనష్టాలను ఎదుర్కొనవలసివుంది ఇదే పరిస్థితి మరికొంతకాలం సాగినట్లయితే కూచిపూడి నాట్యానికి మనుగడే లేకపోవచ్చు సంగీత, సాహిత్య, నాట్యశాస్త్రాలలో నిష్ణాతులైన కళావేత్తలు ఒకచోటజేరి కూచిపూడినాట్య సంస్కరణకు, సముద్ధరణకు పూనుకోవాలి. విశ్వనాథ, రాళ్ళపల్లివంటి వారల సహకారాలతో కూచిపూడివారు తమ నాట్యకళకు మెరుగులు దిద్దుకోవాలి అందుకు ఉదారులు సహాయం చేయాలి తిరుపతిలో స్థాపింపబడే సంగీత కళాశాలలో అన్నమాచార్యుల కీర్తనలతో బాటు, కూచిపూడినాట్యకళకుకూడా ఒక విభాగం ఏర్పరచాలి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి వంటి కళావేత్తలు, రసజ్ఞులు వున్నారు. అక్కడ నాట్యకళకు ఒక పీఠం ఏర్పరచాలి తెలుగువారి కీర్తి దశదిశలా వ్యాపించేటంగుకు ప్రతి ఆంధ్రుడూ కృషిజేయాలి. ఆనాడు ఈ ఏకాడమీల నిర్ణయాలతో అవసరమే వుండదు. ★



"అబ్బెబ్బె! మీరూరుకోండి—దాని ఖరీదెంతో నేనే ఇచ్చేస్తాను"



రాళ్ళల్లో, రప్పల్లో తప్పితే మిగిలిన చరాచర ప్రపంచంలో మార్పులు సంభవించడం అసహజమేమీ కాదు మరీ మైనంలాంటి మానవుడి చిత్తవృత్తిలో మార్పులు రావడం అతిసహజం కారణమంటూ ఒకటి లేనిదే కార్యముండదు గనుక ఈ మార్పులకు సైతం కారణా లుండకపోవు నీళ్ళుండవు పైరు ఎండిపోతుంది వర్షాలు బాగా కురిశాయి నదీప్రవాహం ఎగపొక్కుతుంది కొండవ్రాలు నీళ్ళు త్రాగడం జరిగింది జలుబు తప్పదు కారణాలూ, కార్యాలూగూడా చాలాచోట్ల యిలా బట్టబయలుగా తెలిసిపోతూనే వుంటాయి కానీ మానవుడికి సంబంధించినంత వరకూ ఒకొక్కొక్కప్పుడు కారణాలు మాత్రం ఎక్కడో అతడి అంతరంగంలో గోప్యంగా వుండిపోయి కార్యాలు మాత్రం కొట్టవచ్చినట్టు బయల్పడుతాయి అలాటప్పుడు అతడు మనకొక అర్థంకాని సమస్యలా గోచరిస్తాడు

ఉద్యోగరీత్యా దూరప్రాంతాల్లో వుండి పదారేళ్ళ తర్వాత స్వగ్రామానికి తిరిగివచ్చిన నన్ను ఆశ్చర్యంతో ఉక్కిరి బిక్కిరిచేసిన విషయాలు రెండు ఒకటి మా ఊరి ఏటి ప్రవాహగతి రెండు, మా శ్రీధరమూర్తిలో వచ్చిన మార్పు

నాకేమిటి, నాలాటి కుర్రాళ్ళందరికీ ఆ రోజుల్లో మా వూరి ఏరు ప్రియబాంధవి ఇప్పుడైతే విశాలమైన ఎడారిలాంటి ఈ ప్రపంచంలో సౌఖ్యమూ సంతృప్తి అన్న ఎండమావుల్ని వెదుక్కుంటూ దేశంపైన గుమ్మరుతున్నాను గాని చిన్ననాటి బాల్యక్రీడలకు రంగభూమిగా వుపకరించిన మావూరి ఏటి యిసుకతిన్నెల్లో నాకప్పుడు కొండంత సౌఖ్యమూ, ఎనలేని సంతృప్తి గోచరించేవి పదేళ్ళ తర్వాత స్వగ్రామానికి చేరుకోగానే ఆటలాడి అలసిపోయి సంజ చీకటిపడగానే తల్లి ఒడిని వెదుక్కుంటూ పరుగెత్తే పసివాడికిమల్లె ఏటివైపు బయల్దేరాను కానీ చిత్రం! నేనెక్కడనే ఏటికోసం చూచానో అక్కడ ఏరు లేదు ఒకప్పుడు ప్రవాహం పురకలు వేసుకుంటూ పరుగెట్టినచోట యిప్పుడు యిసుకమేటలు వేసింది ఇసుకమేటలపైన ఒండ్రుమట్టిచేరింది వనమహోత్సవాల ఛందడిగా అక్కడ కొబ్బరిచెట్లు ఏపుగా పెరిగిపోతున్నాయి.

ఏటి కేమైంది? కొంతదూరం ముందుకు నడిచాను ఎక్కడైతే ఆరోజుల్లో ఏరు లేదో అక్కడ అప్పుడు ఏరు ప్రవహిస్తోంది మరి యిక్కడ ఒక చిన్న రాళ్ళగుట్ట నాలుగైదు వేపచెట్లు చెట్లకు ప్రక్కగా ఓ చిన్న గుడి కట్టి వుండినట్టు జ్ఞాపకం! ఊహూ ఆవేవీ ఇప్పుడు లేవు వాటికి బదులు రాళ్ళను తొలుచుతూ, నురగలు గ్రక్కుతూ యిక్కడ ఏరు ప్రవహిస్తోంది

ఆ సాయంత్రం "ఇదేనా నేనాటలాడుకున్న ఏరు" అని నన్ను నేను ప్రశ్నించుకోవలసివచ్చింది

ఊళ్ళోకి వచ్చిన తర్వాత సరిగా అదే మాదిరిగా "వీడేనా మా శ్రీధరం ?" అని మళ్ళీ ప్రశ్నించుకోవలసి వచ్చింది

కథ మొదటినుంచీ చెప్పడం మంచిది

'ఓహో, వాడా! అఖండుడు "

"ఎవ్వ అతడా! చెడిపోయాడు"

"ఓహో, అతడా! వెరజాణ '

ఇలాటి వూతపదాలు అప్పుడప్పుడూ చెవినిబడుతూనే వుంటాయి కానీ విన్నప్పుడల్లా వాటికొక్క అర్థాన్ని భావించుకున్నట్లయితే మనం అనేకమందిపట్ల తప్పుడు అభిప్రాయాల్ని మాత్రమే సంపాదించుకోగలుగుతాము అందుకే 'చెవుల్ని నమ్మబోకు, కళ్ళను నమ్ము' అంటుంది ఒక ఆర్యోక్తి

కానీ

"శ్రీధరమా! అతడు బాగా మారిపోయాడోయ్!" ఏ నోటవిన్నా యిదే మాటయితే!

చెప్పుడుమాటలను వినకుండా యిదేమిటో స్వయంగా చూచి తెలుసుకోవాలనిపించింది శ్రీధరాన్ని చూడ్డానికి బయల్దేరాను

* * *

వీధిలో మెట్లెక్కి, వరాండాను గడుల్ని దాటుకుని హాల్లోకి ప్రవేశించగానే శ్రీధరంలో వచ్చినమార్పు నాకు దృగ్గోచరమైంది

ఆ హాల్లో గోడలకు నాకు తెలిసి నాలుగైదు కాలెండర్లు వ్రేలాడుతుండేవి లేదంటే నాలుగైదు ప్రకృతి దృశ్యాల పటాలుగూడా వుండేవి ప్రకృతి అంటే యిన్ని నీళ్ళు, కొన్ని తామరపువ్వులూ, రెండు టెంకాయచెట్లు, ఒక చందమామ యింతవరకుమాత్రమే పరిమితమనుకున్న చిత్రకారుడెవడో వాటిని చిత్రించి వుండొచ్చు అన్ని పటాల్లోనూ అవే కనిపించేవి కాదంటే వివిధ భంగిమల్లో!

ఇప్పుడా కాలెండర్లూ లేవు, ఆ ప్రకృతి దృశ్యాలూ లేవు వాటికిబదులు గోడనిండుగా దేవతలపటాలు వ్రేలాడుతున్నాయి సీతారాములు, రాధాకృష్ణులు, పార్వతీ పరమేశ్వరులు, గంగావతరణమూ, శివధనుర్భంగమూ, విశ్వరూపసందర్శనమూ, యిలా యిలా లెక్కలేనన్ని పటాలు! ఏ విషయానికావిషయమే చెప్పాలి ఈ పటాల్ని ఎన్నిక చేయడంలో ఎవరో గానీ మంచి విజ్ఞతను

☆ వింత జబ్బు ★

కనబరిచారనక తప్పదు. దేవతలన్న పేరుతో విపణి వీధిలో ఎన్నెన్నో వికారమైన పటాలు అమ్ముడుబోతుంటాయి (నాలుగుచేతులకు గదయినా మించడానికి వీలేని శ్రీకృష్ణుడు, ఎక్స్‌ట్రా సినిమా నటుడిలా కనిపించే ఈశ్వరుడు, బుట్టబొమ్మలా గోచరించే రాధిక వగైరా. వగైరా) మరి, భగవంతుణ్ణి దివ్యమంగళ విగ్రహుడంటారు. ఈ గోడమీద తగిలించిన పటాల్లో దేన్ని చూచినా ఆమాట నిజమేననిపిస్తోంది

పటాల ప్రసక్తిలోపడి పూజారి సంగతి చెప్పానుకాను. అతడు సరిగంచు పట్టుపంచ కట్టుకున్నాడు. నగట విబూది పట్టెలు కనుబొమలకు దిగువగా కుంకుమబొట్టు అర మోడ్పు కన్నులు చేతిలో కర్పూర హారతి. గంభీరంగా శ్లోకం ఉచ్ఛరిస్తున్నాడు. "మంగళం కోసలేంద్రాయ, మహనీయ గుణాత్మనే "

సందేహ నివృత్తికోసం ఒకసారి కళ్ళు నులుముకుని, మళ్ళీ చూచాను సందేహం లేదు, వాడు మా శ్రీధరమూర్తి!

మరి నే నెరిగిన శ్రీధరమూర్తి నాస్తికుడు శైవుల్లో వీర శైవులు, వైష్ణవుల్లో శ్రీవైష్ణవులూ వున్నట్టే మా శ్రీధరమూర్తి వీర నాస్తికుడు. వాడి నాస్తికత్వం దేవాలయాల్ని బహిష్కరించడం వరకేగాదు, పురాణాల్లోని అసమంజస విషయాల్ని, దేవతల పక్షపాత బుద్ధిని చీల్చి చెండాడి, ఎగటి వాళ్ళ నోరు మూసుకుని పూరుకున్నా రెచ్చగొట్టి వాదానికి లేవదీసి, తర్క వితర్కాలతో వాడి వాదాన్ని పూర్వపక్షంచేసి, కళ్ళ నీళ్ళు పెట్టుకునేలా వాళ్ణి ఏడిపించి విజయగర్వంతో వికటనృత్యం సలుపుతూ 'ఉన్నాడు, లేడు' అన్న విషయాన్ని గురించి ఎంతో దూరం ఆలోచించలేని నాబోటి వాళ్ళను ప్రాణ గొడ్డంలా ఎదురొచ్చేవాడి!

నిజం చెప్పొద్దూ, నాకు చాలా సంతోషం కలిగింది.

నా కెందుకు సంతోషం కలగాలి? నాలో నేనే వితర్కించుకున్నాను.

ఒక్క మాటమాత్రం నిజం! నా సంతోషం శ్రీధరం ఆస్తికుడైనందుకల్ల ఈ ఆస్తి నాస్తి విచికిత్స కంతటకీ హేతుభూతుడైన ఆ పరమాత్ముడికేదో ఒరిగిపోయిందనిమాత్రం కాదు.

మరెందుకు?

అ( )స్ఫురించింది. కథతో అంతగా సంబంధం లేని విషయమే గావచ్చు కానీ దీన్నిక్కడ విన్నవించుకోడం సమంజసం కాకపోదు

ఒకానొక పాతమిత్రుడిద్వారా పరిచయమైన ఒక కొత్త మిత్రుడి యింట్లో ఆతిథ్యం పుచ్చుకోవలసి వచ్చింది. ఆ యింట్లో నలుగురూ వచ్చి కూర్చోడానికి వుద్దేశించిన హాల్లో నాలుగైదు పటాలు మాత్రం వేలాడుతున్నాయి. అవి దేవతల పటాలు కావు. మానవుల పటాలు. పేర్లు చెప్పడ మెందుకు గానీ, ఆ పటాల్లో వున్న వాళ్ళు మనదేశ నాయకులు మాత్రం కారు. తమ అభ్యుదయ భావాలన్నింటికీ ప్రతిబింబాలుగా వాళ్ళా మహాపురుషుల్ని తమ యింట్లో ప్రతిష్ఠించుకున్నారేమో! కావచ్చు. అందుకు నేను వాళ్లని తప్పుబట్టడం లేదు.

కానీ ఒక చిన్న అపశ్రుతి!

వంటగది ముందరి వసారాలో కూర్చుని భోజనం చేస్తుండగా, ఆ గదిలో ఓమూలగా కరకాయించి మాస్తేగానీ తెలుసుకోడానికి వీల్లేని చోట గోడకు వ్రేలాడుతూ ఒక పటం కనిపించింది

ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే అది పార్వతీ పరమేశ్వరుల పటం!

"హాల్లో వాళ్ళని తగిలించి, వంటగదిలో వీళ్ళని బంధించడంలో మీ వుద్దేశమేమిటి?" అని స్పష్టంగా అడిగేద్దామనుకున్నాను. కానీ ఆ దంపతులదగ్గర సూటిగా మాట్లాడితే లేనిపోని అరాలుతీసి, వాళ్ళూ బాధపడి, మనల్నీ బాధపెట్టడానికి కావలసినంత పరిజ్ఞానం పూర్తిగా వుంది అందుకనే కాస్తా జాగ్రత్తపడి' అక్కడేదో పటమున్నట్టుందికదండీ" అన్నాను

"మా అమ్మా, నాన్నా" అంది ఆ యిల్లాలు గంభీర భావభంగిమను ముఖంలో రంగరించుకుంటూ!

ఎంతమాట, ఎంతమాట! అతుర లక్షలు విలువచేసే మాట అది! ఆ పురాణదంపతులు తల్లిదండ్రులు కాని దెవరికి? కానీ ఆ తల్లిదండ్రుల్ని లోకానికెందుకు ప్రకటించుకోగూడదో? అదేమైనా మూడోవాడికి తెలియగూడని పరమ రహస్యమా?

ఏమిటో మరి! ఆధునాతన సంస్కారాన్ని అర్థంచేసుకోలేక నేనారోజు తెల్లబోయిన మాట మాత్రం వాస్తవం!

ఒక మానవుడి జీవిత సాఫల్యతను అతడి జయాపజయాల్ని బట్టిగాక, అతడి సాధనను బట్టి లెక్కగట్టడం న్యాయమంటారు బుధులు సరిగా అలాగే మానవుడి నిజాయితీని అతడెన్నుకున్న పథాన్ని బట్టిగాక, ఆ పథంలో నడవడానికి వెనుక అతడు కనబరచిన చిత్తశుద్ధినిబట్టి విలువగట్టడమే న్యాయం. ఆరోజుల్లో శ్రీధరం ఎలాగైతే నాస్తికత్వాన్ని త్రికరణశుద్ధిగా నమ్మి దాన్ని ప్రచారం చెయ్యడానికి గూడా పూనుకున్నాడో అలాగే యిప్పుడు తన ఆస్తికత్వాన్ని గూడా బాహాటంగా ప్రకటించుకో గలుగుతున్నాడు. నాకు సంతోషం కలిగింది శ్రీధరంలో ఈమార్పు వచ్చినందుకు గాదు, వాడి చిత్తశుద్ధికి!

పూజ ముగిసింది. శ్రీధరం తనకు తానే తీర్థం పుచ్చుకుని లోపలికి వెళ్ళబోతుండగా నేను కనిపించాను.

"ఏమిటేమిటి! సర్వేశ్వరా జగన్నాథం! ఎప్పుడొచ్చావు? ఎంతకాలానికి, ఎంత కాలానికి! ఇదిగో సర్వమంగళా! మావాడొచ్చాడు" శ్రీధరం భక్తిపారవశ్యంలో నుంచీ ఒక అడుగు క్రిందికి దిగి స్నేహ

పొరవళ్యంతో నన్ను కౌగలించుకున్నంత పని చేసి ఉక్కిరి బిక్కిరి చేసేశాడు

ఇంతలో తల నిండుగా పువ్వులుంచుకుని, కళ్లల్లో దీపాలు వెలిగించుకున్న శ్రీధరం భార్య కాంచీపురం పట్టు చీరలో కంచి కామాక్షిలా అక్కడికి వచ్చేసింది

"నేను మాటెత్తితే 'మేం ముగురం' అంటుంటానుగదా సర్వమంగళా ఆ ముగురిలో నేను నీకు తెలుసు! ఉమాపతి తెలుసు వీడు మూడోవాడు సంగ్రహంగా జగ్గా సంపూర్ణంగా జగన్నాథం"

"కూర్చోండన్నయ్యా!" అంటూ సర్వమంగళ హాల్లో చాప పరిచింది

చాపైన కూర్చోబెట్టి, ఆపాదమస్తకం నన్నొకసారి పరిశీలించి మళ్లీ ప్రారంభించాడు శ్రీధరం

"ఆగేమిట్రా బాబూ! బొద్దుగా గుమ్మటంలా వుండేవాడివి, ఈ నగ పుల్లలా తయారై కూచున్నావు! దవడలు పీక్కుపోయాయి కళ్ళు లోపలికి పోయాయి పెదవులు కమిలిపోయాయి ఆ రొమ్మునలా ఒక చేతితో అదిమితే, ఎముకలు నుగ్గునూచమై పోయేట్టున్నాయి నాకు తెలుసు, సిగరెట్లు విపరీతంగా కాలుస్తున్నావు గదూ?"

"మరి నువ్వు? నువ్వు మానేశావేమిటి!" అన్నాను పెల్లుబుకుతున్న విస్మయాన్ని లోలోపలే దాచుకుంటూ

"నేను మానేసి రెండేళ్లయింది" అన్నాడు నింపాదిగా శ్రీధరం

నిజమే! కెంపుకి మల్లే మెరుస్తున్న వాడి పెదవులు ఆ విషయాన్ని చెప్పకనే చెబుతున్నాయి

ధూమపాన విద్యలో శ్రీధరం నాకు గురుతుల్యుడు అది వాడికి పారంపర్యంగా సంక్రమించిన విద్య వాడి తాతగారు మూరెడు పొడుగు పొగచుట్ట వినా క్షణం గడపలేని నిత్యాగ్నిహోత్రుడు! వాడి నాన్నగారు అనవరతమూ పాసింగ్ షో సిగరెట్లను కాల్చి కాల్చి ధూమాన్నలా గాలిలోకి వదిలిపెట్టే సీమింజన! శ్రీధరం నాన్నగారి టిన్నులోనుంచి అయిదారు సిగరెట్లను సంగ్రహించుకుని మాయింటి కొచ్చేసేవాడు చెట్లతో పొదలతో అరణ్యం లాంటి మా పెరట్లో కూచుని వరుసగా అన్నింటినీ తెగగాలుస్తూ, ఈ విషయాన్ని రహస్యంగా వుంచే షరతుమీద నాకూ ఒకటి, అరా ప్రసాదించేవాడు!

నా మట్టుకు నేను సిగరెట్లు మానుకోడానికి విశ్వప్రయత్నం చేశాను. ఏ దురలవాటునైనా మానుకోడానికి శాస్త్రం రెండు పద్ధతుల్ని సూచిస్తోంది రెండంతలుగా, మూడింతలుగా దురలవాటును అలా అలా పెంచుకుంటూ పోయినట్టయితే, చివరికి దానిపట్ల అసహ్యం కలుగక మానదు. అప్పుడు దాన్ని మానుకోడం సులభం ఇది మొదటి పద్ధతి. ఈ పద్ధతిని అవలంభించేసరికి అసహ్యం మాట దేవుడెరుగు, గంటకొక్క సిగరెట్టుతో సరిపెట్టుకో గలుగుతున్న వాణ్ణి, అయిదు నిమిషాలకొకటి లేకపోతే ఏమీ తోచని పరిస్థితి ఏర్పడింది ఈ తలకుమించిన వ్యవహారాన్ని మళ్ళీ మామూలు స్థాయికి తెచ్చుకునేసరికి బ్రహ్మప్రళయమైపోయింది ఆ తరువాత రెండో ఉపాయాన్ని ప్రయత్నించి చూచాను ఇప్పుడున్న దురలవాటుకంటే తక్కువ హానికరమైనదాన్ని అవలంభిస్తే కాలక్రమాన రెంటనీ అశ్రమంగా మానుకోవచ్చునంటుంది ఈ పద్ధతి. ఇది కాస్తా సులభసాధ్యంగా కూడా తోచింది వారం రోజుల పాటు నస్యం వాడుక చేశాను. అంతటితో తలదిమ్మెక్కిపోయి మనం ఈ లోకంలో వున్నామా? లేమా అన్న సందేహం కలగడంతో నస్యం డబ్బీని సైడు కాలవలోకి గిరవాటు కొట్టవలసి వచ్చింది ఆపైన తాంబూల చర్వణానికి ఉపక్రమించాను నాలుక తాటిపట్టెలా మొద్దుబారి, షడ్రుచులూ ఒక్కలాగే తోచి, అన్నహితవు అంతర్థానమైపోడంతో దానికీ స్వస్తి చెప్పుకోవలసి వచ్చింది దానా దీనా అంతగా హానికరం గాని ఈ చిన్న సైజు దురలవాటుల సద్యఃఫలితాలకు తట్టుకోలేక మళ్ళీ పాతపుంతకే రథాన్ని మళ్ళించవలసి వచ్చింది

కానీ శ్రీధరానికి యిదెలా సాధ్యమైంది? ఈ ప్రశ్ననే మరోవిధంగా మార్చుకుంటే — శ్రీధరంలో యింతమార్పు యెలా వచ్చింది?

★ వింతజబ్బు ★

ఇంతమాత్రమే కాదు. శ్రీధరంలో యింకా బోలెడన్ని మార్పులొచ్చాయి. రూపాయను చిల్లపెంకులా చూసేవాడు, యిప్పుడొక రూపాయకే పదిరూపాయల విలువయిచ్చి మాట్లాడుతున్నాడు కబ్బులు యువజన సంఘాలు అంటే పడిచచ్చేవాడు ఇప్పుడా ప్రసక్తే తలపెట్టడంలేదు

ఈ మార్పులకు కారణమేమిటో తెలుసుకోవాలన్న వుత్కంఠ నాలో తుణతుణానికీ హెచ్చులు (హద్దులు) త్రెంచుకుంటోంది చివరకు మొహమాటం విడిచిపెట్టి అడిగేశాను కూడా! కానీ ఏంలాభం? వాడు భార్యకేసి ఓరచూపులు బరపుతూ ముసిముసి నవ్వులు చిలకరిస్తాడుగానీ నాకు బదులు చెప్పడే!

ఇదేమిటో తెలుసుకోందే నిద్రపట్టదు గనుక, ఆఖరుకు ఉమాపతిని వెదుక్కుంటూ బయల్దేరాను

ఉమాపతి మార్గమధ్యంలోనే ఎదురయ్యాడు నన్ను యింటికి తీసుకెళ్లి తన సంసారపు గొడవల్లో దించడానికి బదులుగా అతడు పార్కులోకి దారితీశాడు కానుగ చెట్టుకింద, సిమెంటుబెంచీపైన కూర్చుని లేతవెన్నెల్లో పాతస్మృతుల్ని నెమరువేసుకున్నాము. గంట ఎనిమిదయింది. "ఇక వెళ్దామా" అన్నాడు ఉమాపతి,

"అప్పుడే ఎందుకుగానీ, యిదేమిటి ఉమాపతీ, ఈ విచిత్రం?" అంటూ శ్రీధరంలో వచ్చినమార్పుని గురించి ప్రస్తావించాను.

"ఓ అదా! అదొకజబ్బులే!" అన్నాడు ఉమాపతి

"జబ్బా! ఆజబ్బు నాకూవస్తే బాగుండును" అన్నాను, సద్యాసిగరెట్లు మానేయగలిగితే నెలకు పదిరూపాయలు ఆదా చేయవచ్చు ననుకుంటూ!

"అది నీకెందుకొస్తుంది? ఆ జబ్బు పెళ్లయిన వాళ్లకు మాత్రమే వస్తుంది" అంటూ ఉమాపతి మరొక రహస్యాన్ని బయట పెట్టాడు.

"మరి నీకలాటిజబ్బేమీ వచ్చినట్టులేదే! నీకు పెళ్లయిందిగా" అన్నాను.

"అది భార్యాభర్తల్లో ఏ ఒక్కరికి మాత్రమో వచ్చేజబ్బు!"

"అంటే నీమాటప్రకారం యిలాటిజబ్బు నీభార్యకు వచ్చివుండాలన్నమాట!"

"అన్నమాటేమిటి! నిజమే అది! ఆవిడకు పెళ్ళిగాకముందు లెక్కలేనన్ని ఆచారాలు విపరీతమైన దైవభక్తి, గురువారం సాయిబాబాకని, శుక్రవారం లక్ష్మీదేవికని, శని వారం వేంకటేశ్వరుడికని ఇలా వారంలో ఏ అయిదారురోజులో ఉపవాసమే వుండి పోయేదనుకో! ఇప్పుడా చాదస్తాలన్నీ బాగా సడలిపోయాయి పెళ్ళికి మునుపు సిగరెట్టు వాసన తగిలితేచాలు, ఇక మూర్ఛపోయినంత పర్యంతమైపోయేది తిన్న అన్నం కడుపులో నిలిచేదికాదు. ఇప్పుడంటావా పొగను నూటిగా ముఖంపైకి వదిలినా నిక్షేపంగా నవ్వుతూ వుండిపోతుంది ఇవి ముఖ్యమైన మార్పులనుకో చిన్న చిన్నవి ఇంకా చాలా వున్నాయి"

"దీనికీ, శ్రీధరానికి వచ్చిన జబ్బుకూ పోలికలున్నమాట నిజమే" అన్నాను

"పోలికలేమిటి! అదే ఇది!" అన్నాడు ఉమాపతి

ఒకటిరెండు నిమిషాలు మౌనంగా వుండి మళ్ళీ చెప్పసాగాడు

"అపాయలోనుంచీ ఒకటి, ఈపాయలోనుంచీ ఒకటీ కొట్టుకవచ్చి సంగమస్థానంలో కలుసుకునే మొగిలకొమ్మలకు మల్లేభార్యాభర్తలు వివాహబంధంవల్ల సన్నిహితులౌతున్నారు వివాహాత్పూర్వం ఆమె పరిసరాలు, ఆచారాలు వేరు అతడి పరిసరాలూ, పరిస్థితులూ వేరు ఆ భిన్న ప్రకృతులమధ్య కొంత సర్దుబాటు అత్యవసరమౌతుంది. భార్యాభర్తల్లో ఎవరి వ్యక్తిత్వం బలీయమో, వాళ్ళ అభిరుచికి అనుగుణ్యంగా మరొకరు సర్దుబాటుకు లోనుకావలసివస్తుంది అంతేగదూ?" అంటూ నా వైపు సాలోచనగా చూచాడు ఉమాపతి

'కావచ్చు' అన్నట్టు తల వూపాను.

"ఈ సర్దుబాటునే నేను జబ్బు అని చమత్కరించాననుకో! కానీ ఈ జబ్బు లోకంలో అన్ని జబ్బులలాంటిది గాదు ఇది కాపురానికి ఆరోగ్యం చేకూర్చే జబ్బు! భార్యాభర్తలమధ్య వైరుధ్యాన్ని పోకార్చి సామరస్యం సంధించే, జబ్బు! విశ్వానికి శ్రేయం సంఘటించే కావ్యానికి మల్లే యిదీ మానవాళికి అంతో యింతో మేలు చేకూరుస్తోంది గనుక ఈవింత జబ్బు చాలామంచి జబ్బు" అన్నాడు ఉమాపతి! ★

ప్రఖ్యాత రచయిత్రి

పెరల్ బక్

భానుమతీ రామకృష్ణ

(గతసంచిక తరువాయి)

అసలు నీ వంటేనే అతనికి భయం లాగావుంది పాపం, దానికితోడు నీవు కట్టేసి, గదిలోవుంచి తాళం వేస్తే యింకొ భయపడిపోయి పారిపోవడానికే ప్రయత్నిస్తాడు–ముందు అతన్ని గదిలోంచి బయటకు తీసుకురా నేను 'మాట్లాడుతాను' నీ పెళ్లి విషయం అన్నది పెరల్ బక్. యిష్టం లేకపోయినా పెరల్ బక్ కోసం తన ప్రియుణ్ణి గదిలోనుంచి తీసుకొచ్చి యజమానురాలిముందు నిలబెట్టింది తను వెళ్లి వంటింటి తలుపు వెనక నిలబడది ఏంచెపుతాడో వింటానికి – అతడు చేతులు కట్టుకుని నేలచూపులు చూస్తూ నిలబడ్డాడు

"లీని పెళ్లాడతానని ఎందుకు పారిపోయావు" అని అడిగింది పెరల్ బక్

"అమ్మగారూ పెళ్లికానిపిల్లను పెళ్లాడాలంటే ఖర్చు ఎక్కువవుతుంది. అంగుకు నాకు శక్తిచాలదు. అందుకనే వితంతువైన లీని పెళ్లాడదామనుకున్నాను కాని నాకు భార్య కావాలి గాని, యీ విధంగా గదిలో పెట్టి తాళంవేసి తిట్టే గయ్యాళి గాదు – అని నసిగాడు

ఆ మాటలు విన్న 'లీ' మళ్లీ విశ్వరూపం ధరించింది "నేను గదిలో పెట్టి తాళం వేయకపోతే నీవు అకోతిప్రియురాలితో కులుకుతావు అంతేనా!" అని గట్టిగా అరిచింది 'లీ' పెరల్ బక్‌కు కోపంవచ్చింది 'లీ'ని గట్టిగా కేకలువేసింది చివరకు పెళ్లాట్టానికి ఒప్పించింది 'లీ' ప్రియుణ్ణి

పెళ్లయిన కొద్దిరోజులకే మళ్లీ ఒకరోజు భర్తను గదిలోపెట్టి తాళంవేసింది 'లీ' మళ్లీ ఏమొచ్చిందని పెరల్ బక్ విచారిస్తే "ఆ రెండవప్రియురాలినికూడా యిక్కడకే తీసుకొచ్చుకుంటాడట నేను చస్తే ఒప్పుకోను – అన్నది 'లీ' కేకలు వేస్తూ —" "చైనాలో బహుభార్యాత్వం మగవాళ్లకు తప్పులేదుగా. 'పోనీ తెచ్చుకోని" అన్నది పెరల్ బక్.

ఒకభార్యకే తిండిపెటలేని యితగాడికి రెండవభార్యెందుకమ్మా! యీనేం చాంకైషేకా అన్నది చైనా కొత్తలీడరు జనరల్ చాంకైషేక్‌కు ముగ్గురు భార్యలున్నారని విన్న గయ్యాళి లీ—

తర్వాత కొద్దిరోజులకే లీ భర్తకోసం గొప్ప త్యాగంచేసింది. తనే ఒక పెళ్ళికాని మంచి కురూపిపిల్లను వెదికితెచ్చి భర్తకిచ్చి పెళ్ళి చేసింది వారికి పుట్టినపిల్లవాడిని ఎత్తుకుని ముద్దాడుతూ ఆరునెలల ఆ పిల్లవాడి యొక్క తెలివితేటలు పెరల్ బక్‌కు చెప్పి చెప్పి ఆనందించింది.

1929 లో పెరల్ బక్ తన మొదటినవల "దియీస్ట్‌విండ్ వెస్ట్‌విండ్" వ్రాసింది–కాళ్లూ చేతులూ చచ్చుపడిన తన పెద్ద కూతుర్ని అమెరికాకు తీసికెళ్లాల్సి వచ్చింది. హాస్టల్లో చేర్పడానికి–ఆసందర్భంలోనే తనువ్రాసిన నవలను ప్రచురణకిచ్చింది, న్యూయార్క్‌లోని జోన్ డే కంపెనీకి కొన్నివారల్లో తిరిగి చైనా వచ్చిన పెరల్ బక్‌కు పెద్దకూతురులేని యిల్లు వెలవెలబోయినట్లనిపించింది మనసులోని ఆతోరతను మర్చిపోవడానికి మళ్ళీ కొత్తనవల వ్రాయడానికి మొదలెట్టింది– అదే ప్రఖ్యాతిగాంచిన "ది గుడ్ ఎర్త్" నవల "ది గుడ్ ఎర్త్" నవలా రచనకోసం కథావస్తువుగా తను పర్యటించిన ఉత్తర చైనాలోని పల్లెరైతుల జీవితాలనూ, దక్షిణ చైనాలోని భాగ్యవంతుల సంపదనూ ఎన్నుకున్నది పెరల్ బక్

అదేవిధంగా కొన్ని సంవత్సరాల తర్వాత వ్రాసిన "కిన్‌ఫోల్" నవలలో కూడా తను ఉత్తర చైనాలోని పల్లెటూరి వాళ్ల జీవితాలనే ప్రతిబింబింపచేసింది.

పల్లెటూళ్లలో నివసించే చైనీయులకు ముఖ్యంగా ముసలివాళ్లకు ఆపరేషన్ అంటే నమ్మకం లేకపోగా నవ్వేవాళ్లు మనిషి ఒంటిమీద కత్తిపడితే యింక ఆ మనిషి బ్రతకడని వారి నమ్మకం–ప్రాణం పోయేందుకైనా ఒప్పుకునేవారుగాని, ఆపరేషన్ అంటే మండిపడేవాళ్లు

పెరల్ బక్ రచించిన "కిన్‌ఫోల్"లో 'అంకుల్ టా' అనే ముసలితాత కడుపులో 'ట్యూమర్'ను ఆపరేషన్‌చేసి తీస్తానని అమెరికాలో డాక్టర్ చదివివచ్చిన మేనల్లుడు ఎన్నివిధాల చెప్పినా వినడు "ఛాపో ఆపరేషన్ ఏమిటి నీ ముఖం! కత్తితో మనిషి పొట్టకోస్తే యింకా బ్రతకడం ఏమిటి నీపిచ్చిగాని! నీకంత సరదాగావుంటే ఆకత్తితో ఏ కోడి నైనా కోసుకుతిను అంటాడు ఎగతాళిగా అంకుల్ టాతాత.

కొంతకాలానికి మేనల్లుడి భార్య నచ్చచెబితే బుద్ధితిరిగి ఆపరేషన్ చేయించుకుంటాడు అంకుల్ టా.

తన కడుపులో ఆపరేషన్‌చేసి తీసిన 'ట్యూమర్'ను ఒకసీసాలో వుంచి తనకంటికి చూపించి అదే యిన్నాళ్లూ తనబాధకు కారణమని చెప్పిన మేనల్లుణ్ణి మెచ్చుకుంటాడు తాత–తన కడుపులో బాధపోయిందని సంతోషించి ఆ పల్లెలో అందరికీ, తన మేనల్లుడు కత్తితో కోసింది బాధనేగాని మనిషినికాదు కాబట్టి ఆరా కడుపులో పుండ్లుకానీ, బల్లలుకానీ వుండేవాళ్లు తన మేనల్లుడిచేత ఆపరేషన్ చేయించుకొని ఆరోగ్యం పొందాలి అంటూ అంకుల్ టా తాత వూరందరికీ సలహా చెబుతాడు వూరిపెద్ద అయిన 'అంకుల్' టా చెబితే ఎవరు వినకుండా వుండగలరు!

'కిన్‌ఫోల్' వ్రాసిన చాలాకాలం తర్వాత జరిగిన సంగతి మేడమ్ చాంకైషేక్ కడుపులోకూడా ట్యూమర్ వచ్చింది. ఆమె కూడా ఆపరేషన్ అంటే భయపడ్డది– చివరకు ఆపరేషన్ చేసి తన కడుపులోనుండి తీసిన ట్యూమర్‌ను అంకుల్ టా లాగే ఒక సీసాలో వుంచి అందరూ చూట్టానికని తన ఇంట్లో ముందరిహాల్లో వుంచింది మేడమ్ చాంకైషేక్—అందుకే చాలా మంది పెరల్ బక్‌ను అడిగేవారు "నీ నవలల్లోని పాత్రలు నీవు సృష్టించేవా! లేక నిజమైన మనుషులా అని

అంత వాస్తవికంగా వుండేవి పెరల్ బక్ సృష్టించే పాత్రలు—

'ది గుడ్ ఎర్త్' వ్రాసేప్పుడే ఒక గొప్ప చైనీయుల నవలను కూడా ఇంగ్లీషులోకి అనువదించడానికి ఆరంభించింది "ఆల్ మెన్ ఆర్ బ్రదర్స్" అనే పేరుతో ఆ నవలను అనువదించడానికి నాలుగు సంవత్సరాలు పట్టింది

ఎండాకాలంలో కొండల్లో నివసించే చెల్లెల్ని చూట్టానికి వెళిన తండ్రి తిరిగి తనదగ్గరికి రాకుండానే సుస్తిచేసి చనిపోయాడు తను వెళ్లి చూట్టానికి లేకుండా యాంగ్ సీనది వరదల్లో వుండిపోయింది. తండ్రి చివరి ఘడియల్లో తను దగ్గర లేకపోయినందుకు ఎంతో బాధపడ్డది పెరల్ బక్.

తండ్రి చనిపోయిన తర్వాత తనతండ్రి జీవితాన్నిగురించి "ది ఫైటింగ్ ఏంజిల్" పోర్ట్రేట్ ఆఫ్ ఎ సోల్" అనే పుస్తకం

★ పెరల్ బక్ ★

వ్రాసింది. మొదట తన తల్లినిగురించి వ్రాసిన "ది ఎక్సైల్" చదివిన అమెరికాలోని స్నేహితులు పెరల్ బక్ కు తండ్రి మీద ప్రేమలేదు అన్నారు తన తల్లినిగురించే వ్రాసింది కాబట్టి. నిజానికి తల్లి పోయిన తర్వాత తనతో బాటూ వుంటూన్న కొద్ది సంవత్సరాల్లోనే తండ్రినీ తండ్రియొక్క గొప్పతనాన్నీ అర్థంచేసుకున్న పెరల్ బక్, తండ్రిపోయినతర్వాత తన మనసులోని పితృ ప్రేమను భక్తినీ రచనరూపంలోకి తీసుకొచ్చింది. తండ్రినిగురించి వ్రాసిన పుస్తకం చదివిన అమెరికన్ మిత్రులు పితృ ఋణం కూడా తీర్చుకుంది పెరల్ బక్ అన్నారు.

పెరల్ బక్ ను అమెరికాలో చాలామంది పార్టీలకూ, విందులకూ ఆహ్వానించి అభినందించారు. కాని సాహిత్య రంగంలో చైనాలో వున్నంతమంది మేధావులు తన మాతృదేశంలో కనబడలేదు పెరల్ బక్ కు—

అమెరికా వెళ్ళిన మొదటిసంవత్సరం అంతా న్యూయార్క్ లో వున్న గొప్ప గొప్ప అమెరికన్ రచయితలను చాలామందిని కలుసుకున్నది పెరల్ బక్. కొలంబియా యూనివర్సిటీలో చదివే చైనా యువకులంతా "గుడ్ ఎర్త్" రచయిత్రి పెరల్ బక్ కు డిన్నరిచ్చారు. వాళ్ళ మనసుల్లో ఒక అమెరికన్ రచయిత్రి చైనీయులనుగురించి వ్రాసిన "గుడ్ ఎర్త్" నవల ప్రఖ్యాతి పొందడం యిష్టంలేనట్లు కనిపెట్టగలిగింది పెరల్ బక్—అంతే కాదు చైనా దేశపు గొప్పకవి వ్రాసిన నవలను "ఆల్ మెన్ ఆర్ బ్రదర్స్" అనే పేరుతో తను అనువదించడం అసలే వాళ్ళకిష్టంలేదని కూడా గ్రహించింది. ఆ నవలానువాదం ఆపేయమని అడగడానికే విందు ఏర్పాటు చేశారని సులభంగా గ్రహించగలిగింది మనుషుల మనస్తత్వాలు తెలిసిన పెరల్ బక్—

పెరల్ బక్ అనుకున్నట్టే వాళ్ళు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారు విందారగించిన తర్వాత–వాళ్ళ బాధేమిటంటే చైనా కవి వ్రాసిన ఆ నవలలో ఒక మతిగురువు ఆకలిమంటకు తట్టుకోలేక మనిషి మాంసం తింటాడు–అది చదివితే అమెరికన్సు అంతా మేము పట్టి అనాగరికులం అనుకుంటారేమో! అని వసిగారు ఆ చైనాయువకులంతా.

దానికి పెరల్ బక్ సమాధానం చెప్పింది

ఆ నవల కొన్ని వందల సంవత్సరాల నాడు వ్రాయబడ్డది. అది ఆనాటి చైనాను గురించే వ్రాయబడది గనక తప్పులేదు ఉదాహరణకు, షేక్స్పియర్ వ్రాసిన 'మేక్ బెత్' లో మంత్రతంత్రాలున్నాయని యింగ్లీషువాళ్ళు అవమానంగా భావించి ఆ పుస్తకం బయటకు రాకుండా అణగద్రొక్కారా! ఒకవేళ అలా చేసివుంటే సాహిత్యానికే ఎంత అపకారం జరిగేది! అలాగే చైనా కవి వ్రాసిన నవల నా అనువాదంలో చైనీయుల గొప్పతనాన్నే చాటుతుంది చైనా అంటే ఏమిటని అమెరికాలో చదువుకున్న మీకంటే నాకే ఎక్కువ తెలుసు. నేను ఏది వ్రాసినా చైనామీద వుండే అభిమానంతోనే వ్రాస్తాను" అంటూ ఆ చైనా యువకుల్ని సమాధాన పర్చింది పెరల్ బక్—

1934 లో పెరల్ బక్ ఇండియాకు వచ్చింది. కలకత్తా, ఢిల్లీ, ఆగ్రా, బొంబాయి వగైరా పట్టణాలన్నీ తిరిగి చూసింది. కాని తను ముఖ్యంగా చూడాలనీ, తెలుసుకోవాలనీ వచ్చింది సాహిత్య రంగంలో మేధావులను గురించీ పల్లెటూళ్ళలో వుండే రైతుల కష్టసుఖాలను గురించీ

ఇండియా అంతా తిరిగి చూసిన పెరల్ బక్, ఇండియాను గురించి ఒక చోట ఈలా వ్రాసింది:

" Perhaps we Americans do not yet fully understand the great lesson that India has to teach in thus winning her freedom Beside her mighty triumph of a bloodless revolution our war of Independence shrinks in size and concept India has taught humainty a lesson and it is to our peril if we do not learn it "

ఇండియాను గురించి గొప్ప అభిప్రాయంతో తిరిగి వెళ్ళిన పెరల్ బక్ "కమ్ మై బిలవెడ్" అనే నవల ఇండియాను దృష్టిలో వుంచుకునే వ్రాసింది.

చైనాలో వ్రేళ్ళు పాతుకు పోయిన తన జీవితాన్ని పెల్లగించి అమెరికాలో నాటుకోవాలి. క్రొత్తచోట నాటబోయే తన జీవితవృక్షం వాడిపోకుండా బ్రతికి చిగురించాలంటే, తన కిష్టమైన చైనాలో వుండే పర్ ఫుల్ కొండల మాదిరి కొండలుండే ప్రదేశంలో తను యిల్లుకట్టుకుని వుండాలి. అమెరికాలో ఎక్కడుంది అలాంటిచోటు! వెదికింది. చివరకు పెనిసిల్ వేనియా కొండలదగ్గర ఒక చోటు కనిపించింది. ఆ ప్రదేశం పెరల్ బక్ కు నచ్చింది.

కొన్ని ఎకరాలతోటా, పొలమూ కలిసి వున్న ఆ ప్రదేశంలో ఒక చిన్న యిల్లు కూడా వుంది వెంటనే తనకు నచ్చిన ఆ పొలమూ తోటా వున్న యిల్లు కొనేసింది పెరల్ బక్

జీవితంలో పెరల్ బక్ నగలూ నాణ్యాలూ కోరలేదు. తనుండే యింటిచుట్టూ ఆవరణ వుండి పూలచెట్లూ కూరగాయల మొక్కలూ వుంటే చాలని కోరుకునేది.

తర్వాత కొద్ది రోజులకే పెరల్ బక్ జీవితంలో మార్పు కలిగింది తన మొదటి భర్తకు విడాకులిచ్చి, న్యూయార్క్ లోని 'ఏషియా మేగజైన్' అనే పత్రిక ఎడిటర్ గా వుండిన అతన్ని పెళ్ళాడింది అమెరికాలో స్థిరపడతర్వాత అనాథ శిశువుల కోసం 'వెల్ కమ్ హౌస్' అనేది స్థాపించింది కొందరు మహిళలసహాయంతో–అక్కడ బిడ్డల్ని పెంచేందుకు కొంత గవర్నమెంట్ సహాయం, కొంత ధనవంతులసహాయం సేకరించి 'వెల్ కమ్ హౌస్' నడుపుతుండేది. తను కూడా ముగ్గురు నలుగురు పిల్లల్ని పెంచుకొన్నది. పిల్లలు లేనియిల్లు అసలు యిల్లు కాదంటుంది పెరల్ బక్.

పెరల్ బక్ జీవితంలో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన రోజు లిటరేచర్ లో ఆమెకు నోబెల్ ప్రైజ్ యిచ్చినరోజు.

అలాంటి మర్చిపోలేని మంచిరోజు తను వ్రాసిన 'ది గుడ్ ఎర్త్' నవలను యమ్ జి యమ్ వారు ఫిలింతీసి తనకు చూపించినరోజు.

తను సృష్టించిన పాత్రలు సజీవంగా తెరమీద కనబడుతూవుంటే, చిత్రం చూస్తున్నంతసేపూ పెరల్ బక్ హృదయం ఆనందంతో పులకరించింది.

ముఖ్యంగా ఓలెన్ పాత్ర తనను ఆకర్షించింది.

ఓలెన్ పాత్రధారిణి లూయీస్ రైనర్ చైనానుండివచ్చిన ఒక పనిమనిషిదగ్గర బట్టలుతకడం, అంట్లు తోమడం వగైరా యింటిపనులన్నీ చైనా స్త్రీలమాదిరిగా చేయడం నేర్చుకుంది కొన్నాళ్ళు. ఆ నటీమణియొక్క కృషిని ఎంతో మెచ్చుకుంది పెరల్ బక్.

సెలవు కారణం

మంగళవారం ఆఫీసులో అడుగు పెట్టటంతోటే శ్రీముఖం అందించాడు గుమాస్తా రమణకి బంట్రోతు మంగయ్య. అనుకున్నంతా అయిందనుకున్నాడు రమణ.

అప్పుడే వస్తూన్న ఒక్కొక్క గుమాస్తా రమణమీద సానుభూతి చూపారు సంగతి తెలుసుకుని, దానినే ఇలా వ్యక్తం చేశాడు పెద్ద గుమాస్తా—'అవునోయ్ మరి! సెలవు పెట్టకుండా మానేస్తే ఎలా, అయ్యగారి సంగతి తెలిసీకూడా పిల్ల కాకికేం తెలుస్తుందిలే ఉండేలుదెబ్బ"

"సోమవారం రావటానికి వీలులేకపోయిందండి" అన్నాడు రమణ జాలిగా.

"సరేలే, అసంగతంతా మానేజరుగారితో స్వయంగా మనవి చేసుకో" అన్నాడు పెద్ద గుమాస్తా.

తోటి గుమాస్తాలు కొందరు నవ్వుకున్నారు. కొందరు విచారించారు రమణ స్థితి చూసి.

"టపాకి జరూరుగా పంపవలసిన కాగితాలకు జవాబులు రాసెయ్యండి" అన్నారు హెడ్ గుమాస్తా ప్రస్తుతాన్ని జ్ఞాపకం చేస్తూ.

అదింటివరకు కాగితాల మధ్య సతమతమౌతున్నాడన్న మాటేగాని మనస్సు మటుకు కళ్ళెం లేని గుర్రంలాగ వ్యవహరిస్తూంది రమణకి.

మానేజరుగారు ప్రక్క ఊరు తనిఖీకి వెళ్లారని ఆ రోజు సాయంకాలానికి తిరిగి వస్తారని డఫేదారు చెప్పేడు రమణకి.

* * *

వీధి దీపాలు అప్పుడే వెలిగేయి. చలి కొంచెం కొంచెం తొంగిచూస్తూంది.

రమణ మానేజరు గారింటికి వెళ్ళేటప్పటికి ఆయన వీధిగదిలో ఒక్కడూ కూర్చుని కాగితాలు చూచుకుంటున్నారు రేడియో పాట వింటూ.

రమణ నమస్కరించాడు. అధికార పురస్సరంగా శిరఃకంపనం చేశారు మానేజరు.

"తమరితో స్వయంగా మనవి.."

యస్. కె. యస్. రామానుజాచారి

"ఏమని?" నగంలోనే అందుకున్నారు మానేజరు.

"నేను ముందుగా సెలవు పంపుకోలేకపోయిన పరిస్థితి."

"ఏం పరిస్థితయ్యా! ఆఫీసంటే కాలేజీలో క్రికెట్ ఆడటంలాగా వుంది మీ కుర్రకారుకి."

"అది కాదండి అయ్యా! మా అత్తవారింటికి శనివారం సాయంత్రానికి చేరుకున్నా, ఆదివారం ఉదయం మా ఆడవాళ్ళని తీసుకు వచ్చేద్దామని."

"ఏమిటీ నీకు వివాహం అయిందా! ఐనా నీ సంసారం గొడవలన్నీ వింటూ కూర్చోవటానికి నాకు తీరిక లేదు. నువ్వు చెప్పదలచిన దేదో కాగితంమీద చెప్పుకో."

"చిత్తం. కాగితం మీద రాయటానికి వీలులేని విషయం. అందుచేతనే తమతో స్వయంగా మనవి చేసుకుందామని వచ్చా."

కళ్ళజోడు తీసి బల్లమీద పెట్టేరు మానేజరు సందిగ్ధంగా.

"అత్తవారింటికి చేరుకున్న తరువాత తెలిసింది—మా వాళ్ళు ఇంట్లోకి రావటానికి వీలు లేదనిన్నీ, సోమవారం ఉదయం స్నానమనీ" అన్నాడు రమణ.

విడుపు ప్రారంభించిన చంద్రుడిలాగ అయింది ఆఫీసరుగారి ముఖబింబం. తల పైకి క్రిందికీ ఊపేరు ఆయన మౌనంగా.

మూఖిక సంజాయిషీ ఆరంభించాడు మళ్లీ రమణ. "ఆదివారం టపా ఉండదు. ఈ విషయం కాగితంమీద రాయటానికి వీలు లేదు కనుక తమతో మంగళవారం ఉదయం స్వయంగా మనవి చేసుకుందామనుకున్నాను."

కేతువు నోటినుంచి పూర్తిగా విముక్తి చెందాడు చంద్రుడు.

"ఆఁ" అన్నారు అయ్యగారు కొంచెం గట్టిగానే.

"నీవు చెప్పింది నిజమే ననుకోవోయ్! కాని ఉద్యోగధర్మం ఉద్యోగ ధర్మమే! నీ గాథ నన్ను ముప్పై సంవత్సరాలు వెనక్కు తీసుకుపోయింది. అప్పుడు నేనూ నీలాగే మామూలు గుమాస్తాగా ఉన్నాను. నాకూ సరిగా ఇలాగే..." అని ఆపేసి, "సరేలే! నీవు వెళ్ళు మొదటితప్పుకింద క్షమించాను. ఇకముందెప్పుడూ సెలవు పెట్టకుండా మానకు" అన్నారు మానేజరు.

సెలవు తీసుకొని మెట్లుదిగి రోడ్డుమీద అడుగుపెట్టిన రమణకి, "బాబీ, మీ అమ్మతో కాస్త కాఫీ ఇమ్మని చెప్పు" అన్న మానేజరు మాటలు వినిపించాయి.

ఇంటిదగ్గర శ్రీమతి వంటరితనం జ్ఞాపకం వచ్చి నడక వేగం హెచ్చించాడు రమణ తన ఇంటివైపు. ★

కథానాయకుడు పాల్ ముని సరేసరి. అద్భుతంగా పోషించాడా పాత్రను.

ఆ చిత్రం నిర్మించింది సుప్రసిద్ధ నటీమణి నార్మాషేరర్ భర్త యిర్విన్ టాల్ బర్గ్.

పెరల్ బక్ రెండవ నవల 'డ్రాగన్ సీడ్' చిత్రం అంతబాగా తీయలేదని పెరల్ బక్ అభిప్రాయం. తను వ్రాసిన 'డ్రాగన్ సీడ్' నవలలో కథానాయకురాలు మగవాడిలాగా పంట్లాం వేసుకునే అంతటి జాణ కాదు. కాని ఆ చిత్రంలో కథానాయికగా నటించిన కేథరీన్ హెప్ బరన్' పంట్లాం వేసుకుంటానని పట్టుపట్టింది! డైరక్టరు కాదనలేకపోయాడు — దాంతో తను సృష్టించినపాత్ర దెబ్బతిన్నది అందువల్లనే 'గుడ్ ఎర్త్' అంతగా ప్రజాదరణ పొందలేకపోయింది. 'డ్రాగన్ సీడ్' చిత్రం


ప్రశాంతమైన కొండప్రాంతాల్లో కనుచూపు మేరకు కనిపించే పచ్చికబయళ్లల్లో కొన్ని ఎకరాల పొలంతో కూడిన తోటలో వుండే తన యింట్లో కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధిస్తూ, పిల్లలో ఆడుకోడంలో తృప్తి పడుతుంది పెరల్ బక్.

బల్లమీద ఎప్పుడూ తెల్ల కాగితాలు తన కలంకోసం ఎదురుచూస్తూవుంటాయి — తను రచయిత్రి. జీవితాంతంవరకూ ఏదో వ్రాస్తూనే వుంటుంది.

స్త్రీజాతికే గర్వకారణమైన పెరల్ బక్ రచనలు ప్రపంచఖ్యాతి నార్జించాయి. సారస్వతంలో నోబెల్ ప్రైజ్ పొందిన ఆమె జీవితానికి అంతకంటే కావలసిందేముంది!

(పెరల్ బక్ వ్రాసిన 'మై సెవరల్ వరల్డ్స్' ఆధారంగా)

(అయిపోయింది.)



సాయంత్రమైంది. రెండురోజుల నుండి ఎడతెరపి లేకుండా, జోరున కురుసున్న జడివాన కొంచెం వెనకాడినట్లు కనపడి చిన్న చిన్న తుంపరలు పడుతున్నాయ్. వొళ్ళు కొరికేస్తున్న చలిగాలి; మేఘావృతమైన ఆకాశం; పొద్దున్నే చీకట్లు కమ్మినట్లుంది. ఊరికి దూరంగావున్న వీరన్న కుంటపై కూర్చొన్నాడు పాలేరు వెంకన్న నెత్తినిండా గుడ్డకప్పుకొని - చుట్టూ పచ్చని పైరుపొలాలు. కుంటమీద కూర్చొన్న వెంకన్న అనాలోచితంగానే వ్రేళ్ళ మధ్య తడిమట్టిని ముదగాచేస్తూ తనకు తెలియకుండానే ఆమట్టిముద్దను కుంటలోకి విసరివేస్తూ వుండిపోయాడు.

'ఎవరక్కడ?' జగ్గయ్యమామ దూరం నుండి పరిశీలించినా గుర్తించలేక దగ్గరగా వస్తూ అడిగాడు.

వెంకన్న త్రుళ్ళిపడి, 'నేను మామా' అన్నాడు లేచి ఒళ్ళు విరుచుకొంటూ.

ఎవరు? వెంకన్నా, నీవంటరా...యెవరో అనుకొన్నా...ఆ అయితే యీ వానలో యీడ కూర్చున్నావేం? అసలే యీదర గాలి..." అంటూ సగం కాల్చిన చుట్టపీకను నోట్లో పెట్టుకొని వెలిగించాడు జగ్గయ్యమామ. వెంకన్న మాట్లాడలేదు.

"ఆఁఆఁ, అయితే మునసబుగారి కాడ పని మానేసినట్టేనా......అంతేగా మరి నువ్వా కొద్దాడివి, వాళ్ళా యెందుకైనా చాలినోళ్ళు...ప్చ్... అయినా" అంటూ ఏదో మాట్లాడబోయి తుపుక్కున వుమ్మేసి దూరంగా మెరసిన మెరపు తీగకు కళ్ళు మూసికొని 'వత్తారా' మళ్ళీ వాన వొచ్చేట్టుంది. అంటూ సాగిపోయాడు.

వెంకన్న జగ్గయ్యమామ వెళ్ళిన వెపు అలా అచేతనంగా చూస్తూ వుండిపోయాడు కొద్దిసేపు. అంతలోనే పెద్ద మెరపుతీగ దేదీప్యమానంగా వెలిగిపోయిందోమారు. వెంటనే పెళా ఫెళామంది.

వెంకన్న ఆకాశంవైపు దృష్టి సారించాడోమారు. పెద్దవరద గూడు కన్పించింది.

వరదగూడు......మెరపుతీగ.

ఈ రెంటిని చూచాక యిక యీనాటికి ప్రయాణం వట్టిదె ననుకొన్నాడు వెంకన్న. పోనీ బయలుదేరితే బయలు దేరవచ్చు. పైన వొచ్చే వానేం చేస్తుంది కనక? కాని వాగు లేరు సురుగులు కక్కితే ఎటూకాకుండా యేటొడ్డున చలిగాలికి కడుపులో కాళ్ళెట్టుకు కూర్చోవాలిసిందే. రెండురోజులనుండి కురిసే వానకు వాగు లేరు రాకుండ వుంటుందా? యెటూ తేల్చుకోలేక మథనపడుతూ కొద్దిసేపలా కూర్చుండిపోయాడు వెంకన్న. నాలుగు ప్రక్కలనుండి చీకట్లు కమ్ముకొచ్చాయి. క్రమంగా మాసిపోయి మాయమైంది వరదగూడు, చిలికి చిలికి చినుకులు పడుతూనే వున్నాయి. ఇక యీ నాటికి ప్రయాణం వట్టిదే!

కాని పొలెంనుండి వెళ్ళకుండా యెలా వుండటం? తెల్లారేపాటికి లచ్చికి పెళ్ళి అయిపోతే, మెళ్ళో తాళితో పసుపుగుడ్డలతో కనపడే లచ్చిని యేముఖం పెట్టుకొని చూడటం?

* * *

వెంకన్న యెక్కడ పుట్టాడో తలిదండ్రులెవరో, ఏమో, యెవరికీ తెలియదు. తన పదిహేనోయేట పొలెంలో మునసబుగారింటిలో జీతగాడిగా ప్రారంభించాడు తన జీవితాన్ని. వేలువిడిచిన మేనమామనంటూ యెవరో వెంకన్నను మునసబుగారి కప్పగించి వెళ్ళారు. ఆనాటినుండి వెంకన్న మునసబు గారి దగ్గరే వుండిపోయాడు.

వెంకన్న నమ్రత, వినయం, పని వొద్దిక చూస్తే, ప్రతివారికి అతనంటే, ఓ విధంగా అభిమానం యేర్పడజొచ్చింది పొలం పనుల్లో బగువులెత్తటంలో, గొడ్లకు తాళ్ళు వెయ్యటం సిగమారల్లటంలో వెంకన్నకు వెంకన్నే సాటి......

కాలం దొర్లిపోయింది. పదిసంవత్సరాలు పరిభ్రమించాయి కాలచక్రంలో...

వెంకన్న మిసమిసలాడే యౌవనుడయ్యాడు. కళకళలాడే మొహం; విశాలమైన ఛాతి; మెలికలు తిరిగిన కండలు. అంత పొట్టి పొడుగుకాని నిండైన విగ్రహం...

మునసబుగారింట్లో పనిచేసే లచ్చి యిప్పుడతనికి మెరపుతీగలా కన్పిస్తోంది. లచ్చి కనిపించినపుడల్లా తనకు తెలియకుండానే చేయితలమీదకు పోయి, వ్రేళ్ళతో పాపిటి దిసేది. ఒక్కొక్కసారి వెంకన్న తనచేష్టలకు తనే నవ్వుకొనేవాడు - లచ్చి రోజూ పడమట పొలానికి తనకు పైటిబువ్వ తెస్తూ వుంటుంది. ఎకసక్కాలాడుతుంది. కొన్నాళ్ళు బెరుగ్గా వుండేది వెంకన్నకు. తరువాత తరువాత లచ్చి తనను ప్రేమిస్తోందేమో? అనిపించి కొంచెం ధైర్యం చేకూరింది.

అయినా యీ ముసుగులో గుద్దులాటెందుకు? అనిపించేది వెంకన్నకు. తేల్చేసుకొందా మనుకొనేవాడు...కాని ధైర్యం చాలేదికాదు. అప్పటికి ఓనాడు మొండి ధైర్యంతో.

'ఏమేలచ్చి నువ్వింకా మనువుచేసికోలేదేమే' అంటూ అడిగేశాడు.

'నామనువు సంగతి నీ కెందుకేంటి మామా' అంది లచ్చి. వెంకన్న బెదరిపోయాడు. లచ్చి యింటికిపోతూ మరి 'నీ మనువు సంగతేంటి మామ' అంది తల క్రిందికిదించి. ఆగినగుండె మళ్ళీ ఆడినంత పనైంది వెంకన్నకు.

'అదే లచ్చీ......? మాట పెగల్లేదు వెంకన్నకు.

‘కొకపోయినా మనం అనుకొన్నయ్ అనుకొన్నట్లు చేసుకోవటం మనచేతుల్లో వుందా మామా?, లచ్చి సాగిపోయింది.

ఎంతసేపాలోచించినా లచ్చి మాటల్లోని అంతర్యం అర్థంకాలేదు వెంకన్నకు... కాని లచ్చిని తనదానిగా చేసుకోవాలనే అభిలాష ద్విగుణీకృతమైంది.

అక్కడక్కడ, తితిమా పాలేర్లతో తన వుద్దేశ్యాన్ని బయటపెట్టి చూచాడు... ఈ వార్త ఆనోట ఆనోట వూరల్లా పాకిపోయింది.

అందరూ యీడుజోడూ అనుకొన్నారు. అందరికీ ఆమోదంగానే వుంది వార్త. కాని...సలసలా కాగిపోయాడు లచ్చి మేనమామ రంగడు. తనని కాదని లచ్చి వెంకణ్ని చేసికోవటానికి యెన్ని గుండెలో తేలుస్తానంటూ హుంకరించాడు.

ఏమేవ్, ఆ యెంకణ్ణి చేసుకొంటానంటున్నదంటగా, అదెట్టా కుదురుతుంది?' అంటూ మొరాయించాడు రంగడు అప్ప రామి దగ్గర. రామి మాట్లాడలేదు. అంతలో లచ్చి రావటం ‘నాయిష్ట మొచ్చినాణ్ణి నేచేసుకొంటా నీకేం, నీవేమన్నా నా బాగోగులు చూసేవాడివి గనకనా' అనటంతో మరీ రెచ్చిపోయాడు—అసలే తప్ప తాగి వున్నాడేమో నోటికొచ్చినట్లు నానా మాటలు మాట్లాడి యిల్లంతా చిందర వందర చేసి కుండలన్నీ పగలగొట్టి ‘నన్ను కాదంటే ఖూనీ చేస్తా'నని బెదరించి మరీ వెళ్ళాడు.

అప్ప రామి హడలిపోయింది. తనూ పెద్దదైంది. బ్రతికినన్నాళ్లు యింకా బ్రతకబోదు. ఏదో తన ఘటం ఉండగానే, లచ్చిని ఓ అయ్యకిచ్చి, తను కళ్లు మూద్దామనుకొంటే, ఆ ఆశ నెరవేరేట్లు కన్పించలేదు-పోనీ రంగడికే యిద్దామా అంటే— తన సంపాదన లేకపోగా అది సంపాదించిన నాలుగు రూకలు తాగుడికి తగలేసి తందనాలాడతాడు. వెనక మూకనంతా పోగుచేసి వెర్రివేషాలేస్తాడు. అయినా అసలు లచ్చికి వాడంటే సుతరామూ యిష్టం లేదు. రోజులు గడుస్తున్న కొద్దీ రంగడి గోల యెక్కువైంది...ప్రతినిత్యం యింట్లో గోల; అప్పటికీ రామి తగాదాకు దిగకుండా సర్దుకుపోతున్నా... ఊళ్లో అక్కడక్కడ తనే లచ్చిని పెళ్ళిచేసికోబోతున్నా'ననీ; ‘ఈ నిర్ణయాన్ని యెవరూ యెదిరించలేరని' అంటూ ప్రచారం కొనసాగించాడు రంగడు.

* * *

కథలో పరిస్థితి పాత్రలు వచ్చి పడ్డాయి. మునసబుగారిముందర పంచాయితీ కెక్కొచ్చింది లచ్చి—రంగడి తగాదా. పదిమంది ముందరా రంగణ్ణి తను పెళ్ళాడనని ఖచ్చితంగా చెప్పింది లచ్చి.

‘దానిష్టం బాబు—నా దేముంది' అంది రామి.

‘నన్ను మనువు చేసికోవటమో, లేకపోతే నాకు రావాలసిన అయిదు వందల రూపాయలు యిప్పుడే కట్టటమో తేల్చమన్నాడు రంగడు...

రామి—లచ్చి తెల్లపోయారు. అయిదు వందల రూపాయలు తనకెందుకివ్వాలో అర్థంకాలేదు వారికి. పైగా వాడి జాదాలకు, తాగుళ్ళకు వీళ్ళ సొమ్మే చాలా హరించిపోయింది—

‘అయిదొందల రూపాయలేంటి' అంటూ అమాయకంగా ప్రశ్నించింది రామి.

‘అదే నిరుడు మానూల్లో నాదగ్గరఅప్పుగా పుచ్చుకొన్న బాపతు' అన్నాడు రంగడు. మాసులేంటి 500 రూపాయలు మేమెందుకు తీసుకొన్నాం బాబు—అంతా వట్టిది" అంది రామి. అంతే ‘అందుకొన్నారు మునసబుగారు. వట్టిదేనని బుకాయిస్తే సరిపోతుందిటే రామీ? ఇది వ్యవహారం, అక్షరాలా అయిదువందలు తీసికొన్నట్లు నీవు వ్రాయించి, వేలిముద్ర వేసిన నోటుయిదిగో కాదంటే సరిపోయింది. అవతలకొట్టండి మరి! "అంటూ పెద్దమనిషి తరహాలో మాట్లాడి..." మరి వాడి పైకం వాడికి సర్దుతావో...లచ్చినే యిస్తావో" అంటూ తీర్పు ధోరణిలో సమస్యను ఓ దరికి లాక్కొచ్చారు.

రామి ‘ఆనోటేమిటో భగవాన్సాక్షిగా నాకు తెలియదు బాబూ' అంటూ లబోదిబోమంది. అది మునసబుగారి పంచాయితీ. భగవంతుడు ఆ చాయలకుకూడ రాడన్న సంగతి గుర్తించలేకపోయింది రామి.

రామిగోల అరణ్యరోదనైంది-పంచాయతీదారులు తీర్పు యిచ్చారు మునసబుగారి మాటలనే; రంగడు గడువులేదని హెచ్చరించాడు;

* * * *

రంగడు, రామిచేత వూరిబయట యిల్లు వేసుకొన్నందుకు కట్టవలసిన శిస్తు తీసివేయించేందుకు తెల్లకాగితంపై అయిదారు నెలల క్రితం వేలిముద్రలు వేయించుకొన్నాడు. ఆ కాగితాన్నిలా మునసబుగారిసహాయంతో వినియోగించుకొన్నాడు.



వరదగూడు మెరుపుతీగ

మునసబుగారిలా తిరించటానికి కారణం, కేవలం స్వార్థమే; వెనకటి ఏదో కేసులో రంగడు కేసంతా తనపై వేసికొని తన్ను రక్షించటం! అడపా తడపా, యిప్పటికి తనకు ఆ సహాయం, ఈ సహాయం చేసి పెట్టడానికి ప్రతి సహాయమే యిది.

పంచాయితీతతంగమంతా దూరంగావుండి విన్నపాలేరు వెంకన్న పండ్లు పటపటలాడించాడు. పదిమంది సమక్షంలో సాగిపోతూన్న అన్యాయాన్ని ప్రతిఘటించాలనుకొన్నాడు... కాని సాటి పాలేరు జగయ్యరూపు తమాయించమని ఆపటంతో వెనకాడాడు.

అమర్నాడు లచ్చి కన్పించింది వెంకన్నకు ...ఏదో మాట్లాడదామనుకొన్నాడు కాని లచ్చి వెంకన్నను చూస్తూనే తలవొంచేసుకొని దూరంగా వెళ్ళిపోయింది!

వెంకన్నకు తనముందు రెండే రెండు సమస్యలు మిగిలిపోయాయి. లచ్చి తనను వివాహమాడటానికి యిష్టపడుతుందా? అలా అయితే లచ్చిని రంగడి బారినుండి తప్పించే మార్గమేది? ఈ ప్రశ్నలకు సమాధానం చాలసేపు తోచలేదు. చివరకు ఓ నిర్ణయానికొచ్చాడు! లచ్చి తన్ను పెళ్లాడినా లేకున్నా, లచ్చికి అయిదువందల రూపాయిలు తనందించాలి. తనకూ జీతం బాపతు గత అయిదు సంవత్సరాలుగా వెయ్యి రూపాయిలు రావాలి. తనా పైకం మునసబుగారి దగ్గరే దాచుకొన్నాడు కూడ.

'పైకం కొంచెం దయచేయించండి అవసరంగా వుంది' అంటూ సాయంత్రం మడెక చూడటానికొచ్చిన మునసబుగారిని అడిగాడు వెంకన్న....

నీకిప్పుడు పైకం యెందుకోయ్' అన్నాడు మునసబుగారు.

'కావాలండి' నీళ్ళు నమిలినట్లు సమాధానమిచ్చాడు వెంకన్న తలగోక్కుంటూ.

ఈ వరస వస్తుంది అని మునసబుగారికి ముందే తెలుసు. సమాధానాన్ని అందుబాటులోనే వుంచుకొన్నాడు. "పటుపట్టుమంటే పైకం అంగుతుందా? కొంచెం వెసులుబాటు చూచుకొని అలా చేయిస్తా...అయినా వెంకడూ, నీ క్కని విషయాలలో జోక్యం గల్గించుకొకు అందని పళ్లకు అర్రులు చాచి ప్రయోజనం లేదు' అంటూ హెచ్చరించి మరీ వెళ్ళారు.

వెంకన్న కిదేం బోధపడకపోయినా మునసబుగారు తనకు ఎలాంటి సహాయం చేయరని మాత్రం గ్రహించగల్గాడు. అతనిలో వుద్రేకం కట్టలు తెంచుకొంది—కాని తాను పాలేరునని జ్ఞప్తికి తెచ్చుకొని తమాయించుకొన్నాడు...

ఇంటికేసి వెళ్లటానికి బయలుదేరిన వెంకన్నకు దారిలో లచ్చి కన్పించింది— తనెందుకో లచ్చిని పలుకరించటానికి సంకోచించాడు... కాని లచ్చే పల్కరించింది.

"ఎక్కడనుండి మామా" అంటూ.

'మడికినుండి లచ్చి' వెళుతూన్న వాడల్లా ఆగి జవాబు చెప్పాడు వెంకన్న.

"ఇయ్యాలదాక..." మధ్యలో ఆపివేసింది లచ్చి—

'అవును లచ్చీ ఏదో పనుండి వుండిపోవాల్సి వచ్చింది...అది సరేగాని మీ రంగడేమంటున్నాడు?' వుండబట్టలేక అడిగేశాడు; లచ్చి సొంత విషయాలలో చొరవగా తలదూర్చటం యిదే ప్రథమం వెంకన్నకు—

ఏమంటాడు......దిక్కులేని వాళ్ళను ఎవరెట్లా అనాలో, ఎవరెట్లా చూడాలో... అట్లా అందరూ చూస్తున్నారుగా...అంటున్న లచ్చి కళ్లలోకి నీళ్ళు గిర్రున తిరిగాయి కంఠం గద్గదికమైంది. వెంకన్నకు కొరడాతో చరిచినట్టు వినిపించాయా మాటలు. లచ్చి మాటల్లో తనని వుద్దేశించిన మాటలున్నాయా అనిపించింది. ఏనాడూ కంటతడి యెరుగని లచ్చి యీ నాడిలా దిగాలు పడిపోవటంతో వెంకన్నకు లచ్చి స్థితి యెంత హీనంగా వుందో అర్థమైంది.

'అవును లచ్చీ నేనన్నా పైకం సర్ది అవసరానికి అడ్డు పడదామంటే......వీలులేకపోయింది' నిస్సారంగా జవాబిచ్చాడు

వెంకన్న......

తలవొంచేసుకొనివున్న లచ్చినిట్టూర్చింది. 'ఏటి కొరుగీచలేం లేమామా! అయినా నా బతుకోసం నీవు యిరుకున పడటం దేనికి నా బతుకే వరదగూడు' పొగిపోయింది భారంగా లచ్చి.

భారంగానే యిల్లుజేరిన వెంకన్నకు రంగడు మునసబుగారి అధ్వర్యాన్న రుల్లుంటే పెళ్ళిచేసికోబోతున్నాడని తెలిసింది. ఆరాత్రల్లా వెంకన్నకు నిద్రపట్ట లేదు–'నాబతుకే వరదగూడు' ఆ సేమాటలే కలవరపెట్టాయి వెంకన్నను.

తెల్లవారే సరికి యీ దరగాలితో ప్రారంభమైంది చిలికిచిలికి పడే వానజల్లు. లచ్చి పెళ్ళైయ్యాక యిక తనావూరులో బ్రతుకు సాగించటం దుర్భరం! తన కళ్ళముందు లచ్చికి అన్యాయంగా పెళ్ళి జరిగిపోవటం సహింపరాని విషయం! కాని జరిగిపోవాల్సింది జరిగి తీరుతుంది. అందుకే తనావూరినుండి శాశ్వతంగా నిష్క్రమించాలి. 'రేపు లచ్చిపెళ్ళి–ఈరోజే వెళ్ళిపోవాలి' వెంకన్న నిర్ణయించాడు. పది సంవత్సరాలు తల్లిలా ఆదరించిన గ్రామాన్ని వదలిపోవటమంటే బాధవేసింది. కాని ... తప్పదు. అంతర్గంలో నమస్కరించాడో సారి–'దూరంగా వెళ్ళిపోతున్నానమ్మ' అనుకొంటు.

తిన్నగా వీరన్నకుంట జేరాడు. వెంకన్న ఎక్కడికో? తన గమ్యమేదో! అంతా అగమ్యంగా వుంది.

వెంకన్న ఆలోచనా తరంగాలనుంచి తేలి బయటపడేసరికి వానజల్లు వెలిసింది... కాని బాగా చీకటిపడిపోయింది; తెల్లవారక ముందే దాటిపోవాలి తను–ఈ రాత్రికి కుంటమీద గడిపి తెల్లవారుజామున వెళ్ళటానికే నిశ్చయించుకొన్నాడు వెంకన్న–తుమ్మచెట్టుమీద గ్రుడ్లగూబ పిచ్చిక గూటిపై వాలినట్లుంది పిచ్చిక కిచకిచలాడింది.

పిచ్చుక గూడు–అదే వరదగూడు–లచ్చి జ్ఞాపకానికొచ్చింది.

వెంకన్నకు జాలివేసింది. ముడుచుకొన్న శరీరాన్ని సైతం కష్టపెట్టి, లేచి గ్రుడ్లగూబను తోలివేశాడు.

దూరంగా చప్పుడయింది. ఎవరో వస్తున్నట్లు. వస్తున్న దెవరో పోల్చుకోలేకపోయాడు చీకటిలో. తెల్లగా వెలిగిపోయింది మెరపుతీగ.........ఆ కాంతిలో మరో మెరపుతీగ...లచ్చి- ఆయాసపడుతూ వురుకున వస్తోంది.

'లచ్చి !'

"మామా !"

"ఎందుకొచ్చావు ?"

"ఎందుకేంటె మామా" తమాయించుకొని చెప్పింది లచ్చి. 'యెదవలోకం యిక్కడనుండి దూరంగా పోయిగా బ్రతికేచోటికి పారిపోదాం పదమామా ! మన్ని లోకువగా చూచే యీ పాడూరుతో మనకేంపని... వెళదాం పదమామా !"

వెంకన్న నివ్వెర పడిపోయాడు. క్షణకాలం నోట మాటరాలేదు.

తనకోసం లచ్చి–లచ్చికోసం తను ఈ పాడూరు వదలి దూరంగా పోవాలి.

'అంతేలచ్చీ !, పట్టరాని ఆనందంలో లచ్చిని దగ్గరకు తీసుకున్నాడు. మెరపుతీగ మెరసిపోయింది. మరోమారు 'కానీ లచ్చి! తెల్లారిపోదాం. అసలే సాయంత్రం వరదగూడేసింది. వానొచ్చుద్దేమో! నాగులేరు నురుగులు కక్కుతోంది అసలే!'

'అట్టా యీలులేదు మామ. యిప్పుడెల్లిపోవాల్సిందే...యెదవ తెల్లారితే పెండ్లని రంగడు తప్పతాగి తందనా లాడుతుంటే తప్పించుకొచ్చా! పసిగడితే వచ్చిపడతాడు పద మామా!'

'మరి వరదగూడేసిందాయె... మెరుపులి మెరుస్తున్నాయె – యెట్టా లచ్చి !'

'ఒస్! నీకు తెలియదన్న మాట... తూరుపున వరదగూడేస్తే తుంగపోదన్నా తడవదు మామా! వానరాదులే! బయలుదేరు ఇక మెరపుతీగ చుట్టితె నురుగులు కక్కే నాగులయ్య సైతం నూగారి పూరటపొందాలిసిందే!...అంతే నీకు తెలవదు. అట్టా మాతాత చెప్పేవాడు నాకు ...... మాట్లాడక బయలుదేరు.

"అంతేలే లచ్చి, నీవు నాపక్కనుంటే నాగులయ్యరాడు – వానదేముడురాడు. అయినా నేనీడున్నానని ఎవురు చెప్పారు!' 'జగయ్యమామా' అంటూ దారితీసింది లచ్చి. సౌదామిని నొకటి మెరిసింది విద్యుల్లతొకటి విరిసింది మెరపుతీగొకటి వెలిగింది – లచ్చి వెంకన్నలకు దివ్వెల్లా. ★



41

మేజస్ట్రీటుకోర్టులో నే విచారణ ప్రారంభమైంది. ముగురు ముద్దాయిలను ఒక వేపు నిల్చోబెట్టి వారిమీద నేరారోపణ చేసారు. ముగురూ నిర్దోషులమని చెప్పారు.

ఇక అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటరుకు నేర నిరూపణ చెయ్యవలసిన అవసరం వచ్చింది. మొదటిసాక్షిగా నీలమ్మను పిలిపించారు. నీలి కూతురును కోర్టుబయట చెట్టు క్రింద కొడుకుకు అప్పచెప్పి కోర్టులోకి వచ్చింది. ఉన్నమట్టుకు చింకిచీరల్లో మంచిది కట్టుకొని శరీరమంతా కప్పుకుంది. మనిషి చిక్కిపోయి వున్నది. ముఖం పాలిపోయి, వేసిన మెట్ట (కొప్పు) కూడా మోటుగా వుంది.

తలవంచుకొని బోను యెక్కుతుండగా ఆమె కాళ్లు గజగజ వణకనారంభించినయ్. ఎక్కి, బోనును చేతితో పట్టుకొని నిల్చొని తలయెత్తేసరికి ముగ్గురు నేరస్థులూ అగుపించారు. తలదించుకొనివున్న భర్త వేపు చూడగానే ఆమెలో అదోక విధమైన సంచలనం కలిగింది. ఎందుకో ఆ ముఖం చూడటానికి సిగ్గువేసింది. శక్తిహీనయై కళ్ళల్లో నీరు తిరుగుతున్నప్పటికీ వెంటనే తన విధి జ్ఞప్తికి వచ్చి ధైర్యాన్ని కోలుకోడానికి ప్రయత్నించింది.

భార్య, కొడుకు చెప్పే సాక్ష్యంపైనే, తనూ తన సహోదరులూ బయటపడే అవకాశం వున్నదని, తమ వేపు వాదించడానికి గవర్నమెంటువారిచ్చిన ప్లీడరు చెప్పారు. చంద్రయ్య వెళ్ళి నచ్చచెప్పాడని పుల్లయ్యకు తెలుసు. ఈ సరికి ఆలోచించి తప్పకుండా తను బయటకు రావటానికి పనికివచ్చే సాక్ష్యం ఇస్తుందనే గాఢనమ్మకంతోనే వున్నాడు.

ఇంతలో డఫేదారు "అమ్మా! యీ ప్రమాణం చెయ్యి" అంటూ "దేవుని యెదుట......"

ఆమె అడ్డి, "అదెందుకు బాబూ-ఆతండ్రి యెప్పుడూ వుంటాడు......" అంది

"అలాగ ప్రమాణం చెయ్యాలమ్మా!"

నీలి డఫేదారు చెప్పినట్టు ప్రమాణం చేసింది. ఆమెలో కొద్దిక్షణాల క్రితంవున్న బెణుకు, బాధ, సంచలనం తగ్గిపోవడం మొదలుపెట్టింది. ఆ గొంతుకలో యేదో దైవత్వం చొచ్చుకున్నట్లుంది. భయం రాను రాను సడలిపోయింది.

అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటరు ఆమెను ప్రశ్నించటానికి వుపక్రమించాడు.

"నీ పేరు?"

"నీలమ్మ."

"నీభర్త పేరు?"

"పుల్లయ్య"

"ఈముగ్గురిలో నీభర్తనుగుర్తు పట్టగలవా?"

"హాఁ. మధ్యనున్నాడు."

తరువాత వేసిన వివిధప్రశ్నలకూ ఆమె నిస్సంకోచంగా జవాబుచెప్తుంటే, పుల్లయ్య కళ్ళు మండుకుపోతున్నాయ్. వాడికి యెక్కడలేని కోపం, బాధా పెల్లుబుకుతుంటే చేసేదిలేక లోలోన బాధపడుతున్నాడు.

ఒకనాడు స్టేషనుదగ్గరదొంగతనం మొదలు, ఓడ సరుకు దించడానికని రాత్రుళ్ళు వెళ్ళేవాడని, ఒకనాడు చీర తెచ్చిన విషయం, వాళ్లగ్రామంలో పాక్యారిమెంటు తగవుల్లో జరిమానాపడ్డ సంగతి, ఈ నేరం జరిగిన నాటి రాత్రి, తరవాత వుదయం కొడుకుకూ తనకూ జరిగిన తంతుఅంతా ప్రశ్నలు అడుగుతుంటే నీలి సమాధానాలిచ్చింది. మిగతా ఇదరినీ తను ఇదివరకు చూడలేదనీ, వాళ్ళు యెప్పుడూ తన ఇంటిదగ్గరకు రాలేదనీ కూడా చెప్పింది.

ఈ నిజాలన్నీ ఆమె తొణకకుండా బెణకకుండా చెప్పటంతో ముద్దాయిల తరపు ప్లీడరుకు అట్టే పనిలేకపోయింది. కానీ తన ప్రయత్నం మానలేదు. ఆయన వేసిన ప్రశ్నలలో కొన్ని:

"నీ మొగుడి బుద్ధి యెలాంటిది?"

ఆమె సమాధానం చెప్పలేదు.

"పోనీ నలుగురూ నీ మొగుడిని గురించి యేమనుకునేవారు?"

"మా మామ్మ దచ్చిపోతూ చెప్పింది. చెయ్యికాలితే కుండ వదిలిపెడ్తాడని... ఈ వూరు వచ్చినాక ఎవురు యేం అనుకున్నారో నాకు తెలీదు బాబూ!"

"అలాంటివాడని, నీ మొగుడంటే నీకు

కోపంగా వుండేదికదూ ?"

"కోపం తెచ్చుకొని యెవర్ని బాగు చేస్తాం బాబూ! కోపం తెచ్చుకున్నోల్లకే నష్టంగానీ..."

"నీమొగుడు నీమీద కోపపడేవాడుకదూ? అంచేత నీకు వాడిమీద కోపంవుండేది-ఏం? అంతేనా ?"

'ఇలాంటి వెందుకడుగుతారు బాబూ ?"

"మీ యిద్దరికీ సరిగ్గా పడేదికాదని ఒప్పుకుంటావన్నమాట !"

"అలాగెందుకు ఒప్పుకుంటాను? నా మొగుడు నన్నెప్పుడూ తిట్టనేదు; కొట్టనేదు- మీరిన్ని అనండి- ఇదేం పని? ఆ రోజుల్లో మావూర్లో గుడ్డివెంకన్న యెప్పుడో దొంగతనాలు చేసేవోడని వాడిమీద లేచేవోడు. అలాంటోడు యిలాగ అవుతాడనుకున్నానా? కానుకున్నానుకాదు- ఆడిన మాటలన్నీ నమ్మినాను. నాను సెప్పినట్టు అవూర్లో నేవుండి కంబారితనం చేసుకుంటే బతికేద్దుంబాబూ? ఇన్నాడుకాదు - ఈ పాపంపనికి సెట్టుకున్నాడు."

పుల్లయ్యకు పట్టరాని కోపంవస్తోంది. ఇదంతా నీకోసం చేసానని- నివ్వేదగా చేసానని అరవాలనుకున్నాడు. తను మాటాడితే నేరం ఒప్పుకున్నట్లవుతుందని బలవంతాన పెదాలు నొక్కుకున్నాడు.

నీలిసాక్ష్యం అయిపోయింది. మల్లును కోర్టులోనికి తీసుకువచ్చేముందు ప్రాసిక్యూటరు మేజస్ట్రేటుకు విన్నవించేసాడు- కుర్రవాడికి తండ్రిమీద చాలా అభిమానం కాబట్టి తండ్రియెదురుగా కనిపిస్తే యేడుపు తప్పించి సాక్ష్యంరాదనీ, అంచేత యీ ముద్దాయిని చాటుగా వుంచాలనీ కోరాడు. మేజస్ట్రేటు అందుకు అంగీకరించాడు.

మల్లు చెప్పినట్లు విని ధీమాగా బోను యెక్కి యిటూ ఆటూ తిరిగాడు. బోనులో మునిగిపోయి నట్లున్నాడు. చేతిలో చిన్న కర్ర పారేసున్నా పారేయండా నే బోను యెక్కాడేమో, లోనుంచే ఆ కర్రతో బోనుచుట్టూ ఒకసారి త్రిప్పి గరగర లాడించాడు.

ప్రాసిక్యూటర్ నవ్వుముఖంతో:

"అబ్బాయి-చాల మంచివాడు-నీ పేరు!"

"మల్లు !"

"మీ అయ్యపేరు !"

మల్లు వెకోళంగా నవ్వుతూ "మా అయ్యపేరు తెలీదా ?-పుల్లయ్య !"

"మంచిపేరే ?"

"మా అయ్య మంచోడు-మా అయ్యపేరు మంచిదే! నీపేరు ?"

"నాపేరు గోవిందరావు."

వెక్కిరిస్తూ: "ఛా-అంతపేరా?మంచిదే కాదు!"

"చిన్నపేరు చేసుకుంటాను గాని...ఏదీ చెప్పు- ఆ వేళరాత్రి మీ అయ్య, నివ్వూ మీ యింటి గడపలో పడుకున్నారుకదూ?"

"ఎప్పుడూ పడుకుంటాం-నాను మా అయ్య గుండెమీద పడుకుంటే, మాఅయ్య సరదా- నా సరదా- ఓఓ..." నవ్వుముంచుకొచ్చింది.

"అయితే ఆ వేళ యేమయిందో చెప్పు!"

"ఏయేళ ?"

"మీ అయ్య మేడెక్కినాడు-ఆయేళ"

"అక్కడ సెప్పినాను- ఇక్కడెందుకు?"

"ఇదిగో వీళ్ళంతా వినలేదట—వింటా నంటున్నారు. చెప్పెయ్ మల్లూ—చాల మంచివాడివి!"

మల్లు కర్ర కాలుకిందపెట్టి రెండుచేతులతోనూ బోనుపట్టుకొని, కోర్టులోవున్న మనుషుల వేపు చూస్తూ మొదలు పెట్టాడు. చిన్ని చెడ్డీ—ఆ పైన భుజాలు చిరిగినకమీజు- ముఖంమీద పడుతున్న జుత్తు - ఎలకపళ్ళు ముద్దు మైనమాట...

"ఆయేళ అమ్మతో నిపాయిగమ్మదగ్గరకూకున్నాను. అలా గొచ్చి అయ్యదగ్గర పడుకోడానికెళ్ళి...పదాలుపాడినాను...ముద్దాన్నంపడుకున్నానుకదా-నాకు కునుకురాదు...అయ్యకి రాదు...సీకటి ...గొప్పసీకటి అలాగ కునికిపోనాను. నాకు తెలివొచ్చినాది-మా అయ్య లేసిపోతన్నాడు. నానూ లేసినాను. మళ్ళా వచ్చి మీదేసుకొని జోకొట్టాడు. ఈ యేళ మా అయ్య నన్ను రానివ్వడు—మా అయ్యపని నాను సూడాల ఎంత ఒకసో యేమిటో...టక్కుయేసి నాను -దాగోని అటుయెనకాలే వెళ్ళినాను."

"మీ అయ్యతో వున్నవాళ్ళెవ్వరు" అని ప్రాసిక్యూటర్ ప్రశ్నించాడు.

"అన్న—సెంద్రయ్య!"

"వాళ్ళేనా?" అని వాళ్ళిద్దరినీ చూపించగానే మల్లు వాళ్ళే అవునని చెప్తూ అన్నను దేశించి "నీవు బొండాలు, పానీయు యిచ్చేవాడివికదూ?" అన్నాడు.

తరవాత ప్రాసిక్యూటరు! "అయితే వాళ్ల యెనకాలే వెళ్లావు. తరవాత యేమైంది?"

"ఏమైనాదా?" కొంతసేపు ఆలోచించి: "యెనకాలే యెళ్ళాను; దీపందగర ఆగినారు—మా అయ్యనూ సే కొట్టినాడు— సెత్తిల డొక్కపాటునే వుండిపోనాను... అలాగయెతే ఒడనేదు మేడ! నానూ మేడెక్కితే యెంత బాగున్ను—అయ్యనూ సే కొట్టడా? మా అయ్యకి కోపంరాదా? మీదకెక్కినాగ-టక్క బా! బా! భయం వేసినాది. ఓ—ఓ...గొల్లు; సెత్తిల డొక్కలో దాగుండి పోనాను...మా అయ్య మరిరానేదు", అంటూ ధైర్యంగా నే ఆమరుదటిరోజు జరిగిన విషయం ఆగి ఆగి చెప్పాడు. అయ్య ఆరాత్రి తిరిగిరావటం వరకు బాగానే వెళ్ళింది తరవాత ధైర్యమైన అగొంతుకదుఃఖం పెల్లుబికింది.

"ఆయేళ పోలీసులు మా అయ్యని తీసుకు పోనారు. ఎంత యేడిసినా మా అయ్య రాడు -కనపడడు—మా అయ్యని యేంసేసినారో! ఇక్కడున్నాడు, అక్కడున్నాడంటారు! ఎక్కడున్నాడో...మా అయ్యంటే యిలాగ లేనిపోనివి సెప్పినోలకి దబ్బుడు దబ్బుగు యేసీదా? మా అయ్య యెంత మంచోడు! మా అయ్యేడని అమ్మనడిగితే, వూరికెళ్లాడంటాది—వూరికెళ్తే నాకు సెప్పకండా యెళ్తాడా! యెళ్ళినా నన్ను వదిలి యిన్నాళ్ళు వుండడే..." అంతలోనే ఆ గొంతుక మహోత్కటుత్వం దాల్చింది. పౌరుషం కోపం మిన్నుముట్టాయి. గబగబ కాళ్ళక్రింద వున్న కర్రతీసి ఝుళిపించాడు. బోనుమీద గట్టిగా నాలుగుసార్లు కొట్టి "పోలీసోలూ మీరంతా మా అయ్యని యేంచేసినారు! మా అయ్య నివ్వకపోతే సూడండి



"నేను అడిగిన ప్రశ్నకు సూటిగా సరి అయిన సమాధానం చెప్పు," అని ఒక ఆఫీసరు తన ఆఫీసులో పనిచేసే కుర్రవాడిని ఇలా ప్రశ్నించాడు.

"నేను ఆఫీసు బోయిని అయి నువ్వు ఆఫీసరు వయితే ఏమి జేస్తావు?"

"వెంటనే ఆఫీసు బోయిని వుద్యోగంనుండి తీసివేస్తాను" సంకోచం లేకుండా జవాబిచ్చాడు కుర్రవాడు.

★ దగాపడిన తమ్ముడు ★

మీ అందరిని దబ్బిడ దబ్బిడ యీ కఱ్ఱతో యేసేస్తాను. మీఅందరినీ గజ్జా కరిసేస్తాను. అయ్యో...అయ్యో!" గట్టిగా కేకలు వేసాడు. ఆ నిముషంలోనే ప్రక్కన దాచిపెట్టిన అయ్యకు ఒళ్లంతా వణికిపోయింది. కళ్ళు కాయలు కాసిపోయాయి. కోపం తాపం అంతా ఆక్షణంలో మరచిపోయి గప్పున ముందుకు చొచ్చుకు పోయాడు.

"మల్లు—నా నాయనా!" అంటూ బోనులోకి ఒక్క యెగురు యెగరాలనుకున్నాడు. అయ్యని చూసిన మల్లు పట్టలేని సంతోషంతో "అయ్యా" అంటూ ఒక్క కేక వేసి బోనుదిగి పోయాడు.

ఏడుస్తున్న మల్లును ఢఫేదారు బయటికి, ముందుకు వురుకుతున్న పుల్లయ్యను పోలీసులు వెనుకకు తీసుకపోయారు.

42

కోర్టునుంచి తిరిగి ఖైదులోకి వచ్చేసరికి సాయంత్రమైంది. రాగానే కూలబడిపోయాడు. మనస్సంతా క్రోధంతో మండిపోతోంది. ఎదురుగా ఇనప కటకటాలు అడ్డుగా వున్నయ్. లేదా అంటే ఆ భరించలేని కోపంతో పసుగట్టిపోయి పెళ్ళాంపీక పిసికేసేవాడే!

"అదే చేసినాది నామల్లు అయ్య సెప్పాద్దన్నాడంటే మాటాడేవోడా? నా మీద నిగాపెట్టి పగోడికి సేసినట్టు సేసింది! దానినుంచే పాడయినాను అదెమ్మప్పమాటలు యిన్నాను కాను. బుగతి అన్నట్టే నాకు దగాచేసింది. దానంసేసి ఇల్లు గుల్లసేసింది. రాజిగాడికి తలఒగ్గించి అంతా నాశనం చేసింది. పిరికిమందేసి నా పౌరుషాన్ని కాల్చేసింది. దాని అంతస్తు సూసుకోలేకపోనాను. పంతానికి పాకులాడి ఆ తక్కువ దాన్ని, సెలక వుండిపోయినదాన్ని కట్టుకున్నాను. ఎత్తెత్తి యెంగిలాకుమీదే కాలేసినాను! వలసివచ్చిన ఆ రంబని కట్టుకోకుంటే నాకీగతి పట్టేదా? బంగారంలాంటి వూరు వదిలేవోడినా? ఈ కటిక నేలమీద దొర్లేవాడినా? ఇలా నానాయన మల్లుకి దూరం అయ్యేవాడినా? ఇదచేసింది. దీన్ని తిట్టినా కొట్టినా, సంపినా పాపం నేద"ని ఆట్టుడికి నటయిపోయి ఆ వేళ పడిపోతున్నాడు. ఆ వేళ తిండి సయించలేదు. పెళ్ళంమీద కోపమే ఒళ్ళంతా నిండిపోయివుంది. ఈ ఆలోచనలతో చీకటైపోయింది.

వుండీవుడిగీ వెఱ్ఱివాడిలా యిటూ అటూ తిరుగుతున్నాడు. ఒకోసారి ఆలోచనలకు తగ్గట్టుగానే నటిస్తున్నాడు. మాటల మధ్య మధ్య బయటకు వస్తున్నాయ్. మూడుసార్లు ఇనపకడీలు వంచడానికి ప్రయత్నించాడు. ఆ బలమంతా వుపయోగించినా తలుపు వూడిపోలేదు.

ఈ తోడిమనిషి బాధను అలా పరిశీలించి చూస్తున్న యింకో ఖైది చాలసేపయ్యాక "ఏమైంది నాయనా?" అన్నాడు.

"అయ్యింది—అదిచేసింది—ఈ తలుపు వూడితే దాన్ని ఒక్కయేటు యేసేనా?"

"ఎవరిని...?"

"దానినే—ఆ తక్కువదానిని—అది నా పెళ్ళమట...వూరంతా వద్దంటే ఆ గతిలేనిదాన్ని చేసుకున్నాను. అది నామీద యెదురుసాక్ష్యం చెప్పింది..."పుల్లయ్య కోపం ఒక్కసారిగా ఉధృతమైన దుఃఖముగా మారిపోయింది. వలవల యేడ్చేస్తూ "నా మల్లును—నా నాయన్ని యెన్నాళ్ళో అది సూడనివ్వదు...యిలాగ నా నాయన కోసం పలవరించి పలవరించి...నా సెమూ తాను?"

వెక్కి వెక్కి ఆయనదగరకు వెళ్లి యేడుస్తున్నాడు. ఆ చల్లని చెయ్యి మెల్లగా తన దగర వంగిన వానితల నిమిరింది. కొంత సేపయ్యాక మెల్లగా తనచోటుకు తీసుకవెళ్ళి నిద్రపుచ్చాడు. పుల్లయ్య నరాలన్నీ నీరసంచేత పీకసాగాయ్. అలా జార్లబడి కళ్ళు మూసుకున్నాడు. కళ్ళుమూయగానే కోర్టు, భార్య, కొడుకు అదృశ్యం అంతా అగుపిస్తోంది...ఎక్కడలేని బాధ, దానికితోడు అతృప్తి తనలో పెనవేసుకొని వస్తున్నది. కళ్ళు విప్పి వోరగ చూసాడు. పైన జైలు జవాను యిటూ అటూ పచారుచేస్తున్నాడు. వరండాలోని వెలుతురు కొద్దిగా ఈ కొట్టులోకి పడ్తోంది. ఆ లేత వెలుగులో తను ఓదార్చిన మనిషి వేపు చూసాడు.

చప్పున బూచోడు ఇక్కడికెలాగొచ్చాడనుకున్నాడు? బూచోడా? కాదే... ఎవరు? దాసుడులాగున్నాడు...దాసుడు యేనాడో పోయాడుకదా యెలా వస్తాడు.? అయితే అయితే బూచోడా? అలాంటోడిని ఖయిదులో యెందుకు పెట్టారు? అయితే యెవరు? ఈ మనిషి యీ వేళ పొద్దున ఈ కొట్టులో లేడే! ఎలాగొచ్చాడు? ఎవరు?

అతడు మెల్లగా ఒక ప్రశ్న వేశాడు.

"నాయనా! బాధ తగ్గిందా?" అని...

వెంటనే జబాబు రాలేదుగానీ... వూఁ అని తనకు తెలియకండానే మూలిగాడు. పైన అడుగులు చప్పుడు వినిపించలేదు. బహుశః జవాను ఆ చివర కూర్చొని వుంటాడు. రాత్రి గడచిపోతున్న కొద్దీ పుల్లయ్యకు నిద్దర దూరమైపోతోంది. తనతోడి ఖైదికూడా నిద్దరపోలేదు. మళ్ళీ కొంత సేపయ్యాక "నిద్దర రాలేదా నాయనా?" అని ప్రశ్నించాడు?

ఆ గొంతుక వింటుంటేనే పుల్లయ్యకు ఒళ్ళు జలదరిస్తోంది. ఆ గొంతుక యెక్కడో విన్నట్లు—ఆ గొంతుకలోనుంచి వచ్చిన మాటలు చల్లని నీరులా తన కోపాగ్నిమీద పని చేస్తున్నాయి.

కొంత సేపయ్యాక లేచి కూర్చున్నాడు. ఆయనకూడా దగ్గరకువచ్చి "నీకీగతి యెందుకొచ్చిందినాయనా?" అన్నాడు. ఆ ప్రశ్నతో తనబ్రతుకంతా విప్పి చెప్పకుండా మనిపించింది. తన ముక్కు ముఖం యెరగకపోయినా, వూరూ పేరూ తెలియకపోయినా ఈ లోకంలో యీయన ఒక్కడే తన బాధ పంచుకునె మనిషనిపించింది. అలా కూర్చొనే మెల్లగా మొదటినుంచీ తన బతుకంతా యీ వేళవరకు జరిగింది చెప్పకొచ్చాడు! అంతా విన్నాక అతను ఒక నిట్టూర్పు విడిచాడు—అంతే! ఇంకేం వ్యాఖ్యానించలేదు. లేచిపోయి "చాలరాత్రి అయ్యింది పడుకోనాయనా! అలసిపోయివున్నావ"ని అతను తన జాగాకు వెళ్లిపోయాడు.

తను వెళ్ళిపోయినా పుల్లయ్య అటువేపే చూస్తున్నాడు. అలా చాల్లబడి నా దృష్టి తనవేపే పోతోంది—కొంత సేపటికి మాగన్నుగా నిద్దరపట్టింది.

వేకువజామున తెలివివచ్చింది. నిద్దర పట్టలేదు. ఆయన మఠం వేసుకొని కూర్చొని వున్నట్లు గుర్తించాడు. ఈ దృశ్యం నీలమ్మ గుడిలో శివాలు వేస్తున్న దాసుడ్ని జ్ఞప్తికి తెచ్చింది... అలా ఆలోచిస్తుండగానే "నాయనా!" అని పిల్చాడు. పుల్లయ్య ధగరకు వెళ్ళాడు. ఆయన ముఖం స్పష్టంగా అగపడలేదుగానీ, యేదో తేజస్సు మెరుస్తున్నట్టు అనుకున్నాడు.

మీద చెయ్యివేసి నిమురుతూ ఆదరణతో—"నాయనా! ఒకనాడు నేను నాతోటి వాళ్లని అసూయతో అసహ్యంగా చూసాను. అప్పుడు నాది అనే సంపద వుండేది కాని మనిషిలా బ్రతకలేక, ఇలా జైళ్ల పాలయ్యాను. ఇప్పుడో—నాదీ అనేది యేమీ లేదు. కానీ నేను తిరిగి జనంలోకి సంతోషంగా బ్రతకడానికి వెళ్ళిపోతున్నాను. ఈ

...గాలీ నీరు వగైరా పంచభూతాలూ తమ ధర్మాన్ని పాటిస్తున్నప్పుడు వాటి కలయిక వల్ల తయారైన మనిషి తన ధర్మం పాటించకపోతే, అంతా సరి! నీ కెవరూ దగా చెయ్యలేదు అబద్ధం ఆడి, నీకు నివ్వే దగా చేసుకోబోతున్నావ్. ఆ గ్రహపాటును నవ్వుతూ ధైర్యంగా తీసుకో!"

మళ్ళీ తను తల నిమురుతూ గడ్డం పట్టుకొని: "నిజాన్ని బయటపెట్టిన అలాంటి పెళ్ళాం వుండటం నీకు గర్వం కాదా? అలాగ ధైర్యంగా దొంగల్ని అప్పచెప్పే కొడుకును కన్నావే?—నీకంటే అదృష్టవంతు డెవడున్నాడు? నాయనా... ఈ జన్మతోనే అంతా సరికాదోయ్... ఒక పుల్లతో చక్రం తయారవుతుందా? చక్రం తయారయి కదిలి గోడు చివరకు చేరేసరికి యెన్ని జన్మలో! నువ్వు ఖైదులోవుంటే వాళ్ళకి యెలా జరుగుతుందనా?... ఆ తల్లికి ఆ ధర్మమే గొడుగై కాస్తుంది—ఆమె పాపం చేసినా పాపై కంవటానికి?... ఆలోచించు"

అంటూ ఆ వ్యక్తి లేచిపోయాడు. ఇంతలో కొట్టుతలుపు తెరవబడ్డాయి. ఆయన బయటకు వెళ్ళాడు, గానీ పుల్లయ్య అలా కూర్చుండిపోయాడు. తెల్లవారిపోయింది—కొట్టు కదలివెళ్ళాడు. తిరిగి వచ్చాడు గాని, అతను చెప్పిందే మనసులో తిరుగుతోంది. అలా ఆ విషయం గురించే ఆలోచించుకుంటూ కూర్చున్నాడు. రాత్రంతా సరిగా నిద్దర లేకపోవటంవల్ల కళ్ళు యెర్రబడివున్నాయ్. కళ్ళు మూయటానికి వీలులేకండా పనిపాట్లు చెయ్యటానికి వెళ్ళవలసివుంది. ఏదో పనిచేస్తున్నా అతను చెప్పినవే జ్ఞాపకానికి వస్తున్నాయ్.

మధ్యాహ్నం మళ్ళీ కొటుకువచ్చేసరికి అతను లేడు. వస్తాడేమో, యెలాగుంటాడో సరిగా చూదామని చాలసేపు చూసాడు. కానీ యెప్పటికీ రాలేదు. చివరకు జవానుని అతని విషయం అడిగాడు. "పొద్దున్నే వదిలేసారు" అన్నాడు. పుల్లయ్య చాలా నొచ్చుకున్నాడు. ప్రొద్దున్నే సరిగ్గా చూడవలసింది.

ప్రొద్దు తిరిగిపోతున్నకొద్దీ మనసు మనసులా లేదు. ఎడతెగని ఆలోచనలు. సాయంత్రం అయింది. గాలివీస్తోంది. చెత్తాచెదారం యెగురుతోంది. ఉత్తరదిక్కున వున్న మేఘాలు చెదరసాగినయ్. రాను రాను ఆకాశం వినీలంగా అగుపిస్తోంది.

చీకటిపడింది. పుల్లయ్య గతం అంతా మళ్ళీ నెమరువేసుకుంటున్నాడు. పెళ్ళి... పెళ్ళికి ముందే తన కొడుకెలా వుండాలో వూహించుకున్నాడే ... ముచ్చటగా ముద్దుగా వున్న పాపడు-అదూ తన లాగే గిరగిరజాలు పెంచుతాడు, నలుగురిలోనూ మెప్పు తెస్తాడు-నేనికీ నడవడు...అడ్డి గరిడీలో ఘటికుడ్ని చేసి — మాటన్నాడంటే ప్రాణంపోయినా నిలబడతాడు. దొంగల్ని పట్టేదొర ... నా కొడుకు దొంగల్ని పట్టే దొర కాలేదా? అయ్యాడు అయ్యాడు... సెయ్యమూసి చెప్పినాడు కాదా? ... కోటి కొక్కడని...నా కొడుకు కోటి కొక్కడే అయినాడు కాదా? ... నాను కోరినట్టే అయినాడు—నా నాయనమల్లు—నిజాన్ని నిలిపిన కొడుకై నాడు కాదా? అయితే నాకెందుకు యింత బాధ?

ఇలా అనుకుంటుండగానే, కొడుకుతో పాటు పెళ్ళాం అగుపించినట్లయింది ఆ అమాయకమైన ముఖం ... బోనులో నిల్చొని తొణక్కుండా, బెణక్కుండా చెప్పే ఆ ముఖవర్చస్సు...ఏదో తేజస్సు చూసినట్లనిపించింది. ఆ తేజస్సుముందు తను నిల్చొలేక పోయినట్లు—తలెత్తడానికి సిగ్గుపడినట్లు అయిపోయాడే!

ఆ రాత్రి అన్నంముద్ద నోటికి వెళ్ళలేదు. కలుపుకున్నాడేగానీ పెళ్ళాం పిల్లలూ యెలాగున్నారోనని మనసు ద్రవించసాగింది. బలవంతాన ముద్ద నోటిలోనికి కుక్కుతుంటే కళ్ళంట నీరు బొటబొటా గిన్నెలోకి కారసాగింది. అలాగ లేచిపోయాడు.

ఆ రాత్రంతా ఆమె, ఆ మాటలు తనను నిద్దరపోనివ్వలేదు. లోలోన యేదో పురుగు తనను తొలిచి బాధపెడుతున్నట్లుంది. "నా పెళ్ళాం, నా కొడుకు నిజం సెప్పారు. అంచేత ఆ పెద్దోడు అంత దెబ్బ తగిలినా సచ్చిపోలేదు. నాను సెడ్డోడ్ని అయిపోనాను. జూదం నేర్చినాను; సెడ్డోడితో కూడినాను. మనిషి నే మారిపోనాను. అలాగుంటే నా పెళ్ళాం పిల్లలకి అయ్యేవోడినా? నాకు జైలే బాగున్నాది. నా పెళ్ళాంకొడుకూ నా మంచికే చేసినారు. నాను పదుగురిలాగ యిక్కడ పని నేర్చుకుంటాను. తరువాత బతికేనా?" అనుకున్నాడు.

ఆకాశంలోకి చూసాడు-ఎవరెవరో అగుపించినట్లయింది. కొంతసేపయ్యాక మళ్ళీ కొడుకే తలుపుకొచ్చాడు. వాడు పుట్టకముందు తనుపడ్డగర్వం—పుట్టాక తను యెగిరిన యెగురూ—పేరుంచావు తండ్రీ...అనుకున్నాడు. నిముష నిముషానికి ఆ కొడుకును దగ్గరకి చేరదీసుకొని తన మనసారా ముద్దులాడదామనిపించింది. చివరకు వూహలోనే కొడుకును ముద్దులాడసాగాడు. ఆ కటిక నేల నే ముద్దులాడుతుంటే కళ్ళంట నీరు జలజల రాలుతోంది. ఎంతోసేపటికి పైనుంచి జవాను:

"ఎందుకేడుస్తున్నావ్ — పడుకో! పడుకో!" అన్నాడు.

గబగబ ఇనపకమ్మీల దగ్గరకి పరుగెత్తుకొచ్చి "అదిగో ... ఆ అరుబాయకెళ్ళే తోవలో నా యిల్లు—నా నాయన్ని తెచ్చి చూపించవా? నీకు దేముడు మంచి చేసాడు!"

"గోల చెయ్యక జైలరు వచ్చాడంటే యేమవుతాది? పడుకో", అంటూ వినిపించుకోకండా వెళ్ళిపోయాడు.

పుల్లయ్య ఆ కమ్మీలు గట్టిగా పట్టుకొని బాధతో నిట్టూర్చాడు—

[ఇంకావుంది]

తొలి పొద్దున యుగాది గీతం

రంగారావ్

"సరోజా! సరోజా!" అంటూ వంటింట్లోకి పరుగెత్తుకొచ్చాడు శేషగిరి, చేతిలో పత్రికతో.

అదిరిపడి తిరిగిచూచింది వంట ప్రారంభిస్తున్న సరోజ. ఆ తిరగడంలో ఎడమచేతి వేళ్లు రెండు కుంపటికి తగిలాయి.

"అమ్మా" అంది సరోజ బాధతో వేళ్లను చూచుకుంటూ. శేషగిరి ఒక్క దూకులో సరోజ ప్రక్కకొచ్చి కూచుని, ఆమె వేళ్ళను తీసుకుని వాత్సల్యంతో ఊదసాగాడు. సరోజ కృతజ్ఞతతో అతణ్ణి చూసింది.

"అంత తొందరెందుకు సరోజా?" అన్నాడు శేషగిరి పాపాయిని ముందలిస్తున్నట్టు.

"మరి ..రాకెట్ లా దూసుకొచ్చి ప్రత్యక్షమై 'సరోజా-సరోజా' అని అరుస్తూంటే, ఏం మునిగిపోయిందోనని..."

"ఆదివారప్పూట అర్ధాంగిని అనురాగంతో పిలవడంకూడా తప్పేనా?"

"పొద్దున్న ఎనిమిదింటికి, వంటింట్లో, బొగ్గులబస్తా-నూనెజాడీల మధ్య అనురాగా లేమిటి?"

"ప్చ్.. ఏం చేస్తాం!...అనుభవించగలిగిన ఆ రసిక హృదయం వుండాలి గానీ...బొగ్గుల బస్తాయే మందారవృక్ష మైపోదా! నూనెజాడీయే రంగురంగుల కాంతిని ప్రకాశించదా!"

"మీరు ఆఫీసు డ్రామాలోని హీరోలాగా డైలాగనుకుంటారు...కదూ?" అంది సరోజ చిన్న కించుగొంటూ నవ్వుతూ...

"సరోజా! నేనొకటి చెప్పనా?"

"ఏమిటది?"

"నీవు అట్లా నవ్వుతూంటే నాకు ఎంతో ముచ్చటవేస్తుంది..."

"ఊఁ"

"నీ నవ్వు వింటుంటే నక్షత్రాలు పరిక్షిస్తూ, పూలు మాట్లాడుకుంటున్నట్లా వుంటుంది.."

"అబ్బా...! ఊ..."

అంతర్వాత... ఏమో...నా హృదయం, వలలో పడ్డ చేపలా గిలగిలలాడి-జావ అయిపోతుంది."

"పాపం!...ఆ హృదయ నిర్మాణంలో కాస్త సిమెంటుపాళ్ళు తగ్గినట్టుంది..." అని సరోజ నవ్వాపుకోలేక అంటుంటే... శేషగిరి అమె జడనుపట్టి లాగాడు...

'అయితే ఇవాళ మనకు హోటలుభోజన మన్నమాట!" అంది సరోజ.

"ఏం? కోంపదీసి..."

"ఛీ.. అదేమీ కాదు కానీ—పొద్దున్నే భర్తగారు వంటింటోకొచ్చి కూచుని అల్లరి చేసే.."

"అల్లరిపిల్లల చెరవుగా గిల్లికజ్జాలాడవుగా" అన్నాడు శేషగిరి సినిమాలో పాట గుర్తుకురాగా...

సరోజ, కుంపటిమీద గిన్నెలోని నీరంతా ఆవిరయిపోవడం చూచి.. మళ్ళీ నీళ్ళు పోసింది. కత్తిపీటా, కూరలబుట్టా తీసుకుంది. శేషగిరి కన్నార్పకుండా ఆమె ప్రతి కదలికలోనూ ఒక కావ్యం చదువుతున్నాడు.

"ఇంతకూ శ్రీవారు ఇటు ప్రత్యక్షం కావడానికి కారణమేమిటో సెలవిచ్చారు కారు."

"అసలావూసే మరిచిపోయాను. ఏదీ... నీళ్లు కాలడం...నీవు నవ్వడం..."

"—మీరు నా జడపట్టి లాగడం ... కుంపటిమీద నీళ్ళు ఆవిరయిపోవడం..." అని అందిచ్చింది సరోజ.

"ఇత్యాదుల్లో పడి మరిచిపోయ్యాను ఇటొచ్చి నా ప్రక్క కూర్చో చెబుతా..."

"కుంపటి ఆర్పేసిరానా?"

"ఎందుకూ?"

"అనవసరంగా నీళ్ళు ఆవిరయి అయిపోవడం, నిప్పులు బూడిదయిపోవడం ......"

"ఆ ... ఏమీ ఫరవాలేదు లెద్దూ .. ఇలారా!" సరోజవచ్చి పద్మాసనం వేసుకూర్చుంది.

శేషగిరి సీరియస్ గా ప్రారంభించాడు.

"ఇది మనకు జీవన్మరణసమస్య.. కాకాపోరుల సంతతి కంతటికీ సంబంధించినసమస్య .. అనాదినుండీ తీరని సమస్య ... అమావాస్యలాంటి సమస్య..."

"భర్తగారూ! ఈ చిత్రమైన ఉపోద్ఘాతమెందుకూ చేయిండబ్బా!"

"ష్! ప్రవాహానికి ఎదురీదకు ... మనం నేను చేయబోయేనిర్ణయం నిన్నూ, నన్నూ, మనల్నందరినీ - మనతరువాత మన పాపాయిలనూ, వారి పాపాయిలనూ, వాపపాయిలనూ,.. అలాఅలా భవిష్యత్ భావి సంతతినీ మార్చివేస్తుంది. ప్రజలందరినీ ద్వికాయులుగా, ఆరోగ్యవంతులుగాచేసి దేశాన్ని ప్రగతిపథంలో నడిపించగల బ్రహ్మాండమయిన పథకం..."

"అబ్బా, చాలపెద్దదే ఈ పథకం! అయితే ఇది వెనకవున్న మన తాతయ్య వగైరాలను ముట్టుకోదన్నమాట.."

"సరోజా ..అడురావు ."

"అసలీ వూకదంపుడు మానేసి విషయమేమిటో తేల్చండి. లేకపోతే లేచిపోతా ....."

"లేవడానికొద్దు కదా.. ఊపిరాడ్డా కూడా వీలులేదు...ఏం?"

"సరే..."

"ఇహ విను...నేనడగబోయే ప్రశ్నలకు జవాబులు తకీమని చెప్పాలి ... 'అవును' - 'కాదు' అని సమాధానం ఇచ్చెయ్యాలి, అంతే! నానుడూ పీంగుడూ, కూడదు."

"సరే"

"రోజూ నీవు బియ్యాన్ని బాగా నీళ్లలో కడుగుతావు కదూ మొదట?"

"అవును."

"అన్నం వుడికినతర్వాత గంజిని క్రింద పారబోస్తావు కదూ?"

"అవును."

"కాయగూరలన్నిటిని తరిగేటప్పుడు పైనవున్న తొక్కంతా తీసి పారేస్తావు కదూ?"

"అవును..."

"వాటిని బోలెడునీళ్లలోపదేసి ఏ వంద డిగ్రీల సెంటిగ్రేడు కాగో వుడికిస్తావు

కదూ . ?"

"అవును"

"ఆ వుడికిన కూరముక్కల్ని వడబోసి ఆనీళ్లన్నీ క్రింద వంపేస్తావు కదూ?"

"అవును"

—"చూచావా? మనం ఎంత మూర్ఖులమో" అన్నాడు శేషగిరి నిట్టూర్పుతో.

"ఆ బహువచనంలోకి నేను రాను."

"మరి నీ వచనం అలాగుంది"

"అంటే?"

"అంటే బియ్యాన్ని నీళ్ళల్లో తోమి తోమి పొట్టంతా - కడిగి, ఉడికించి, గంజి పారబోసి .. ఆ మిగిలిన అన్నం మనం తింటున్నాం."

"'మిగిలిన' అన్నమేమిటీ మీ చాదస్తం."

"చాదస్తం కాదు సరోజా, అజ్ఞానం! బంగారంలాంటి విటమిను 'బి'ని పోగొట్టుకుంటున్నాం.. "

"పోనీ రేపట్నుంచీ ఆ బియ్యం కడిగిన నీళ్ళూ, ఆ గంజీ, అట్టేపెట్టుకుని అన్నం పారేద్దాం.. "

"అల్లరి మానేయ్.. ఏం.. తర్వాతా... కూరలమీది తొక్కలో విటమిను 'సి' వుంది—కూరల్ని వుడికించడంతో వాటిలోని లవణాలు ధ్వంసమయిపోతున్నాయి."

"ఊఁ ."

"విటమిన్లూ, లవణాలూ పిండేసిన తర్వాత దమ్మిడీకి కొరగాని పిప్పి మిగుల్తోంటే దాన్ని తింటున్నాం మనం..."

"ఓహో.. !"

"అంచేత రేపట్నుంచీ..."

"ఊఁ..."

"బియ్యాన్ని కడగకూడదు.. బియ్యం వుడకడానికి సరిపోయేంత నీళ్ళే పోయాలి. గంజి వార్చడమన్న వూసే రాకూడదు..."

"తర్వాత ."

"కాయకూరలు సాధ్యమయినంతవరకూ పచ్చివే తినడానికి ప్రయత్నించాలి"

"రామ రామ!"

"తొక్క తీయకుండా తినగల్గితే మరీ శ్రేష్ఠం!"

"హాఁ..." అంది సరోజ...జీవితం



★ శ్రుతితప్పిన యుగళగీతం ★

మీద ఆశ వదులుకొన్నట్టు.

"అత్యవసర పరిస్థితుల్లో కొన్ని కూరలు తప్పిస్తే... మిగతావి వుడికించకూడదు."

"భగవంతుడు రక్షించుగాక!. మరి . ఈ జ్ఞానం ఇంత హఠాత్తుగా వుదయించడానికి కారణం?"

ఇవాళ పొద్దున్న పత్రికలో ఆ వ్యాసం చదివేదాకా మనం ఎంత వెర్రిపీనుగులమో తెలిసిందికాదు ఇహనయినా ఆ "వెర్రిని" వదిలించుకుని—"

"—ఉత్త "పీనుగు"ల మవుతామన్న మాట!" అంది సరోజ లేస్తూ

"పంజాబ్లలోనూ అక్కడా—వాళ్ళసలు కూరల్ని వుడికించకుండానే తింటారట ఇంగ్లీషువాళ్ళూ చాలమట్టుకు అంతేనట అందుకనే వాళ్ళు బలంగా, దక్కటి అవయవపుష్టితో వుంటారు, " అని శేషగిరి అంటుంటే సరోజ కోప వూపిరితో వున్న నిప్పుల్ని విసరసాగింది

"రేపట్నుంచీ మన ఇంట్లో ప్రొతిపదిత భోజనం—" అని ప్రకటిస్తూ శేషగిరి లేచాడు.

* * *

సాయంకాలం . కాఫీ టిఫిన్ల అధ్యాయం ముగిసింది.. శేషగిరి ఏవో వుత్తరాలు రాసుకుంటున్నాడు సరోజ వచ్చి టేబిల్ మీద కూచుంది "

"ఏమండోయ్!"

"ఏమిటి?" అంటూ పెన్నూ కాగితాలూ తీసి డ్రాయరులో పడేశాడు శేషగిరి.

"మనం కొత్తబట్టలు కొనుక్కుందాం— అన్నారు.. ?"

"అవును. "

"ఎప్పుడూ?"

"ఎప్పుడయినాసరే . "

"ఓ చిన్న కోరిక!"

"మంజూరు చేసినట్టే—"

"పొద్దున్న చాకలాడు తెచ్చిన బట్టల్ని మీ పెట్టెలో పెడుతూ, మీ బట్టలన్నిటినీ తీసి చూశాను "

"అందులో తప్పేమీ లేదే?"

"అబ్బబ్బ! అడ్డురాకుండా చెప్పేది వినండీ—"

"అలాగే!" అన్నాడు శేషగిరి ఈజీ చేరులో చేరగిలబడి కాళ్ళు చాచుకుంటూ

"మీ అన్ని దుస్తుల్లోనూ-ఒక్కటయినా సరిగా లేదంటే నమ్మండి "

"అంటే?"

"అంటే-ఒక్కటయినా కంటికింపుగా లేదూ అని. రంగు బాగుంటే పట్టుదం బాగులేదు కత్తిరింపు బావుంటే గుడ్డరంగు వెలిసిపోయివుంది "

"ఆ గోధుమరంగు సూటూ?"

"అది ఒక్కటి కాస్త ఫరవాలేదనుకోండి . అయినా రోజూ వేసుకు నేబట్టలు ఒక్కటికూడా సహించగలిగినట్లు లేదు..."

"అబ్బా "

"మరి—మీరు రోజూ—వాటి నెలా వేసుకుంటున్నారో ఏమిటో—"

"ఏం?"

"అంత ఘోరంగా వున్నాయి మరి మీ ఆఫీసులో ఎవ్వరూ ఏమీ అనరూ?"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? పంధొమ్మిది వందల నలభై నాటి కోట్లూ, ఇరవై నాటి చొక్కాలూ, ఛండాలమయిన రంగులూ . "

"సరోజా! ఆగు ఆగు . "

"ఆగడంకాదు. నా మాట వినండి..."

"ఆ పనే చేస్తున్నానుగా!"

"ఏం? ఇంచుమించు నా చీరలన్నీ మీరు కొన్నవే. "

"ఒప్పుకుంటాను.. " అన్నాడు శేషగిరి గర్వంతో, లేచి కూచుంటూ.

"అందుకనే మచ్చుకు ఒక్కటయినా మంచిది లేదు."

"హతోస్మి!" కూచున్న శేషగిరి వెనక్కు వాలిపోయాడు.

"బార్డరు బాగుంటే పంట మహా అన్యాయంగా వుంది రంగు బాగుంటే మా అమ్మమ్మ కాలపు బార్డరుతో వుంది "

"మరి మీ నాన్నగారు కొనిపెట్టిన చీరలో?"

"అన్నీనూ! ఆఖరుకు మన కిటికీ కర్టెన్లూ, టేబుల్ క్లాతూ, దిండు గలేబులూ కూడా ఈ నాటి తరహాలో—ఉండవలసిన రీతిలో లేవు" అని సమీక్షించింది సరోజ

"ఊం ?" అన్నాడు శేషగిరి బలహీనంగా.

"అందుచేత మీకు నాకూ ఒక్కసెటు బట్టలూ, కర్టెన్లూ వగైరా కొనేద్దాం ."

"డబ్బో?"

మొన్నటి పండుగ బోనసుందిగా... దాంతో చెరి నాలుగు కంటికింపయిన దుస్తులూ కొనుక్కుందాం "

"అలాగే చేద్దాం . "

"అక్కడే వస్తుంది నా కోరిక. ఇన్నాళ్ళూ బట్టలూ అవీ మీరు తెస్తూంటే 'సరే సరే' అని వూరుకున్నాను. అంచేత ఆఖరుకు పరిస్థితి ఇంత అధ్వాన్నంగా తయారయింది "

"అన్యాయం అన్యాయం!" అని శేషగిరి ప్రతిఘటించాడు

"మీరు ఇంకో రెండు నిముషాలూరుకోండి ఆ తర్వాత మాట్లాడవచ్చు . "

"ఆ తర్వాత మాట దాని కేముంటుంది?"

"మొదట వినండి ఇవాళో రేపో నేనే బజారుకెళ్ళి చక్కగా మన ఇద్దరికీ కావలసినబట్టలు పట్టుకొస్తా!"

"నీవు తేగలవా ?"

"ఎందుకు తేలేను ?-ప్రక్కింటి కాంత ఎప్పుడూ తనే తెచ్చుకుంటుంది."

"కాంత మొగుడికి బట్టలకొట్టులో ఎప్పుడూ మూడువందల అప్పుంటుంది తెలుసా ?"

"నే నలా చేస్తానని భయపడకండి. ఉన్నడబ్బులో పట్టుకొస్తా.. "

"ఉన్నట్టుండి ఇలా "

"తెలివి రావడానికి సమయ మేమిటి ? మధ్యాహ్నం పడుకుని ఆ పత్రికలో ఆ రంగులూ ఆ కొత్త కొత్త కత్తిరింపులూ చూస్తుంటే తెలిసింది—మనం ఎంత వెనకపడి వున్నామో ?"

"ఇహా, ముందుపడతామన్నమాట !"

"ఖచ్చితంగానూ!" అని సరోజ అంటుంటే శేషగిరి "వందరూపాయలూ ; సెలవు" అనుకున్నాడు మనసులో.

* * *

మరుసటిరోజు పొద్దున్న—

"ఆఫీసుకు టయిమయినట్లుంది భోజనానికి లేవరూ?"

"అప్పుడే వంటయిందీ?"

"ఇవాళ అరఘంటలో అయిపోయింది వంట"

"ఓహో. కొత్తపద్ధతికదూ భేష్"

భోజనానికి కూచున్నాడు శేషగిరి వడ్డించ నారంభించింది సరోజ

"వాల్యూ వేశావేం? ఇవాళ ఏవయినా పండగేంటి?" అన్నాడు శేషగిరి కంచంలో పొగలు కక్కుతున్న గోధుమరంగు ముద్దను చూసి

అబ్బే. అది అన్నమే బియ్యం కడక్కుండా, గంజి వార్చకుండా వండాను."

"మరిలా తయారయిందేం?"

"ఈ బియ్యంలో 'బి' విటమిను ఎక్కువ కాబోలు" అంది సరోజ

"మొదటి ప్రయత్నం కదూ... అలాగే వుంటుంది"

సరోజ కూరను వడ్డించింది. అన్నమూ కూరాకలిపి మొదటిముద్ద నోట్లో పెట్టుకున్నాడు శేషగిరి మొహం మారిపోయింది ఆముద్ద కాస్తా బయటికొచ్చింది

"ఇదేంకూరా?" అని అడిగాడు శేషగిరి కళ్ళల్లో నీళ్లుతిరుగుతుండగా

"కాకరకాయ"

"ఇలావుందేం?"

"ముక్కల్ని వుడికించలేదు ఇంత ఉల్లిపాయముక్కలుకలిపి, పోపు వేసి పెటాను"

"ఓహో! మనకీ పచ్చికూరలు నెమ్మదిగా అలవాటు కావాలి."

"అవును అందుకనే లవణాలూ అవి పోకుండా"

"థీక్ హై ఏదీ అపులునిలా రానీ!" పులుసును రానిచ్చింది సరోజ.

"పులుసులో ఈ బంతు లేవిటీ?"

"వంకాయలు! తరిగితే 'సి' విటమిను ఏమయిపోతుందోనని"

—మజిగఅన్నం తినిలేచాడు శేషగిరి

* * *

ఆరోజు సాయంకాలం ఆఫీసు నుండి వచ్చాడు శేషగిరి కాఫీ ఇచ్చింది సరోజ.

కాస్సేపాగి "నేనూ, కాంతా, ఇందాక బజారువెళ్ళి వచ్చాం" అంది సరోజ

"ఎందుకూ?" అన్నాడు శేషగిరి

"ఎందుకేవిటీ? నిన్న చెప్పానుగా"

"ఓహ్హో అదా? అయితే బట్టలు కొనుక్కొచ్చావన్నమాట—"

"మరీ—" అంది సరోజ లోపలినుంచి నాలుగయిదు పేకెట్లుపట్టుకొనూ. వాటిని శేషగిరిముందు పడేసింది ఒకొక్కటే విప్పి శేషగిరిచే కివ్వసాగింది

"ఇది బహుశా 'నార్ కట్టన్'—కాబోలు" అన్నాడు శేషగిరి ఆ బట్టను విప్పి చూస్తూ

"ఛంపేశారు! అది కొత్త ఫాషన్‌లో వెడల్పు బార్డరు రేయన్ చీర!"

"ఈ పరుపుగుడ్డ మాత్రం అద్భుతంగా వుంది! నన్ను నిలువునా కోసినా ఇలాంటిది తేలేను" అని ఒప్పుకున్నాడు శేషగిరి

"అదిపరుపుగుడ్డకాదు మీకు చొక్కాలకని పట్టుకొచ్చాను" అంది సరోజ ముక్తసరిగా

"అయినా దుప్పట్లు ఇంత చిన్న గళ్ళవి తెచ్చావేం"?

"అంత వ్యంగ్యం అక్కరేదు. అది మీ ప్యంట్లానికని తెలియదు కాబోలు"

"ఊ ఇంకా చూపించు. ఏదీ అ! ఈ టేబిల్ క్లాత్ దివ్యంగా వుంది"

"అది వోలీ గుడ్డ!" అంది సరోజ కఠినంగా

అయిదు నిముషాలు నిశ్శబ్దం. సరోజ కళ్ళలో సందేహం శేషగిరి కళ్ళలో విషాదం

"మొత్తం ఎంత ఖర్చయింది?" అన్నాడు శేషగిరి

"ఎనభై నాలుగు రూపాయలు!"

"పోతే పోనీలే—బోనసు డబ్బేగా—"

"అంటే?" అంది—అభిమానంతో సరోజ

"నీవు తెచ్చిన చీర ఒక్క వుతుకు తరువాత పోగులు చేతికి రాక తప్పదు"

"మీ షర్టింగో?"

"అది తొడుక్కుంటే—నేను ఆడో, మగో, నాకే తెలీదు"

"మీ పేంటు గుడ్డ బావులేదూ?"

"పేంట్లకి అంత పల్చటి గుడ్డ పనికిరాదు"

"మరి నావోలీ గుడ్డకూడా అంతే నంటారా?"

"అవోలీ తొడుక్కుంటే నీ వీపు టేబిల్‌లా వుంటుంది కానీ,."

"చాలు చాలు." సరోజ కంఠం రుద్ధమయింది

* * *

ఆ రాత్రి చాలసేపయింది.

ఇద్దరూ పడకలమీద పొర్లుతున్నారు నిద్రరావడంలేదు.

"సరోజా!"

"ఏమండీ?"


"రేపట్నుండీ నీవు వంట ఎప్పటిలాగే చెయ్యి"

"ఊ మరీ మరి"

"ఏమిటి?"

"ఇహముందు బట్టలూ అవీ మీరే కొనుక్కురండీ"

"అలాగే!" ★



వ్యవసాయశాఖోద్యోగుల వన!

నక్షత్ర ఫలితాలు

[23-7-58 మొదలు 29 7-58 వరకు]

బి. నరసింగరావు

గ్రహస్థితి

	శు కే		కు
	కన్య, తుల, వృశ్చిక, ధనస్సు లలో చంద్రుడు		ర
			బు
	శ	గురా	

అశ్విని [చూ చే చో లా]

ఈ వారము మీరు తలపెట్టిన పనులలో ఫలప్రాప్తిని పొందుతారు అనుకున్న దానికన్నా ఎక్కువగా ధనలాభమును పొందుతారు సంఘసంక్షేమ కార్యాలు చేసి కీర్తి పొందుతారు కొత్త ప్రయత్నాలు చేస్తారు పుణ్యకార్యాలలో పాల్గొంటారు ఉద్యోగస్థులకు మేలుగా వుంటుంది విద్యార్థులకు మంచికాలము విలువగల వస్తువుల క్రయవిక్రయములలో వర్తకులకు ద్విగుణలాభము కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము 23, 26, 27 తేదీలలో మానసికాందోళన చిక్కు సమస్యలలో తీరికలేని కార్యక్రమము ఖర్చులు ఎక్కువ

* భరణి [లీ లూ, లే లో] *

ఈవారము కార్యభారం ఎక్కువ రాజవార్తాప్రసంగములు, వింతమాటలు వినుట, పరాక్రమమువల్ల ఘనత ధనలాభము, ప్రయాణము వుండును అకాలభోజనమువల్ల వేడిచేసి, కడుపునొప్పి, నేత్రపీడ, బలహీనత వంటి సూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందడమే కాకుండా రవిశాంతి చేయుటవల్ల మేలు ఉద్యోగస్థులకు బదిలీ యగుటగాని అధికారుల ఒత్తిడికి తట్టుకోలేక శలవు పెట్టుటగాని జరుగును విద్యార్థులకు జయము తక్కువ 23 వృథా ప్రయత్నములు 24 25 యత్న కార్యభారము 26 27 అనారోగ్యము చాంచల్యము బదిలీ 28,29 ప్రయాణము, ధనలాభము కార్యసిద్ధి

* కృత్తిక [అ ఈ ఉ ఏ] *

ఈ వారము ప్రతిపనికి అనవసరముగా ఆలస్యము జరుగుతుంది ఏపని చేసేందుకు సమాధానము దొరకక చికాకు పడతారు, ఆశాభంగము ఎక్కువ వర్తకులకు లాభము తక్కువ రహస్యములు కనిపెట్టుటలో నిపుణులగుటవల్ల ప్రభుత్వముచే ఆపనికి నియోగింపబడుతారు ఉద్యోగస్థులకు శిక్షకొరకూ వన పర్వత ప్రాంతములకు బదిలీ అవుతుంది అన్యదేశీయులతో పరిచయము కార్యసాధన అవుతవి 26 27 ఆత్మీయుల అనారోగ్యముచే వ్యథ, చాంచల్యము, బదిలీ 28 29 అనుకోని మిత్రసహాయము, కార్యలాభము

* రోహిణి [ఓ వా వీ, వూ] *

ఈ వారము మీరు ఎవరి సహాయమునుకోరి కార్యములు చేసుకొందా మనుకున్నారో ఆ వ్యక్తి వలనే మీకు ఆటంకములు కలుగుతవి ధనాభావము ఎక్కువగా వుంటుంది ఆధ్యాత్మిక చింత గలవారగుటవల్ల ఈశ్వర కృపచే అన్ని కష్టములను గడిచి క్రమేణా కార్యసిద్ధి పొందుతారు ఇంట్లో వారి ఆరోగ్యము ఆందోళన కలుగజేస్తుంది ఉద్యోగస్థులకు ఒత్తిడి వ్యాపారస్థులకు ఆశాభంగము విద్యార్థులకు మాంద్యము 24 25 నష్ట ద్రవ్యలాభము 26, 27 ఆరోగ్యచింత, ఆటంకములు, ఒత్తిడి

* మృగశిర [వే వో, కా, కీ] *

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ ఎక్కువ శ్రమపడినగాని యత్న కార్యములు ఫలించవు పరోపకారమునకు పూనుకొని పనుల ఒత్తిడివల్ల చేయలేక నిందలు పొందుతారు ఇచ్చి పుచ్చుకొనేపట వివాదములు ఉద్యోగస్థులకు అధికారుల అనాదరణతోటి వారి సహకారముతో సర్దుబాటుగా వుంటుంది వర్తకులకు వారమంతా నిరాశగావున్నా వారాంతమునకు మేలుగా వుంటుంది విద్యార్థులకు బద్ధకము 26, 27 అధికారుల ఒత్తిడి, వివాదములు, నిందలు, భార్యకు ఆరోగ్య భంగముచే ఆందోళన 28 29 తోటి వారి సహకారము యత్న కార్యలాభము

* ఆరుద్ర [కూ ఖ, జ, ఛ] *

మీ ఆలోచనలు కార్యరూపము నకు వచ్చేందుకు ఎన్ని ఆటంకాలు కలిగినా, నిరుత్సాహపడక పట్టుదలతో ప్రయత్నించి తుదకు కార్యసాఫల్యమును పొందుతారు ఖర్చులకు అవసరపడిన సొమ్ము సమయానికి అందనందున ఋణము చేయవలసివస్తుంది కాని వారాంతమునకు తీరుస్తారు అవయవములకు దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును రసాయనికశాస్త్రజ్ఞులకు, లోహపు సామానులు రంగుల వ్యాపారసులకు గనుల యజమానులకు కష్టముతో కూడిన లాభము ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు, యంత్రములు నడుపు నిపుణులకు మేలు కాలము 26 27 ఆరోగ్యచింత ప్రమాదసూచన

* పునర్వసు [కే కో హ హి] *

ఈ వారము మీకు యోగకాలము మీ బుద్ధిబలముతోడు అధికారుల సహాయము బంధుసహాయము కలుగుటవల్ల వచ్చే ఆటంకములు గడిచి ఫలము పొందుతారు ధనాదాయము వృద్ధి అవుతుంది వైద్య, జ్యోతిష శాస్త్ర ప్రసంగాలలో పాల్గొంటారు కవులు నూతనరచన చేస్తారు ఈశాన్యదిక్కునుండి శుభవార్త తెలిసి సంతోషము పొందుతారు విద్యార్థులకు ఉత్సాహముగా వుంటుంది 24 25 ధనాదాయము, బంధుసహాయము, పండితగోష్ఠి, కుశలవార్త 26 27 అధిక ఖర్చులు త్రిప్పట 28, 29 కార్యసిద్ధి పులకు చిత్రకారులకు, నటీ టులకు మేలు కాలము

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము మీకు యోగము ఎక్కువ ఉన్న ఇబ్బందులు తీరుతవి అనుకున్న సొమ్ము చేతికివస్తుంది దావాలలో గెలుపు కలుగుతుంది పురుష సంతానం సుఖయోగములకై కొన్ని ఏర్పాట్లు చేస్తారు పండితులతో శాస్త్ర ప్రసంగములు చేయుటచే విజ్ఞానము వృద్ధి పొందుతుంది ఉద్యోగస్థులకు అధికారము పెరుగుతుంది వర్తకులకు లాభయోగము, ఉపాధ్యాయులకు, పండితులకు న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు యోగకాలము విద్యార్థులు కొత్తసంగతులు నేర్చుకుంటారు 24, 25 ధనయోగము 28, 29 శాస్త్రచర్చ, భాగ్యవృద్ధి

* ఆశ్లేష [డీ, డూ, డే, డో] *

ఈ వారము మీకు యోగదాయక మయినను మానసికాందోళన వుంటుంది ధనయోగము వుంటుంది కవితాగోష్ఠి, సంగీత సభలవంటి వినోదాలలో బంధు మిత్రులతో

★ నక్షత్రఫలితాలు ★

కలిసి పాల్గొంటారు ఇంతవరకూ అనారోగ్యముగా వున్న ఆప్తులు కోలుకొంటున్న వార్త తెలియుటచే సంతోషము పొందుతారు ప్రత్తి, దూది, నూలు, బట్టలు, బియ్యం వెండి వగైరా వ్యాపారస్థులకు లాభయోగము 24, 25 కార్యసిద్ధి, నీటిపై ప్రయాణము 26, 27 మానసిక ఆందోళన 28, 29 ధనయోగము విందు, వినోదము, కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలం

* మఖ [మా, మీ, మూ, మే] *

గతవారము పూర్తికాకుండా వుండిపోయిన కార్యములు ఈ వారము లాభకరముగా పూర్తి అవుతవి ధనయోగము అనుకున్న దానికన్నా అధికముగా వృద్ధి అవుతుంది శుభకార్యాలోచనలు చేస్తారు సాంఘీక సేవచేసి కీర్తి పొందుతారు ఉద్యోగస్థులకు అధికార హోదాలు పెరుగుతవి వాహనయోగము కలుగుతుంది విలువగల వస్తువుల క్రయ విక్రయాలలో వర్తకులకు ద్విగుణముగా లాభిస్తుంది 24, 25 ధనయోగము, పరోపకారము, కీర్తి 28, 29 శుభకార్యాలోచన, స్త్రీలతోనూ, ఆప్తులతోనూ, విందు, వినోదము కవులకూ, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
మో, టా, టీ, టూ

ఈ వారము యత్నకార్యములకు ఆటంకములు కలుగుతవి కార్యభారమువల్ల తీరుబడి వుండదు ఆర్థిక స్థితి సంతృప్తికరముగా వుండనందున గృహావసరములు తీరక యిబ్బంది కలుగుతుంది అకాలభోజనమువల్ల అనారోగ్య చిహ్నాలు కనబడగానే చికిత్స చేయించికొనుటవల్ల మేలు కలుగుతుంది ఉద్యోగస్థులకు ఒత్తిడివున్నా అధికారుల ఆదరణకూడా లభిస్తుంది వర్తకులకు శ్రమ ఎక్కువ విద్యార్థులకు శ్రద్ధ తక్కువ రాజకీయవాదులకు మేలుగా వుంటుంది 23 24 కార్యభారము, త్రిప్పట, ఆటంకములు 26 27 అనారోగ్యము 28, 29 ధనయోగము, కార్యలాభము

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
[టే, టో, పా పీ]

ఈ వారము మీకు మిశ్రమయోగము మొదటలో నిరాశగావుంటుందిగాని క్రమేణా మిత్రసహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన ఉద్యోగస్థులకు మంచిరోజులుకావు అధికారుల ఆగ్రహమునకు లోనై బదిలీఅవవచ్చును ప్రయాణము చేయవలసివసుంది ప్రభుత్వము నె రహస్యములు కనుగొనుటకు నియమితులవుతారు 23 నిరాశ, మనోవ్యధ 26, 27 గృహకలతలు, బదిలీ ఆప్త అనారోగ్యము, ప్రయాణము 28 29 మిత్రసహాయము, కార్యలాభము, విదేశీయుల పరిచయము, విచిత్ర వస్తుసంపాదన

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము తలపెట్టిన పుణ్యకార్యచింత సానుకూలము కావచ్చును తీర్థయాత్రలలో చిత్ర విచిత్రవస్తువును చూస్తారు దైవభక్తికలిగి వ్యవహరించుటచేతను నష్టద్రవ్యలాభము పొందుతారు అమితముగా తినుటవల్ల ఆరోగ్యము చెడుతుంది సాధుసాంగత్యమువల్ల ఆధ్యాత్మిక చింతచే మనోవికాసము కలుగుతుంది ఉద్యోగస్థులు కొంత శ్రమపడినమీదట మేలుపొందుతారు వర్తకులకు నిరాశగావున్నా పాత బాకీలు వసూలవుతాయి 23, చాంచల్యము, ప్రయాణము 24 25 నష్టద్రవ్యలాభము 26, 27 అనారోగ్యము

చిత్త [పే, పో, రా, రీ]

స్థిరాసికి సంబంధించిన మీరు చాలా జాగ్రత్తగా వుండాలి శ్రమ, ఖర్చులు ఎక్కువ ప్రయోజనము తక్కువ అంతే కాకుండా కొన్ని చిక్కు వ్యవహారాలు కొత్తగా తలెత్తవచ్చు ఉపయోగములేని ప్రయాణాలు చేయవలసివస్తుంది భార్య ఆరోగ్యం విషయమై కొంత జాగ్రత్తగా వుండాలి ఉద్యోగస్థులు శెలవు పెట్టవలసివసుంది కొర్రలు సజలు, రాగులువంటి అపరదినుసులు, ఉప్పు, మినుములు, నువ్వులు, నూనె వ్యాపారస్థులకు లాభము మొత్తముమీద వారమంతా ఒడిదుడుకులుగా వుంటుంది 26 27 బదిలీ, లేక శెలవు పెట్టుట, భార్య అనారోగ్యము

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము మీకు పైకికన బడేటంత యోగదాయకముకాదు బంధువుల రాకపోకలు ఎక్కువగుటచే డబ్బు బరువు ఒకవేపు ఎక్కువవుతుంది ప్రతిపనికి ఆటంకాలు ఏర్పడుతవి కాని పట్టుదలతో ప్రయత్నించి తుదకు జయము పొందుతారు ఉద్యోగస్థులకు అధికారులపోటు మాటలచే మనోవ్యథ కలుగుతుంది శరీరముపై కురుపులు లేస్తాయి అగ్నివల్లగాని, యంత్రములవల్లగాని ప్రమాదము జరుగవచ్చును స్థిరాస్తి లేవాదేవాలలో పేచీలుఏర్పడుతవి రసాయనిక శాస్త్రజ్ఞులకు, ఇంజనీరింగు, పోలీసు శాఖలలోవారికి, గనుల యజమానులకు శ్రమతో కూడిన లాభయోగము 26, 27 అనారోగ్యము, ప్రమాదసూచన 28 29 యత్నకార్యసిద్ధి, ధనయోగము

* విశాఖ [తీ తూ, తే, తో]*

ఈవారము మాటపలుకుబడితో అనేకమందిని కూడగట్టుకొని కార్యలాభము సాధించగల కాలము డబ్బు యిబ్బంది, సర్దుబాటుకూ వుండే అడ్డంకులు తీరిపోతవి అధికారం హోదా పెరుగుతవి పెద్దస్థితిలో వుండే వారి స్నేహ బలం లభిస్తుంది మంచి ఉత్తరములు వస్తవి డాక్టరకు, గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము 24 25 కార్యానుకూలత, ధన యోగము 26, 27 అధిక ఖర్చులు, బద్ధకము, 28, 29 జ్యోతిష విద్యాభిలాషి కవులు నూతన రచనలు ప్రారంభిస్తారు విద్యార్థులకు అనుకూలము

అనూరాధ [నా, నీ, నూ, నే]

ఈ వారము మీకు చాలా అనుకూలమైన కాలము అప్రయత్నముగా పెద్ద మొత్తములుగా డబ్బు చేతిలోకి వస్తుంది అదృష్టబలం ఎటువంటిదో అనుభవమువల్ల తెలుస్తుంది.

—ధరలు—

నూలు, వస్త్రములు: మందముగా వుండును

నూనె దినుసులు: నిలబాటుగా వుండును

బెల్లము, పంచదార, చింతపండు: మార్పులేదు

ఆహార ధాన్యములు: మందమగును

పప్పుదినుసులు: నిలబాటుగా వుండును

వెండి, బంగారము: క్రమముగా మందమగును

అడ్డుటచ్చుట సాధారణముగా వరించును కొన్నితావులలో సస్యహాని కలుగును

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము తెలియనివారు నామనక్షత్రము (వారి వారి పేర ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనువది కృష్ణుడను పేరునకు మృగశిరయు వృషుడను పేరునకు స్వాతియు శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది

తలపెట్టిన పనులు సాధనసంపత్తి తగినంత వున్నా లేకపోయినా సాధించగలుగుతారు. ఉద్యోగస్తులకు గౌరవ ప్రతిష్ఠలు, పలుకుబడి పెరుగుతవి. పండిత గోష్ఠివల్ల, ఉత్తమ గ్రంథ పఠనమువల్ల విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. పుత్ర ప్రయోజకత్వము. సంతోషము కలిగిస్తుంది. విద్యార్థులు ఆసక్తితో నూతన విషయాలు నేర్చుకుంటారు. 24, 25 ధనాదాయము, కార్యసాధన. 26, 27 అనుకోని అనారోగ్యము. 28, 29 పండితగోష్ఠి, గౌరవ ప్రతిష్ఠల వృద్ధి.

జ్యేష్ఠ [నో, యా, యి, యు]

ఈ వారము మీ ప్రయత్నములు లాభిస్తాయి. ఆర్థిక స్థితి బాగుంటుంది. బంధు మిత్రులతో కలిసి కవితాగోష్ఠి, సంగీతసభలు వంటి వినోదాలలో పాల్గొంటారు. దక్షిణ దిక్కునుంచి మంచి ఉత్తరములు వస్తవి. నీటిపై ప్రయాణము చేయవలసి వస్తుంది. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, పంచదార, బెల్లము, బియ్యము, వెండి వ్యాపారస్థులకు లాభయోగము. విద్యార్థులకు మేలుకాలము. కవులకు, గాయకులకు, కళాకారులకూ యోగకాలము. 23 మానసికాందోళన. 24, 25 ధనలాభము, కార్యసాధన. 26 27 ప్రయాణము, చాంచల్యము. 28, 29 శుభ కార్యాలోచన, విందు, వినోదము.

* మూల [యే, యో, బా, బీ] *

ఈ వారము చాలా అనుకూలముగా వుంటుంది. ప్రారంభించిన ప్రతి పనిలో నూ విజయము లభించే అవకాశాలు కనబడుతవి. మాటపలుకుబడివల్ల అనేకమందికి ఉపకారము చేస్తారు. మీరు అనుకోకుండా అదృష్టము, ఐశ్వర్యము పట్టే అవకాశాలువున్నవి. స్త్రీలకు అలంకార ప్రాప్తి. బంగారము, వజ్రములవంటి ఖరీదైన వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు ద్విగుణ లాభము. దావాలలో గెలుపు కలుగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీ నటులకు యోగకాలము. విద్యార్థులకు ఉత్సాహముగా చదువు సాగుతుంది.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢా]

ఈ వారము మీరు ఆదాయాభివృద్ధికి చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. కార్యభారము ఎక్కువవుతుంది. ప్రభుత్వ వార్తాప్రసంగములు, వింతవార్తలు వినుట, పరాక్రమము వల్ల ఘనత సంపాదించుటవంటి కార్యాలలో పాల్గొంటారు. ధనలాభము కలుగుతుంది. శరీరములో వేడి, కాళ్ళు పీకు, కళ్ళుమంట, తలపోటులాంటి అనారోగ్య సూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందుట మేలు. ఉద్యోగస్థులకు, అటవీ, వన, దుర్గ, పర్వత ప్రదేశములకు బదిలీఅయ్యే సూచనలున్నవి. వర్తకులకు రావలసిన బాకీలు వసూలుకాక ఇబ్బంది. 23 రాజకీయాలలో భయం. 24 25 ధనలాభము. 26. 27 అనారోగ్యము. 28, 29 ఘనకార్యాచరణ, కార్యసాధన

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము నిలకడలేని ఆలోచనలతో యేపనీ చెయ్యలేకపోతారు. ధనలోపమువల్ల ఇబ్బంది. శ్రమపడినప్పటికీ మాటదక్కదు. డబ్బు సర్దుబాటు విషయములో సహాయము చేస్తామన్న ఆప్తులు చేయలేకపోతారు. ఎవరు సహాయము చేస్తారో తెలియక చికాకు వేస్తుంది. అకస్మాత్తుగా తటస్థపడ్డ మిత్రుని సహాయముతో వారాంతమునకు కార్యసానుకూలత కలుగుతుంది. ఉపయోగములేని ప్రయాణములు చేయవలసి వస్తుంది. వింత వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు లాభము. ఉద్యోగస్తులకు బదిలీఅయ్యే భయము కలుగుతుంది. విద్యార్థులు వ్యర్థముగా కాలక్షేపము చేస్తారు. 23 నిలకడలేని కార్యక్రమము. 26, 27 ఆశాభంగము, లొట్టుపాటు అనారోగ్యము. 28, 29 మిత్రసహాయము. కార్యలాభము.

శ్రవణము [జూ, జే, జో, ఘా]

ఈ వారము మీకు మిశ్రమయోగము అనుకున్నట్టుగా పనులు జరగవు. ధనలోపమువల్ల గృహావసరములు తీరక కలతలు కలుగుతవి. కోరిన సహాయము లభించదు. కొందరు ఆధారంలేని ఆశలను కలిగించి మీచేత డబ్బు దండగ చేయించి మిమ్ము చిక్కులలోనికి లాగడానికి ప్రయత్నము చేయవచ్చును. మెలకువగా ప్రవర్తించి తప్పుకోండి. ఇంటికి గురుజనులు, సజ్జనులు రావడమువల్ల ఆధ్యాత్మిక జ్ఞానము వృద్ధి అగుటచే ఆనందం కలుగుతుంది. కోర్టు వ్యవహారములు వాయిదాపడుతవి. పుణ్యక్షేత్రములు, అక్కడి విశేషములను చూచుట అవుతుంది. 23 చెడువార్త వినుట 26, 27 అనారోగ్యము, ఆందోళనము. వ్యర్థముగా తిరుగుట. 28, 29 నష్టద్రవ్యలాభము.

* ధనిష్ఠ [గా, గీ, గూ గే] *

ఈ వారము కార్యభారముచే శ్రమ ఎక్కువ. ఇతరుల కొరకు శ్రమపడినా చేసిన ప్రయత్నములు ఫలించక మాట పడతారు. కోర్టు వ్యవహారములు మీ పరము అయినా కొత్త చిక్కులు మళ్ళీ తలెత్తుతాయి. భార్యకు ఆరోగ్యము చెడుటచేతను ఆందోళన కలుగుతుంది. ఉద్యోగస్తులకు బదిలీఅయ్యే సూచనలున్నవి. అపరదినుసులు, ఉప్పు, నువ్వులు, నూనె వ్యాపారస్తులకు లాభము. 26, 27 అన్ని విధాలా అసంతృప్తిగావుంటుంది. 28, 29 కార్యలాభము. వర్తకులకు లాభయోగము. విద్యార్థులకు బద్ధకము.

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈ వారము మీ ప్రయత్నాలు ఫలించక అనేక చిక్కులు కలుగుతవి. ధైర్యముగా పట్టుదలతో కార్యరంగమునకు దిగి ఆఖరుకు ఫలప్రాప్తిని పొందుతారు. పెద్దల సహాయమువల్ల చాలావరకూ ధన లోపము తీరుతుంది ఉద్యోగస్థులు అధికారుల ఒత్తిడి భరించలేక సెలవుపెట్టుట, లేక బదిలీ అవుట జరుగుతుంది యంత్రములు, అగ్ని మొదలగు వాటివల్ల కలిగే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయన ఎరువుల వ్యాపారస్తులకు, ఖనిజములు, లోహములు వర్తకులకు క్రమలో హూతీన లాభ యోగము 23 ప్రమాద సూచన 26, 27 నిందలు, గృహకలతలు 28, 29 పోషక సహాయము, కార్యసాధన

పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]

ఈ వారము మీరు యుక్తివల్ల ప్రయత్నములను సాధిస్తారు జ్ఞాతులవల్ల ధన సహాయము, మిత్రులవల్ల కార్యసహాయమును పొందుతారు. ఈశాన్య దిక్కునుండి సంతోష వార్త తెలుస్తుంది ఉద్యోగస్థుల హోదా పెరుగుతుంది దానితో బాధ్యత కూడా పెరుగుతుంది ఉల్లాసముగా విద్యార్థులు కొత్త సంగతులు నేర్చుకుంటారు గణిత శాస్త్రజ్ఞులకు డాక్టర్లకు, కవులకు చిత్రకారులకు, నటీనటులకు యోగకాలము 23 చాంచల్యము 24 25 ధనాదాయము, 26 27 మానసికాందోళన 28, 29 కార్యసిద్ధి, మిత్రలాభము కవులు నూతన రచనలు ప్రారంభిస్తారు

* ఉత్తరాభాద్ర [దూ, శం ఝా, థా] *

ఈ వారము ఉత్సాహముతో కొత్త పనులు ప్రారంభిస్తారు. ధనాదాయము ఎక్కువవుతుంది దావాలలో గెలుపు కలుగుతుంది పిల్లల అభివృద్ధికి కావలసిన కార్యక్రమము జయప్రదముగా నెరవేరుస్తారు విద్యార్థులు కొత్త సంగతులు శ్రద్ధగా నేర్చుకుంటారు. పండిత గోష్ఠివల్ల విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది వారమంతా తీరికలేని కార్యక్రమములో ఘనత వహిస్తారు. న్యాయస్థానములలో మీ మాట నెగ్గుతుంది. పండితులకు, ఉపాధ్యాయులకు న్యాయవాదులకు, న్యాయ కార్యాలయ ఉద్యోగులకు మేలుకాలము 24, 25 ధనయోగము. 28, 29 పండిత గోష్ఠి, ఘనత

* రేవతి [దే, దో, చా, చీ] *

గత వారముకన్నా ఈ వారము మీ ధనాదాయము ఎక్కువవుతుంది తలపెట్టిన పనులు అనుకున్నటుగా జరుగుతవి బంధు మిత్రులతో కలిసి కవితాగోష్ఠి, సంగీత సభల వంటి వినోదములలో పాల్గొంటారు, నీటి మీద ప్రయాణము చేయవలసి వుంటుంది. విద్యార్థులు కొత్తసంగతులు శ్రద్ధగా నేర్చుకుంటారు. ఉద్యోగస్థులకు అధికారుల ఆదరణ వుంటుంది. ప్రత్తి, దూది, నూలు, బట్టలు ద్రవపదార్థములు, బియ్యము, వెండి వ్యాపారస్థులకు లాభము. దక్షిణదిక్కునుండి మంచి వార్త. వారమంతా యత్నకార్య జయము వున్నా మానసికాందోళన ఎక్కువగా వుంటుంది. 24, 25 ధనలాభము.

వనితాలోకం

ఇది సాధ్యమా?

మీదా అభిప్రాయం ఏమిటండీ?

అనే ప్రశ్న సాధారణంగా అందరికీ తప్పనే వుంటుంది కవి తన కవిత్వాన్ని గురించి, నటుడు తన నటనను గురించి, గాయకుడు తన పాటను గురించి, యిలాగ కళాకారులవారు రోజూ ఎదుటివారి అభిప్రాయాలు తెలుసుకునేందుకు తహతహలాడుతూ వుంటాడు.

అడిగేవారికన్న చెప్పేవారి అభిప్రాయాలు చాలా తమాషాగావుంటాయి కొందరికి స్వంత అభిప్రాయాలు వుంటాయి కాలప్రభావానికి చెక్కుచెదరక వారి అభిప్రాయాలు స్థిరంగా వుంటాయి మరికొందరి అభిప్రాయాలు శుద్ధ (యిమిటేషన్సు అనుకరణసరుకులా వుంటాయి. కావ్యా)లలో, కథలలో చదివి జీర్ణించుకున్న అభిప్రాయాలు కొందరివి ఇలాంటివారు హీరో, హీరోయినుల అభిప్రాయాలు తాము స్వంతంగా ఉపయోగించుకుంటూ తృప్తిపడుతూ వుంటారు ఈపని కొంచెం కష్టమైనదే. మనస్సులో ఒకటి ఆలోచించి, పైకి గొప్పకి యింకో అభిప్రాయం యిచ్చేవారు మనలో చాలామంది. ఏమైనా అభిప్రాయాలు వెల్లడిచేయడం కూడా ఒక కళే.

మేము కాలేజీలో చదువుకునే రోజుల్లో సరోజినీదేవి పేర మా స్త్రీలోక సంఘం వుండేది. దానితరఫున సభలు, సమావేశాలు, చర్చలు, నాటకాలు మొదలైనవి నిర్వహిస్తూ వుండేవాళ్ళం. అలాగే, ఒకరోజున ఒక నాటికను ప్రదర్శించాము. అది కేవలం ఆడపిల్లలు వ్రాసినది. నాటికలో హీరోయిన్ వేసిన అమ్మాయిని గురించి వచ్చిన అభిప్రాయాలు చూడండి

'బ్రహ్మాండంగా వుంది.' తెలుగు లెక్చరరు గారి అభినందన.

'నీకు పాటలు వచ్చునని గాని నటించగల సామర్థ్యం వున్నదని గాని నాకెప్పుడూ తెలియదే!' హిస్టరీ మేష్టారి ఆశ్చర్య ప్రకటన

'నా పర్సులో వున్న డబ్బంతా యిచ్చేద్దామనుకున్నాను' యింగ్లీషు దొరగారి బడాయి

'ప్రసిద్ధ నటి భానుమతి నీకు అక్కయ్యా?' అధికంగా సినిమా మోజు వున్న డ్రామాటిక్ అసోసియేషన్ ప్రెసిడెంటు గారి ఆటంబాంబులాంటి ప్రశ్న.

ఇటువంటి అభిప్రాయాలు, చాలా రకాలు వచ్చాయి. కొన్నిటికి మచ్చు తునకలు.

సాధారణంగా పత్రికలవాళ్లు, పేపర్లవాళ్లు మన అమూల్య అభిప్రాయలకోసం ఎక్కువ ప్రాకులాడుతూ వుంటారు ఈతరగతిలో చెందినవారు రేడియోవారు కూడ. వారు ప్రసారం చేసిన నాటికలు, కథానికలు, ప్రసంగాలు వగైరా ప్రోగ్రాములు ఎలా వున్నది తెల్పుతూ జాబులు వ్రాయమని, ప్రతి ప్రోగ్రాం చివరనా శ్రోతలని కోరుతూనే వుంటారు. రేడియోవారికి వచ్చే అభిప్రాయాలు వేరు ఉదాహరణకి ఒక నాటిక నే తీసికోండి. దానిపై శ్రోతల అభిప్రాయాలు

.. నాటకం బాగానేవుంది. విన్నంతసేపూ విసుగనిపించలేదు. నటీనటులు సమర్థతతో వారివారి పాత్రలను పోషించారు. అక్కడక్కడ ఒక్కొక్కరు కొంచెం బెదురుతూ మాట్లాడినట్లుంది. ఫలానావారు నత్తిగా మాట్లాడారు అయినా మొత్తంమీద వినుల విందుగావుంది. యెలాగ ముగింపు చేస్తారు. తమాషా ఎక్కడంటే బాగుందన్న అభిప్రాయం చదివి, బాగాలేదన్న దానిని విడిచి పెట్టడంలో వుంది. రేడియో అభిప్రాయాలు వినాలనివుంటే, ఎప్పుడైనా శ్రోతల పరిచయం వినండి

ఇవేగాక సినిమాల గురించి వాటికి సంబంధించినవారినిగురించి అభిప్రాయాలు వెలువడుతూ వుంటాయి ఏదైనా క్రొత్త సినిమా విడుదలయిందనుకోండి, మళ్ళీ యింకో సినిమా వచ్చేదాకా దానిపై రకరకాల అభిప్రాయాలు కొల్లలు కొల్లలు ఈరకం అభిప్రాయాలు చదివి సంతోషించడానికి బాగుంటాయి

"నాగేశ్వరరావు సావిత్రిల కాంబినేషన్ బాగుంది!"

'రాజసులోచన కళ్ళు బాగున్నాయి. అవికూడ నవ్వినప్పుడే ఏడిస్తే అసలు మనిషి కాదు!'

'సంగీతం చప్పగావుంది. ఇలాగ యింకో రెండు సినిమాలకు ఫలానావారు గనక యిస్తే హాల్లో మానవులకుబదులు ఏమి వుంటారో చెప్పడం కష్టం!' ... ఇటువంటివే గాక యింకా తమాషాగా వుషారుగా వుంటాయి కొందరి అభిప్రాయాలు.

ఒక వ్యక్తిని చూడగానే, అపరిచితుడయినా సరే, అదోకరకమైన అభిప్రాయం

ఏర్పడుతుంది. కొన్ని వేళల్లో అది నిజమే కావచ్చును. ఒక్కొక్కప్పుడు కాకపోవచ్చును. వ్యక్తులపై అభిప్రాయాలు వెల్లడి చేయడంలో యిబ్బందులున్నాయి. ముఖస్తుతికోసం చేసేవి కొన్ని; ఎగతాళిగా చేసేవి మరికొన్ని. మనస్ఫూర్తిగా చెప్పేవి చాలా అరుదు.

సరిగ్గా సంవత్సరం క్రిందట ఒక ఫ్రెండుని 'నా గురించి మీ అభిప్రాయం ఏమిటండీ?' అని అడిగా. నన్ను గురించి నలుగురు బాహాటంగా, రహస్యంగా చెప్పుకునేవి వినే అలవాటు లేదుకనుక, ఏం చెబుతారో వినాలని వుబలాటపడేదాన్ని. ఆ వుద్దేశంలోనే ఆవిడని ప్రశ్నించాను. కాస్సేపు తటపటాయించి, యింకో కాస్సేపు మురిపించి, ముచ్చటగా తన అభిప్రాయం చెప్పారు. ఏమని? 'మీ మనస్సు మంచిది. కాని మనస్సులోని రహస్యం ఎవరికీ చెప్పరు?' అన్నారు. నిజంకూడా అంతే. సుఖమయితే అంతరాత్మతో చెప్పి సంతోషిస్తాను. కష్టమయితే అలానే కృంగిపోతాను. కాబట్టే, మొదట్లో అపార్థం చేసికున్నా, క్రమేణా అరంచేసికున్న స్నేహితులు అనేకం. మా ఫ్రెండు నిర్మొహమాటంగా చెప్పినది నాకు నిజమనిపించింది. అన్ని వేళలా అలావుండదు వ్యక్తిగత అభిప్రాయం చెప్పడం ఒక్కొక్కసారి ప్రమాదం అని ముందరే చెప్పానుగా. ఉదహారణ చూడండి.

'మా పక్కింటి అమ్మాయికి పెళ్ళివారు వచ్చారు. తనతో నాకు బాగా పరిచయం, అపైన స్నేహం కనుక వెళ్ళక తప్పిందికాదు. నాలాగే చుట్టుప్రక్కల ముసలమ్మలు, ముత్తయిదువలుకూడ వచ్చారు. సరే. అనుకున్నట్లు చూపులయ్యాక పెళ్ళివారు వెళ్ళిపోయారు. అంగీకారం తెల్పి మరీ వెళ్ళారు. ఆ అమ్మాయి కూడా సంతృప్తి ప్రకటించింది. ఇంతలో ఒకావిడ, వరుసకి ఆ అమ్మాయికి అత్తయ్య చెల్లెలవుతుంది, అమాంతం తన అభిప్రాయం బాహాటంగా వెల్లడిచేసింది' ఏమని?

'పెళ్ళికొడుకు కిళ్ళీకొట్టు సాయిబులా వున్నాడని.' అంతే దానితో ఎవరెన్ని చెప్పినా ఆ అమ్మాయి ఆ సంబంధానికి ఇష్టపడలేదు.

ఇంకోకరకం వున్నారు. తమ అభిప్రాయాలు ఎదుటివారి నెత్తినరుద్ది, ఒప్పించాలని, అతివాదనచేసి మరీ ఒప్పిస్తారు. ఇది మరీ బాధాకరం. మా ఫ్రెండు ఒకామె పాటలు పాడుతుంది. ఆవిడ బాగాపాడదని మాకు తెలిసున్నావిడ అభిప్రాయం. 'ఏం బాగాపాడదు! దానికి శాస్త్రీయసంగీతం రాదు! కంఠం అసలు బాగోదు!' అని చీటికీ మాటికీ అంటూంటే, మనకి కష్టంగా వుండదూ!

నలుగురు కూర్చుని సరదాగా భోజనం చేస్తూంటే, వంటకాలమీద, ఆరోగ్యసూత్రాలమీద అభిప్రాయాలు వెళ్ళగక్కేవారు చాలామంది వుంటారు. 'అరటికాయ తింటే వేడిచెయ్యదూ!' 'చింతకాయ పచ్చడితో గొంతుకపోదూ.' ఇటువంటి మాటలు వినుతూంటే తినేవారికికూడా భయం పట్టుకుంటుంది. ఇదిచాలా చెడ్డ స్వభావం. ఒకసారి మావాళ్ళింటికి పెళ్ళి భోజనానికని వెళ్ళాను. అన్నిటితో పాటు వెజిటబుల్ పులావ్ వడ్డించారు. ఆ పులావ్ వాసనా, రుచీ నాకు చాలాయిష్టం. సరే, తిందాం కదా అని నోట్లో పెట్టుకోబోతున్నాను. ప్రక్కన కూర్చున్న శారద 'ఛ.ఛ. పులావ్ చూస్తేనే డోకు వస్తుంది. దాన్నిండా ఆ ఉల్లిపాయలూ, బంగాళాదుంపలూ ఇంకా ఏవేవో...అబ్బా... పురుగుల్లా వున్నాయి' అంది అమాంతంగా. నోట్లో పెట్టుకోబోతున్న ముద్ద దానంతటదే జారిపోయింది. ఇంట్లోవారంతా వచ్చి బలవంతంచేసినా తినబుద్ధికాలేదు. అప్యాయంగా తినదల్చుకున్న దానిని తినకుండా చేసేవారు చాలామంది.

అన్ని విషయాలలో అభిప్రాయాలున్నట్లే కట్నాలలోకూడ. ఆడపిల్లలు గల తండ్రికి వరకట్నం నిర్మూలమయితే బాగుండును అనిపిస్తే, లేనివారికి ఇంకా కట్నం వస్తే చాలాచాలా బాగుంటుంది అనే అభిప్రాయం ఉంటుంది. ఇటు ఇవ్వము, అటు తెచ్చుకోము అనేవారు కొందరయితే, ఇస్తాం, తెచ్చుకొంటాం అనే అభిప్రాయం గలవారు మరికొందరు.

కాబట్టి, ఎవరైనా మన అమూల్య అభిప్రాయంకోసం అడిగినప్పుడు, అటు వారి మనస్సు నొప్పించక ఇటు మనకూ ఆత్మవంచన కలగకుండా వుండేలాగు మనం అభిప్రాయాలు వెల్లడిచేస్తే బాగుంటుందని నా అభిప్రాయం! ఏమంటారు! ★



కేశాలంకరణ

—వీరిశెట్టి అచ్యుతరావు, పుల్లేటికుర్రు.

దోమతెరగుడ్డలో కుట్టే విధానం

ఈ కుట్టును కొందరు గుడ్డక్రింద డిజైను కాగితము పెట్టి కుడతారు కాని నేను గళ్లు (కిటికీలు) లెక్కపెట్టి కుట్టే విధానము చెబుతాను. ముందు చిన్నగుడ్డలో (చినిగిన దోమతెర) ప్రయత్నించండి. బాగా వచ్చిన తరువాత టీపాయ్ కవరును, దిండు కవరును కుట్టవచ్చు. 1,3 బొమ్మల్లో నమూనాలు యిచ్చాను 2, 4 బొమ్మలలో ఎలా కుట్టాలో వివరంగా ఇచ్చాను. ఈ కుట్టు పెద్ద కష్టమేమీ కాదు.




క్రాస్ స్టిచ్ లాగ గళ్ళు లెక్కపెట్టి కుట్టాలి. ఈ కుట్టు టాకాలలాగా కుట్టాలి.


3 వ డిజైను

దీనికి మామూలు ఎంబ్రాయిడరీ దారాలు సూదులు పనికిరావు. పురి త్రిప్పిన లావు దారాలు, కొంచెము పెద్దసూదులు కావాలి. ఈ వుండలో ఒకపోగుగా ఉంటుందిదారం. అలాంటి పోగులు రెంటిని కలిపి మనము కుట్టాలి. సాధ్యమైనంత పొడుగు దారాలు సూదికి ఎక్కించాలి.

2-వ బొమ్మలోని కమలాన్ని ఎలాకుట్టాలో చెబుతాను దాన్నిబట్టి 4-వ బొమ్మలోని డిజైను కుట్టవచ్చు అసలు ఈ కుట్టుకు పద్ధతి తెలిస్తే చాలు. చూసి కుట్టవచ్చు. 2వ బొమ్మలో డిజైను ఎక్కడ మొదలు పెట్టాలో నేను చెప్ప నవసరం లేదనుకుంటాను. (మధ్యలో నుండి ఆరంభించాలి) సూదికి రెండుపోగుల దారము యెక్కించి క్రిందినుండి సూదిని పైకి తీయాలి. రెండవ కిటికీ (మొదలుపెట్టిన కిటికీకూడ లెక్కపెట్టాలి) లోనుండే క్రిందికిదించి 3-వ కిటికీలో నుండి సూదిని పైకి తీయాలి. 4-వ కిటికీలోనుండి క్రిందికిదించి 5-వ కిటకీల నుండి పైకి తీయాలి 6 వ కిటికీలోనుండి క్రిందికిదించి 7 వ కిటికీనుండి పైకితీసి 8-వకిటికీలో క్రిందికి దించాలి. ఇది ఒక వరుసలో ఒక భాగము. తిరిగీ ఈ కిటికీలగుండానే 2-వ భాగము పూర్తిచేయాలి. ఎలాగంటే ఇప్పుడు దారము 8 వ కిటికీక్రింద వుందికదా! 8 వ కిటికీ క్రిందనుండి 7 వ కిటికీ పైకి సూదిని తేవాలి 6 వ కిటికీ క్రిందకుదించి 5 వ కిటికీ గుండా పైకి తేవాలి 4 వ కిటికీలో క్రిందికి దించి 3 వ కిటికీగుండా పైకితీయాలి 2-వ కిటికీలో క్రిందికిదించి 1 వ కిటికీనుండి(మొదలెట్టిన కిటికీ) పైకి తేవాలి. ఇప్పుడు కమలము (డిజైను) యొక్క ఒక రేఖ పూర్తి అయింది. ఇలాగ ఆరు రేఖలు పూర్తి చేయాలి అప్పుడు పూర్తి కమలము ఏర్పడుతుంది. ఒక్కొక్క రేఖ పొడవు 8 కిటికీలు (ప్రారంభం చేసిన కిటికీ కూడ కలిపి) ఇలా 1 వ బొమ్మలోని నమూనా ప్రకారం గళ్ళను లెక్క చూసి 3 వ డిజైను తేలికగాకుట్టవచ్చు 4వ బొమ్మలోని నల్లటి పొడుగుగీతలు దారాలన్నమాట. ఈ డిజైనుకు మొదటిడిజైనులాగ రెండుభాగాలుగా కుట్టనవసరం లేదు. నమూనాలో 2 వ బొమ్మలో వున్నట్లు లైనుగా కుట్టుకు పోవడమే.




4 వ డిజైను



1 వ డిజైను

ఇలాంటి కమలాన్ని టీపాయ్‌కు అక్కడక్కడ కొన్ని తీసివేస్తే చాలా బాగుంటుంది. 15'' × 15'' దోమతెర గుడ్డను తీసుకొని గళ్ళు లెక్కపెట్టి మీకిష్టమొచ్చినన్ని కమలాలు వేయండి. తర్వాత 15'' × 15'' తెల్లగుడ్డను తీసుకొని దోమతెర గుడ్డను తిర



2 వ డిజైను

వనితా వాణి



శ్రీమతి దద్దనాల రంగనాయకమ్మగారు వ్రాసిన "చుట్టమై చూడొచ్చి" అనే వ్యాసాన్ని చదివి చాలా విచారించాం. పూర్వకాలంలో ఎవరు లేకపోనే, దారినపోయే బాటసారినో గుడిదగ్గరనో సత్రందగ్గరో ఉండే సన్యాసులనో తీసుకువచ్చి అతిథి అభ్యాగతులకు రోజూ అన్నదానము చేసే వారని చాలాకథలద్వారా చదివాము. కాని నేటికాలానికి ఎరగనివారై యేదిక్కూ లేని బంధువృద్ధుడు వసే చేసే మర్యాద, వారి మనసులు బయటపడవి. ప్రస్తుతం రోజులు మారటంతో మతులుకూడా మారినవనుకుంటాను. ప్రస్తుతం పట్టణాలలోకూడా అతిథి అభ్యాగతులను సత్కరించట తగ్గిందిలెండి. మొదట దయ్యమైపట్టినవారు డబ్బులు వదలా రనుకుంటా. పైసాలో పరమాత్మ ఉందం టారు నిజం.

—జి. అన్నపూర్ణ, హైదరాబాద్]

* * *

దద్దనాల రంగనాయకమ్మగారు వ్రాసిన వ్యాసం, "చుట్టమై చూడవచ్చి" అన్నది చాలాబాగుంది.

—కోటంరాజు లీల, (విజయవాడ.)

* * *

2-7-58 తేది ఆంధ్ర వారపత్రికయందు వ్రాసిన 'చుటమై చూడొచ్చి' అనే వ్యాసము నన్నెంతో ఆకర్షించినది. గృహస్థులు అయిన ప్రతివారికి, నీనా అనే తేడా లేకుండ ఆదర్శప్రాయముగా ఉన్నది. రంగనాయకమ్మ గారికి నా ధన్యవాదములు,

వేగేశ్న శ్రీ అన్నపూర్ణదేవి.
(కండ్లకోయ్య హైదరాబాద్ జిల్లా.)

* * *

కొందరు యువతులు పెండ్లాడి సంసారములో బిడలతో వున్న పురుషులను ప్రేమించుతు వాళ్ళు సుఖపడలేరు సరికదా, వాళ్ళ సంసారంలో చిచ్చుపెట్టి, భార్య బిడ్డలతో సుఖంగా వుండేవారిని దుఃఖపెటడం జరుగుతుంది. అందుచేత యువతులకు నా సలహా ఏమిటంటే, యువతులు తొందరపాటుతో మొగవారిని మోహించి, వారిని మోహింప చేయటం క్షేమంకాదు. పరపురుషులను అన్నదమ్ములవలె చూడవలెను.

—సిహెచ్. లలితాంబ, (దొండపర్తి, విశాఖజిల్లా.)

* * *

వేరులేని మొక్క; తీరులేని బాట

వనితాలోకంలో సుమారు 3, 4 వారాల నుంచి చదువుతున్నాను 'భర్తృవిహీనల దుస్థితి' అనే శీర్షికగల వ్యాసాలు. అవి చదువుతున్నంతసేపూ మనసులో ఏదో ఉధాను రేగినట్టుగాను తల పగిలిపోతున్నట్టుగాను అనిపిస్తోంది.

సనాతను లనేవారిని ప్రత్యేక వర్గంగా విడదీసి, వారిని నిశితంగా విమర్శిస్తూ వారికి తోచిన, నచ్చిన అభిప్రాయాల్ని వెలువరిస్తున్నారు ఎందరో సోదరీమణులు. భర్తృవిహీనలకు బొట్టు వుంచేకేం అని అంటున్నది ఒక సోదరి. కేశ ఖండనం అనవసరం అంటున్నది మరొక యువతి. పీకొర్లకు విడితే ఫరవాలేదు అని వ్రాస్తున్నారు మరియొక ఉవిద. ఇట్లాగే ఎందరో.

ఈ రోజుల్లో అభ్యుదయం, స్త్రీ స్వాతంత్రం అనే నినాదాలు నలుమూలల నుండి వినిపిస్తున్నాయి. ప్రతివారికి వాటి అర్థం తెలియకపోయినా వ్యాసాలూ, ఉపన్యాసాలూ దంచేస్తున్నారు. స్త్రీ స్వాతంత్ర్యము అనే నినాదం వేళ్ళులేని మొక్కలాంటిది. అభ్యుదయమార్గం అనేది అర్థవిహీనమైన బాట. ఈ రెండు ఆశయాల ప్రభావమే మన తోటి సోదరీమణుల పై అభిప్రాయాల సారాంశం.

సనాతనులని పేరుపెట్టి, అవసరపు ధోరణులతో కొత్త సిద్ధాంతాల్ని, ఆదర్శాలను సృష్టించి, అసంఖ్యాక స్త్రీలను మనస్సు నొప్పిస్తున్నారు.

శ్రీ వివేకానందస్వామి విదేశాలలో "పునీత భారతదేశం గొప్పతనం అంతా స్త్రీలపైన ఆధారపడివుంది" అని అన్నారు. మన పూర్వీకుల చరిత్రల్ని చదువుకొని, 'ఈనాడు అభ్యుదయాన్ని సాధించార'ని మనం అనుకొంటున్న ఇగ్లండు, అమెరికా దేశాలవాళ్ళు అచ్చెరువొందారు. మన వెనుక ఉజ్వలమైన సంస్కృతి వుందని మన మగువలు మఱచిపోగూడదు. కనుక ప్రాచీన రాలలోని ఔన్నత్యాన్ని గుర్తించి, కొత్త సిద్ధాంతాల్ని పెట్టుకొని విచిత్ర ధోరణులు పోకుండా వుంటారని ఆశిస్తాను. ఈ వ్యాసం కొందరి సోదరీమణుల మనస్సులను నొప్పించవచ్చు. క్షమిస్తారు కదూ!

—నూరిసీత, మాజీవీడు]

* * *

వంటలు

తీరిగ్గా అప్పుడే భోజనము చేసి కూర్చున్నాను. పత్రిక తీసి చదువుచున్నాను. వంటలు తీసి చూసేసరికి ఎస్. కె. దుర్గ గారు వ్రాసిన పచ్చళ్ళను చదివాను. వెంటనే బజారుకెళ్లి కావలసినవన్ని కొనుక్కొని వచ్చాను మా వదినతో చెప్పాను అందులో ఎల్లా వుంటే అటుల చేయుమని. ఆవిడ అట్లనే చేసింది. మరుసటి దినము కాకుండ ఆ మరుసటి దినము కంది పచ్చడి, అల్లము పచ్చడి తిన్నాను. కంది పచ్చడి అత్యద్భుతముగ నున్నది. మా అన్నయ్య కూడ మా వదినను మెచ్చుకున్నాడు. అల్లం పచ్చడికంటె కందిపచ్చడే బాగున్నది.

—ఎ. ఎస్. ఆర్. రాయి, వాల్తేరు.]

* * *

'బాదుషా'

ఆంధ్ర పత్రికలో పిండివంటలు వ్రాసి

గేసి అతికించాలి. తర్వాత లేత ఆకుపచ్చగాని, లేక నీలపు వాయిల్ గుడ్డగాని 4" వెడల్పుది తీసుకొని టీపాయ్ కవరు చుట్టూ ఫ్రిల్స (కుచ్చెళ్ళు) పెడుతూ కుట్టండి. ఇప్పుడు టీపాయ్‌కు వేసి చూడండి. ఎంతో బాగుందికదూ! (మా టీపాయ్ కవరు సైజు ఇచ్చాను.)

3వ బొమ్మలోని డిజైనుకూడ టీపాయ్‌కి వేసి కుట్టవచ్చు. దిండు కవర్లకు 4 మూలల్లో వేసి కుట్టే ఎంతో బాగుంటుంది. దీనికైనా గాని ఈ దోమతెర గుడ్డ క్రింద మరియొక తెల్లగుడ్డ వేసి కుట్టేనే అందం. పూరికే (వుత్తినే) అలా వదిలేస్తే బాగుండదు. ★

మంగళా కందూర్,
(వైజాగ్)

★ వనితావాణి ★

సోదరీమణులలో ఎవరికైనా, 'బాదుషా'లు చేయువిధానము కనుక ఆంధ్ర పత్రిక ద్వారా తెలియపరుస్తారని ఆశిస్తున్నా. ఏమిటంటే మేము ఎన్నివిధాలుగా చేసినా కొట్టుమీద 'బాదుషా'లలా పొరలు పొరలుగా రావడం లేదు. మధ్య ఉడకకుండాపోతోంది. అందుచేత మీ కెవరికైనా ఆ కిటుకు తెలిస్తే చెప్పుతారని అడుగుతున్నా, చెబుతారు కదూ!

—ఎం. సుగుణవతి, (కేలంగి)

*　　*　　*

జోహార్లు

నేను 23-4-58వ తేదీ 'ఆంధ్రవార పత్రిక'లో దామర్ల చిన్నమ్మగారు వ్రాసిన అబాధ ఆత్మఘోష చదువుతూ ఉంటే, నాకు యెంతో విచారము వేసినది. కాలాను గుణ్యముగా మన సంఘ పెద్దల మనస్సులు, ఆచారములు, అలవాట్లు పూర్తిగా మారాలి. ఆ విధముగా మారనియెడల ముఖ్యముగా, బాలవితంతువుల, దుర్భరస్థితి యథాప్రకారముగానే యుండును అని వ్రాయుటకు సందేహము లేదు.

వితంతువులకు సరియైన మార్గము చూపించిన, భారతరత్న, డాక్టర్ దోండు కేశవ కార్వేగారు స్వర్గీయ వీరేశలింగం పంతులు గారు ఎంతో ప్రశంసనీయులు.

రుద్రాకర్షుల సుబ్బలక్ష్మీరావు,
పురులియా, పశ్చిమ బెంగాల్.]

*　　*　　*

ఈ విధంగా

శ్రీమతి టి. ప్రభావతిగారు వ్రాసిన "నేనూ చదివాను బి. ఎ. అయితే ఏం లాభం?" అనే వ్యాసం చదివాం. ఈ వ్యాసం రాయడంలో ఈమె ఉద్దేశ మేమిటో మా కర్థం కాలేదు. చదవడం పబ్లిసిటి కోసం కాదు. అదే వుద్దేశ్యమైతే ఏ గొలుసులో నైనా (పొట్టిదైతే మరీ మంచిది) బి. ఎ. అనే లాకెట్టు అందరికీ కనిపించేటట్టు ఏర్పాటుచేసుకుంటే మంచిది. లేకపోతే బ్రోచ్ మీద చెక్కించుకుంటే మరీమంచిది. మేమూ చాలసార్లు ప్రయాణాలుచేశాం. కాని ఇటువంటి వుద్దేశ మెప్పుడూ కలగ లేదు. అందరూ అడగడంకోసమే అయితే ఏదైనా చదివానని చెప్పుకోవచ్చు. అంతగా చెప్పుకోవాలని వుంటే, ఆ ప్రస్తావన తెచ్చి (ఇప్పుడు మేము చేసినట్టు) మధ్యలో తను బి. ఎ. చదివినట్టు చెప్పుకోవచ్చు. సోదరి టి. ప్రభావతి మమ్మల్ని అపార్థం చేసికోవరని తలుస్తాం.

—కుమారి టి. ఎస్. ఆర్. కృష్ణ బి. ఎ;
కుమారి పి. సరోజిని బి. ఎ; ఎం. విమల.]

*　　*　　*

"నేనూ చదివాను బి. ఏ. అయితే ఏం లాభం?" అను వ్యాసం సోదరి శ్రీమతి టి. ప్రభావతి తమ అనుభవాన్ని వివరించి, "దానినిబట్టి ఆడదాని చదువు 75% సార్థకత లేదని నాకు బాగా అనుభవం అయిపోయింది. ఈవిషయంలో నాతో ఎంతమంది ఏకీభవిస్తారో" అని వ్రాశారు.

నేను ఏకీభవించను.

—జి. ఎం. శ్యామల, ఎమ్మిగనూరు.]

*　　*　　*

'నా నిర్వచనం'

శ్రీమతి ప్రభావతిగారి అభిప్రాయముతో ఏకీభవించలేని నాలాంటివారు చాలమంది వుంటారనుకుంటాను. చదువు ఉద్యోగము చేయడానికి మాత్రమేనని (స్త్రీవిషయములో) పెద్ద చదువులు చదివి వుద్యోగము చెయ్యక సామాన్య స్త్రీవలె సంసారము చెయ్యడంలో ఎంతో పొరపాటు చేస్తున్నామని అనుకునేవారు పెద్ద పొరపాటు చేస్తున్నారు.

ప్రకృతిలో పురుషుడికిగాని, స్త్రీకిగాని విడివిడిగా ప్రాముఖ్యతలేదు. ఇద్దరూ కలిసినపుడే వారికి విలువవుంటుంది. ఇదరూ కలసినపుడే వారికి విడివిడిగా వున్నపుడు లేని పరిపూర్ణత వస్తుంది. ఇది ప్రకృతి సత్యం.

జీవితంలో భాధ్యతలనన్నీ రెండు భాగాలుగాచేసి ఒక భాగాన్ని పురుషునికీ రెండవ భాగాన్ని స్త్రీకి ఇచ్చింది ప్రకృతి. ఇద్దరి బాధ్యతలు వేర్వేరు. మగవాడు తన బాధ్యతలను నిర్వర్తించడానికి చదువు ముఖ్యము. అది అవసరము స్త్రీ తన బాధ్యతలను నిర్వర్తించడానికి చదువు అవసరము లేదు. కాని అది సహాయకారిగా పని చేస్తుంది. చదువు సంస్కారాన్ని ఇస్తుంది. మనిషిలోవున్న కొద్దిపాటి మంచిగుణాల్ని పెంపొందచేస్తుంది. తన సంసారాన్ని సరియైన మార్గంలో నడుపుకోవడములోను, తన బాధ్యతలను నెరవేర్చడములోను ఎంతయినా సహాయపడుతుంది చదువు. ఇంకొక ముఖ్యమైన విషయమేమంటే, చదువుకున్న భార్యాభర్తలు నూటికినూరుపాళ్లు తెలివితేటలుగల సంతానాన్ని పొందగలరు. మీకు తెలిసిన కుటుంబాలన్నిటిని పరిశీలించి చూడండి. దీనిలో సత్యం తెలుస్తుంది.

జాగ్రత్తగా ఆలోచిస్తే తన చదువు 75% సార్థకమయినదేనని, అవుతుందని ప్రభావతిగారు ఇట్టే గ్రహించగలరు.

—'ధరణి' బొంబాయి]

*　　*　　*

శ్రీమతి కొత్తపల్లి రాజ్యలక్ష్మిగారు వ్రాసిన మంగళసూత్రం ఎందుకు తీసి వేయాలి? అను వ్యాసము చదివితిని చాలా కాలానుగుణ్యంగా కొన్ని పూర్వకాలపు పద్ధతులను వదలివేయుటలో తప్పేమిలేదు. ఆ వ్యాసముపై మురళీధరరావు విమర్శ పూర్తిగా చదివాను. కాని వారు అలా వ్రాయడము సమంజసముగాలేదు.

కుమారి సనకా బాలసర్వస్వతీసరోజినీబాయి
పవరుపేట, ఏలూరు.]

*　　*　　*

శ్రీమతి కొత్తపల్లి రాజ్యలక్ష్మిగారు వ్రాసిన మంగళసూత్రము ఎందుకు తీసి వేయాలి అనేవ్యాసము చూచితిని. ఆమె చెప్పిన విషయములు అనుసరించ తగినవిగా ఉన్నవి. స్త్రీ సమాజము ఉన్నతస్థాయి పొందవలెనంటె యిట్టివ్యాసములు ఎంతయో అవసరమైయున్నవి

-వాశిరెడ్డి విజయసుశీలకుమారి, తుమ్మపూడి]

★

వంటలు

కాయకూరలు మానవులకి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. వీటిలో విటమిన్లు వుంటాయి. కూరలన్నిటిలోను చెప్పుకోతగ్గది పాలకూర. ఇది పుష్టికరమైన ఆకుకూర. ఇందులో డి. విటమిను ఉంటుంది. దీనిని గుంటూరు, నెల్లూరు, తెనాలి ప్రాంతాలలో విశేషంగా వాడుతారు.

పాలకూర బజ్జీలు:- నూనెలో పైత్యగుణం వుంది. ఆ పైత్యహారమే పాలకూర. పొయ్యిమీద బాణలిలో నూనె కాగిన పిదప, ఉప్పు కారములతో పలుచగా కలిపిన శెనగ పిండిలో ఈ ఆకు ముంచి నూనెలో వెయ్యాలి. వేగిన తరువాత తీసి తింటే చాలా బాగుంటుంది.

పకోడీలు:- దీనికి కావలసినవి-శెనగపిండి పావుశేరు, కారం మూడు టీస్పూనులు, పది పాలకూరఆకులు, చిటికెడు తీపిసోడా, వేసుకొనేవారు ఉల్లిపాయ, పచ్చిమిర్చిముక్కలు కూడ వేసుకోవచ్చు. ఇవి కూడ మామూలుగానే నూనెలో వేసి తీయాలి.

కూర:- పాలకూర ఆకులు శుభ్రంగా కడిగి తరిగి ఉడకబెట్టాలి. బాగా ఉడికిన తరవాత దించాలి. పప్పుకూర వండుకొనేవాళ్లు పప్పు కూడ వేరే ఉడకబెట్టాలి. లేనిచో మామూలుగా నూనె, మిరపకాయ ముక్కలు, శెనగపప్పు లేదా మినపప్పు మొదలగు వాటితో తాళింపు పెట్టాలి.

పులుసు:- చింతపండుతో పిండిన నీటిలో ఈ ఆకులు సన్నగా ముక్కలుగా తరిగి వెయ్యాలి. ఉల్లిపాయ, పచ్చిమిర్చి ముక్కలు కూడ వేసి బెల్లం, ఉప్పు వెయ్యాలి. తరువాత తాళింపు పెట్టాలి.

కె. ఎల్. కాంతం, (విజయపురి).

"పెసర అప్పడాలు"

కావలసినవి: 2 శేర్లు పెసరపప్పు, 1 పా॥ సీమమిరపకాయలు, తగినంత ఉప్పు, చిన్న ఇంగువముక్క, కొద్దిగా నూనె.

పెసరపప్పు మెత్తగా మరపట్టించి వుంచవలయును. సీమమిరపకాయలుపొడికొట్టించి వుంచవలయును. ఉప్పు, ఇంగువ కాస్తనీళ్ళలో నానవేసి ఈపిండిలో కారము, ఉప్పు, ఇంగువ నూనె వేసి అప్పడములపిండి మాదిరిగా కలియపెట్టవలయును. ఇవి చిన్న చిన్న ముద్దలుగా చేసి అప్పడాలకర్ర పీట తీసుకొని గుండ్రముగా వత్తవలయును. ఎండపెట్టి ఒక డబ్బాలో వుంచుకొని కావలసినప్పుడు కాస్త చేతిలో వేచుకొని తింటే చాల బాగుంటవి. కొందరు కారమునకు బదులు పచ్చిమిరపకాయలు నూరి వేసుకొంటారు. కారము ఉప్పు ఎవరిరుచినిబట్టి వారు వేసుకొనవచ్చును.

న్యాయపతి అమ్మాజీ (చింతలపూడి).

గృహ వైద్యం

నేరేడుచెట్టు మనకు అనేక విధాల ఉపయోగపడుచున్నది అనేక ఔషధాలకి అనుపానంగా వాడతారు. కొన్ని కొన్ని వ్యాధులందు దానిగుణం అత్యద్భుతం.

నేరేడుచెట్టు ముదిరిన మ్రానుచెక్క కషాయంతో గ్రహణి, నీళ్ళ విరేచనాలు, అతిసారము, రక్తగ్రహణి మొ॥న వ్యాధులకు చికిత్స చేయవచ్చు. అతిత్వరితంగా సత్ఫలితాలు కనిపిస్తాయి. నేరేడు చెక్కతో గోరువెచ్చని కషాయంతీసి పుక్కిలించిన గొంతు మంట, గొంతుకలోని వాపు పోవును. రక్తమును శుభ్రపరచి, సమస్తమేహములకు ఉపశాంతిజేయును. ముదిరిన మ్రానునుండి తీసిన చెక్కయొక్క చిక్కని కషాయం (concentrated) తో కురుపులు, పుండ్లు, మొ॥వాటిని కడిగినచో శుభ్రపడి త్వరగా మానును.

చంటిపిల్లలందు 10 సం॥ల లోపు పిల్లలు కొందరు చొంగ ఎక్కువగా (Saliva) కారుస్తారు. అట్టి పిల్లలచే నేరేడాకులు, లేతవి—నమలించి ఆ పూట మ్రింగించిన చొంగ కారుట కట్టును. అట్లు ఆకులు నమలుటచే పండ్లు గట్టిపడతాయి. ఇగుళ్లు మెత్తబడుటను మాన్పును.

నేరేడుపండ్లు

నీళ్ళవిరేచనాలు గలవారు నేరేడుపండ్లు తినిన తగ్గిపోవును. ఆమే గ్రహణి కూడ. మూత్రపు సంచియందు రాళ్లుపుట్టి చాలా మందిని బాధించును. అట్టి రోగులు నేరేడు పండ్లు వాడినచో రాళ్లు పుట్టనీయదు. బాధపడుచున్నవారికి ఉపశాంతి కల్గించును. ఉష్ణతత్వంగలవారి పొటకు బలంకల్గించును, మంచి ఆకలి పుట్టించును. మేహశాంతి, పైత్యశాంతి కల్గించును. కఫపైత్యాల్ని. శిరోపిత్యాల్ని సంహరించును.

దీనిని తినగా మిగిలిన గింజలు. విత్తనాలను ఎండబెట్టి చూర్ణముచేసి వాడినట్లయిన అతిమూత్రము, మధుమూత్రములను పోగొట్టును. మధుమూత్రమునందు కొన్ని ఔషధాలకిది అనుపానంగాకూడ వాడతారు. ఈ గింజలను ఎండబెట్టి, కషాయంతీసి, ఔషధంలో అనుపానంగా వాడినచో మిక్కిలి గుణం ఇచ్చును. మధుమూత్ర మున్నచో త్వరితముగా పోగొట్టుతుంది. మళ్లా రానీయదు. మధుమూత్ర మనగా నీరుడియందు చెక్కెర పోవుట. ఇది కారజమునకు బలము కల్గించి, కారజముయొక్క పనిని సక్రమమార్గమునందుంచును.

సంగాని ప్రభావతి శేషగిరిరావు, (తాళ్ళరేవు)

చట్టం అమలుకు వచ్చాక:

కట్నపిశాచి ఫాన్సీడ్రెస్!

ఈమధ్య మా బంధువులింట్లో పెళ్ళికి వెళ్ళాను. మాటల సందర్భంలో వధువు తల్లిని "పిల్లాడికి కట్నం ఎంత ఇచ్చారని" అడిగాను. (అలవాటు ప్రకారం!) "అబ్బే ఓ దమ్మిడీ కూడా కట్నం ఇవ్వలేదం" దావిడ నా కాశ్చర్యానికి అంతు లేక పోయింది. యస్. యస్. యల్. సి. ఫైలయినవాళ్ళు రెండువేలు, పాసయిన వాళ్లు మూడువేలు కట్నం తీసుకునే ఈ రోజుల్లో యమ్. బి. బి యస్ పాసయిన పిల్లాడికి వీళ్ళు కట్నం ఇవ్వలేదంటే నా చెవులను నేనే నమ్మలేకపోయాను. ఇక వుండబట్టలేక "మరైతే లాంఛనాలుగాని ఏదైనా ఇచ్చారా?" అన్నాను.

"ఊఁ! ఏముందిలెండి! వెండికంచం పట్టుబట్టలూ కాక, రోలెక్సువాచీ, ఓ రవ్వలవుంగరం, మోటార్ సైకిల్, రేడియో గ్రామ్‌ఫోన్, ఘమూరయిన కుషన్ సోఫా సెట్టు...అంతే...!" ఊపిరి పీల్చుకోటానికి ఆగిందావిడ!

నా కళ్ళు బైర్లు కమ్మాయి. వరసన ఆవిడ చెప్పిన వసువుల లిస్టు నా బెగురుగా ధరలూ మనస్సులో వూహించుకున్నా...వీటన్నిటితో పాటు పెళ్ళి ఖర్చు ఓ నాలుగు వేలు రూపాయలు...ఎలా అయితేనేం మొత్తం ఆ పిల్లవేపువారికి ఓ పదివేల రూపాయలయినా యన్నమాట పెళ్ళికి. కట్నం తీసుకోలేదన్నమాటకు అర్థం నా కప్పుడు స్ఫురించింది. అవునుమరి! ఇంతకుముందు బాహాటంగా చెబుతూ మగపెళ్ళివారు కట్నం పుచ్చుకునేవారు. పిల్లవేపు వారు కూడా ఘనంగా ఇంత కట్నం ఇచ్చాం అని చెప్పుకుంటుండేవారు కాని మధ్యలో ఇదరికీ చిక్కొచ్చిపడింది. అదే వరకట్న నిషేధబిల్లు! బిల్లయితే వచ్చింది కానీ ఈ సమస్య ఏమన్నా తగ్గిందా అంటే అదీ లేదు. లాంఛనాలపేరుతో కట్నం పుచ్చుకుంటూనే వున్నారు అయితే రెండర్థాల అలా కట్నం ఇచ్చామని చెప్పుకోటానికి లేకుండా, ఇవ్వకుండా వుండటానికి లేకుండా, డబ్బుమాత్రం ఏదో ఓరూపంలో ముట్టచెప్పవలసి వస్తోంది పిల్ల తల్లిదండ్రులకి.

పైగా మరోతమాషా జరుగుతోంది. కట్నం తీసుకునేవాళ్లు ఖచ్చితంగా ఇన్ని వేలు అని అడగటం, ఆ అడిగినంత పెళ్ళిలో పిల్లవేపు వారు ఇచ్చేడం జరుగుతుండేది. కానీ ఇప్పుడేమిటంటే కట్నాల ప్రసక్తే లేదు గాబట్టి (పేరుకు) ఇన్నివేలు అనేది నిర్ణయం కాదు కాని లాంఛనాల పేరుతో వచ్చే లిస్టులో వరకట్నానికి కనీసం ఇంకో వెయ్యో రెండువేలో ఎక్కువే వుంటుంది. అవునుమరి! కట్నం తీసుకోటం లేదుగా! అలాటప్పుడు పిల్లాడికి కావలసిన జీవితావసరాలన్నీ, లాంఛనాల్లో రాబట్టుకోవాలాయె! మొదటనే చెప్పినట్టు మోటార్ సైకిల్ వగైరాలు వాళ్ళిచ్చారంటే ఒక్కటే పిలగనుక ఓ పదివేలు ఖర్చయినా, ఏమంత పెద్ద విచారించవలసిన విషయం కాదు కానీ అదే

పి. ఎన్. ప్రభావతి
(అనంతపూర్)

ఓ ఐదారుమంది ఆడపిల్లలు వుండే తల్లిదండ్రులో అయితే వాళ్ల గతి నిర్గతేకదా? నా మటుకు నాకు కట్నాలు—కట్నం పేరుతోనే తీసుకునేటప్పుడే హాయిగా వుండేమో ననిపిస్తోంది.


మరోవిషయమేమిటంటే పిల్లవేపువారు చచ్చీచెడి లాంఛనాలన్నీ జరిపినా తీరా అత్తారింట్లో వాళ్ళుమాత్రం మాట మాటకూ "మేం ఓ దమ్మిడీ కట్నంపుచ్చుకోలేదు తెలుసా?" అంటుంటారు ధీమాగా!

ఇంతకూ నే చెప్పేదేమిటంటే కట్నాల బిల్లయితే వచ్చిందిగానీ దాని ఫలితాలు మాత్రం వ్యక్తులమీద రకరకాలుగా పడుతున్నాయ్! మగపెళ్ళివారు లాంఛనాల పేరుతో వాళ్ళకు కావలసినవన్నీ తీసుకుంటున్నారు. ఇటువేపు పిల్లగలవాళ్లు అవన్నీ ఇచ్చీ కూడా ఏమీ ఇవ్వని వాళ్ళకిందలెక్క బడుతున్నారు దీనికంతకూ మూలకారకులు పెళ్లిచేసుకునే యువకులన్నమాట. వాళ్లుగనుక కాస వెనుక ముందు లాలోచించుకుని, అవతలివాళ్ల కష్టసుఖాల్ని గమనించుకు, తమచదువును సార్థకం చేసుకుంటే బావుంటుందిగానీ, చదువుకోనీ, జ్ఞానం తెలిసీకూడా వరకట్నం తీసుకోటంలేదు కాబట్టి, కానుకల రూపంలో ఆ మొత్తాన్ని మామగారిచేత కక్కించడం ఏమంత సబబు కాదు. అంతేకాదు—శక్తి, యుక్తివుంటే తమ జీవితావసరాలని తామే ముందు ముందు తీర్చుకోవచ్చుగదా? ఒకరిమీద నెట్టవలసిన అవసరంలేదు! మరలాంటప్పుడు ఈ లాంఛనాల బురఖా దేనికి? అంతేగాదు—మరిద్దరు నటీనటులుంటారు ఈ నాటకానికి...వాళ్లు పిల్లాడివేపు తల్లిదండ్రులన్నమాట! పరిస్థితుల కనుకూలంగా ఒకళ్ళకొకళ్లను వుపయోగించుకుంటుంటారు. ఎలాఅంటారేమో! "అమ్మా నాన్నా పూర్వకాలంవాళ్లుగదండీ. వాళ్లేదో అలకపాన్పుమీద నా వేలికి ఓ వుంగరమన్నా లేకపోతే ఎలాఅంటారు! పెద్దకాలపు వాళ్లు! స్వతహాగా నాకా కోరిక లేదనుకోండి! అయినా...!" అంటూ నసుగుతాడు పెళ్లికొడుకు హోదాలో పిల్లాడు. ఇదీ అతని పోరను.

"చూడండీ! పిల్ల బైరాగి! వాడూ-వాడి మంకు పట్టూను! ఈ కాలపు వాళ్ళు గదండీ మరి! మనం చెబితే వింటారా ఏమన్నా నా కొత్తకాపురం పెడితే. ఓరేడియో, ఫానూ, కాస ఫర్నిచర్ లేకపోతే ఎలా అంటాడు ఇదీ పిల్లాడి తల్లి తండ్రుల డైలాగు.

ఇలా మొత్తానికి ఎలా అయితేనేం అందరూ కలిసి పిల్లగలవాళ్లను తమాం ముంచి ఊరుకుంటున్నారు కట్నాల నిషేధ బిల్లు వస్తే బతికిపోతాం గదా అనుకున్న తల్లిదండ్రులకు ఈ కానుకల కిటుకు చంపేస్తోంది. కానుకలు కట్నానికి మారుపేరు అయ్యాయి కట్నపిశాచికి ఇది ఫాన్సీడ్రెస్ అన్నమాట బిల్లు వచ్చింతర్వాతకూడా కానుకల బంధా పిల్లాడి తలిదండ్రులను వుబ్బించేస్తోంది... అదే తేడా! చదువుకున్న ప్రతి యువకుడూ కాస నింపాదిగా ఆలోచించి అవసరమొస్తే అమ్మా నాన్నలను (ఈవిషయంలో) ఎదిరించి (మళ్లీ పూర్వకాలపు వాళ్లు, కనిపెంచిన అమ్మా నాన్నా లాంటి డైలాగులు చెప్పకుండా) ఎవళ్లకు వాళ్ళు ఆత్మపరిశీలన చేసుకుంటే ఈ వరకట్నాల సమస్య (అదే లాంఛనాల సమస్య) తీరిపోతుంది గాని— బిల్లులూ, చట్టాలూ, వ్యాసాలూ, వుపన్యాసాలూవల్ల ఉపయోగమేమీ లేదేమో!

★



పాప చూపు
ఫోటో: ఎ. లక్ష్మణరావు (తణుకు)

బాలసాహితి

అదృష్టం

కలడొక కుగ్రామంలో
గర్భదరిద్రుం డొక్కడు,
పూటకు కూటికి లేదు
పాటుపడని కడుసోమరి.

అసలు పేరు అచ్చయ్యే,
అందు రతని పిచ్చయ్యని,
కసరికొట్టి పొమ్మందురు;
విసుగులేక విరతిలేక

ఊరంతా తిరిగి అతడు
ఊరుకొనక కనిపించిన
తుక్కు తెచ్చి దొడ్డిలోన
చక్కబెట్టుకొనుచునుండు.

తుక్కుమాట దేవుడెరుగు,
ఒక్కనాడతండు తెచ్చి
పడవేసెను చచ్చిపడిన
పామును తన దొడ్డిలోన.

మతిపోయిందని ముందే
మాటలాడ రూరివారు.
చచ్చిన పామును చూచి
పిచ్చి అనిరి ఇంటివారు.

కాళ్లూ చేతులుకట్టి
గదిలో బంధించినారు.
జనమంతా ఊరికింక
శని తప్పిందన్నారు.

గ్రద్ద ఒకటి నింగిమీద
కడు వేగంగాపోతూ
పిచ్చివాని దొడ్డిలోని
చచ్చిన పామును చూచెను.

తన ముక్కున కఱచిపట్టి
కొనివచ్చిన మణిహారం
దిగవిడచి పామును తా
నెగరేసుకుపోయె గ్రద్ద.

హాయిగా భుజింప మెత్త
నైనపాము దొఱకెనంచు
విలువ తెలియనట్టి గ్రద్ద
విడిచిపుచ్చె మణిమాలను.

అచ్చయ్య కుటుంబంలో
అంతా చూచిరి హారం.
వింతపడి అచ్చయ్యను
విడచిరి తమ యిలవేల్పని.

అచ్చయ్యే అదృష్టం మన
కందరికీ పట్టెననుచు
కొంపలోనివారంతా
లెంపలేసికొని కొలచిరి.

అచ్చయ్యకాదు ఉత్త
పిచ్చయ్యను కొన్నవాడు
అచ్చయ్యేకాదిప్పుడు
అచ్యుతుడయ్యెను ఊరికి.

అదృష్టమంటే జగతిని
అగుపించనిదని అర్థము.
అది లేని మనుష్యుని బ్రతుకు
అంధకారమునబడి వ్యర్థము.

పిచ్చివాడు, కడుసోమరి,
పేదవాడు, పనికిరాని
అచ్చయ్యకు అదృష్టమే
తెచ్చెను సుఖ సంపదలను. ★

★ అకెళ్ల సుబ్రహ్మణ్యం ★

పూర్వం చైనా దేశంలో ఒక వైరిరాజు, వైరిరాణీ ఉండేవారు. వారి వివాహానంతరం చాలా రోజులకు, రాణీ ఆడపిల్లను ప్రసవించింది. రాణీ పుట్టిన బిడ్డనుచూచి "అయ్యో! దేవుడా! ఎంత చిన్నపిల్లనిచ్చావు," అంది "పట్టి చిన్నదేగాదే పిల్లకు పళ్లులేవూ తల వెంట్రుకలూ లేవు తప్పక ఈపిల్ల దయ్యాపు జాతిపిల్ల!" అన్నాడు రాజు. రాణీకూడా నిజమే నని రాజు చెప్పినదానితో ఏకీభవించింది.

కాని రాజు పరివారము, మిత్రులంతా అప్పుడే పుట్టిన బిడ్డలందరూ అలాగే వుంటారని చెప్పి "మహారాజా! యువరాణి విషయంలో కూడా ఎలాంటి భేదంలేదు అందరిలాగే జన్మించింది!" అన్నారు. కాని రాజు అందుకు అంగీకరించలేదు. "కాదు! ఆ పిల్లమీద ప్రేమచేత, జాలిచేత అలా అంటున్నారు మీరు. నాకు కళ్ళున్నాయి! ఈపిల్ల తప్పక దయ్యాపు పిల్లే!" అన్నాడు

రాజు, రాణీ రాజ్యంలోనివైద్యులందరిని పిలిపించారు వైద్యులతో "నాకు ఒక వింత ఆడపిల్ల కలిగింది. ఆ పిల్లకు దయ్యపు లక్షణాలు ఉన్నాయి నున్నటి రాగి చెంబులాంటి గుండు, పళ్లులేని బోసినోరు ఆ పిల్లకు మీ వైద్యులంతా చేరి అద్భుత ఔషధం తయారుచేసి పెద్దదాన్నిగా మార్చాలి మీ మందు పుచ్చుకొన్న మరో నిమిషానికల్లా పిల్ల మామూలు పిల్ల అంతకావాలి! లేదా మీకు కొరడా దెబ్బల శిక్ష తప్పదు!" అన్నాడు రాజు.

"మహారాజా! ఈ లోకంలో ఏ వైద్యునికి ఇది సాధ్యం కాదు," అన్నారు వైద్యులు ఏక కంఠంతో.

"ఏమన్నారు! అది చేతకాదంటారా! అందర్నీ చెరలో పెట్టిస్తాను! చెరలోకి వెడతారా! మందు తయారు చేస్తారా! ఏదో ఒకటి నిశ్చయించుకోండి," అన్నాడు కోపంతో రాజు


రాజుగారి మాటలకు వైద్యులు ఒకరి మొగము ఒకరు చూచు

"అర్జున్"

కొన్నారు. రాజుగారి శిక్ష తప్పుకోవడం అయ్యేదిగాదు.

మరి కొన్ని క్షణాలలో క్రోధాకారంగా "ఏమంటారు" అని రాజు అడిగాడు

వైద్యులలో ధైర్యవంతుడు, వృద్ధుడూ అగు వైద్యుడు ముందుకు వచ్చి "రాజా! క్షమించండి మీ ఉత్తర్వు కాదంటామా? మేము రాజకుమారి కొరకు ఔషధం తయారుచేయాలి," అన్నాడు.



పాకే పాపాయి

—ఫోటో ఎం విశ్వనాథం, కలకత్తా

"అలా చెప్పండి ఎక్కడుందా ఔషధం?" అన్నాడు రాజు

"ఇంకా తయారు చేయలేదు మహానుభావా! కొన్ని దినాలు పట్టుతుంది" అది తయారు చేయడానికి"

"చాలా దినాలా? చాలా దినాలెందుకు? నేను రాజుని నాకు సర్వసంపదలు కలవనే విషయం మరచిపోయారా? ఈ రాజ్యంలో ఏది కావాలో చెప్పండి! ఎంత త్వరగా తయారు చేస్తే అంత మంచిది" "మాకు వేరే చెప్పాలా మహారాజా! కాని మా ఔషధానికి కావలసినవల్లా 380 రకాలపువ్వులు, 847 రకాల మూలికలు, 25 రకాల నూనెలు అందులో పువ్వులు ప్రత్యేక లక్షణాలు కలవి కావాలి. 'విభజనగంధీ' అనే పుష్పము రెండేళ్ల కొకసారి ఒకే చెట్టుకు ఒకే పువ్వు పూస్తుంది ఒకచెట్టువే రెండు కావాలి ఇక నూనెలు ఒకొక్కటి నాలుగేళ్లుపడుతుంది ఇక లవణాల విషయంలో మాత్రము ఆ పరమాత్ముడికే తెలియాలి కొన్ని లవణాలు పరదేశాలనుండి తెప్పించాలి! అన్నీ చేయకుండా! ఇప్పుడు సాధ్యమా?" అన్నాడు తాపీగా.

"నిజమే! అయితే సత్వరం మొదలు పెట్టండి ఎంతలో ముగించగలరు" అన్నాడు రాజు.

"మా లెక్క ప్రకారం పధ్నాలు

గేళ్ల దాకా ఆ "దివ్య ఔషధం తయారుచేయడం సాధ్యం కాదు!" అన్నాడు యుక్తిగా.

"పద్నాలుగేళ్లే! అంతకాలమా!" అన్నాడు నోరు తెరచి రాజు.


"అవును రాజా! అమ్మాయిని మాసంరక్షణలోవుంచండి. పద్నాలుగేళ్ళలో చక్కగా మా ఔషధ ప్రయోగం చేసి పదిహేనవ ఏట ఒప్పగిస్తాం!" అన్నాడు వృద్ధుడు.

"సరే! రాణీకి చెప్పి కనుక్కొంటా"నని వెళ్లాడు రాజు.

"ఆదయ్యపుపిల్ల పోతేపోయింది. పద్నాలుగేళ్లు మన కళ్ల ఎదుటి నుంచి వెడుతుంది! ఏమంటావు? ఇచ్చేద్దామా? లేక కొరడా దెబ్బలు కొట్టించమంటావా!" అన్నాడు.

"పోనీయండి! పద్నాలుగేళ్లలో చేయలేకుంటే ఒకేసారి తల తీయించేద్దాం!" అంది రాణి.

వైద్యులు రాకుమార్తెను తీసుకొనివెళ్లి మంచి ఆహారం, విద్య చెప్పించి యుక్తవయస్సు వచ్చినతరువాత ఒకనాడు మంచి ముహూర్తం



నీవొక డిటెక్టివ్ అయితే!

"అందాలు చిందే ప్రకృతిలో, వికసించిన తామరపుష్పము, తళతళ మెరిసే నీరూ, తామర మొగలు, తామరఆకులు, ఆకాశాన పరుగెత్తే ఆ నీలిమేఘం, నిండుజ్యోతిలా ప్రకాశిసున్న ఆ పూర్ణచంద్రుడు, ఆహా! ఎంతందంగా వుంది అని అనుకుంటున్నారేమో! వాటన్నిటిలోనూ కొన్ని రహస్యమార్గాలు దాగివున్నాయ్!

అందుకనే దారితప్పిన నా చిటి పాపలజాడ తెలుసుకోలేక చింతిస్తూ తిరుగుతున్నా!

పద్మవ్యూహంలాంటి ఈ రహస్య మార్గాలలో సరియైనమార్గం ఏదో కనిపెట్టి నా చిన్నారిపాపలను నాకు చూపితే, నీవే మా పాలిట ఒక గొప్ప డిటెక్టివ్ అని సంతోషించి నా బంగారు చిట్టితల్లులు అయిదుగురినీ ఒకేసారిగా నీకే ఇచ్చి మహావైభవంగా పెండ్లి చేసివేస్తా, తెలిసిందా? ఏదీ త్వరగా ప్రయత్నించి చూడు అల్లుడా!

మీ అందాల అత్త
—సీతాకోకచిలుక.]

చిత్రరచన: శ్రీకృష్ణ.]

బ్రతుకు కథ

అనగనగా ఒకవూరు. ఆ వూరిపేరు వెన్నెలవాడ. వెన్నెలవాడల్లో ఒక యిల్లు. అందులో ఒక తల్లి తన రెండేళ్ల కొడుకుతో ఉంటూవుండేది. ఆ కొడుకు అన్నం తింటున్నప్పుడల్లా "అమ్మా కథ చెప్పవే" అని మారాం చేసేవాడు. ఎన్ని కథలని చెప్తుందాతల్లి? ఒకనాడు ఆవిడికి చెప్పడానికే కథా తోచ లేదు. చెప్పకపోతే కొడుకు అన్నం తినడు.

సరిగా అదేసమయానికి ఒకాయన వచ్చాడు. అతను దేశాటనం చేసి తిరిగి యింటికి పోతున్నాడు. వెన్నెలవాడ చేరేసరికి చీకటిపడింది. ఈ 'రాత్రప్పుడెక్కడికెళ్తాను' అని అతను ఒక అరుగుమీాదకి చేరేడు. ఆ యింట్లోనే తల్లి కొడుకు లుంటున్నారు.

కొడుకు కథ చెప్పమన్నాడు.

మందు మహిమ

చూచి ఆ పిల్లను రాజు ఎదుట వుంచి మహారాజా! మా ఔషధశక్తి చేత యువతిగా మార్చాం! ఇదుగోండి!" అని అప్ప జెప్పారు. చంద్రబింబంలాంటి ముఖములో బారెడు పొడుగున జడ, తెల్లటిపండ్లు కలిగిన కుమార్తెను చూసి రాజు, రాణి మురిసిపోయి, వైద్యులను చక్కగా సత్కరించి పంపారు. ★

(ఒక ఆంగ్ల కథ ఆధారంగా)

"ఏం కథ చెప్పను నాయనా, నా బతుకు కథ?" అని అందా తల్లి. పాపం! వాడికేం తెలుసు? అదేదో కథ కాబోలనుకుని, ఆ కథే చెప్పమన్నాడు. సరేనాయనా అదే చెప్తానని ఆవిడ కథ ప్రారంభించింది. కథ వింటూ అన్నం తినసాగాడు కొడుకు. అరుగుమీాద కూర్చున్నాయన కూడా ఆశ్చర్యంగా కథ వింటున్నాడు.

"లతిక"

"ఒకవూళ్ళో ఒక బ్రాహ్మడుండేవాడు. అతనికి ఒక తల్లి, భార్యా వుండేవాళ్లు. తల్లి పరమగయ్యాళి. పెళ్ళాం పరమసాధ్వి. అత్తమాటకిగాని, భర్తమాటకిగాని బదులాడి యెరగదు. కాని ఆవిడని ఆ అత్తగారు రాసిరంపాన పెట్టేది. ఏడువడపోతలుపోసి గంజిమాత్రం పోసేది కోడలికి."

కథ ఇంతవరకు విని కొడుకు అడ్డు తగిలేడు, "ఏడువడపోతలంటే ఏంటమ్మా" అని.

"అంటే గంజినీళ్ళలో పొరపాటునేనా అన్నం మెతుకుండి పోతుందేమోనని అన్ని వడపోతలుపోసి ఆ గంజిపోసేది అత్తగారు.

మళ్ళా కొడుక్కి సందేహం కలిగింది. "మరయితే అమ్మా ఆ బ్రాహ్మడేం అనేవాడుకాదూ తల్లిని?"

"లేదుబాబూ. అతనికి తల్లిదగ్గర భయం. పాపం అతనెంతో నొచ్చుకునేవాడు. కాని ఏం చేస్తాడు? ఇలా వుండగా ఆ కోడలు గర్భవతయింది. దానికి పప్పు, అన్నం తినాలని కోరిక కలిగింది. ఉండలేక మొగుడితో చెప్పింది. అతను ఎలాగైనా పెళ్ళాం కోరిక తీర్చాలని ఆలోచించి ఒక ఉపాయం పన్నేడు. తల్లిదగ్గరికి వెళ్ళి 'అమ్మా, యివాళ నాకు పప్పు అన్నం తినాలనుందే' అన్నాడు. 'అయ్యో అదేం భాగ్యంరా! తప్పకుండా అలాగే చేస్తా'నంది. అన్నం పప్పు వండింది. ఘుమఘుమలాడే నెయ్యి కాచింది. కొడుకుకి ఆప్యాయంగా వడ్డించింది. కోడలికి మాత్రం మామూలుగా గంజినీళ్లే పోసింది.

అన్నం కలుపుకుంటూ 'అన్నన్నా ఎంత పనయిందమ్మా' అన్నాడుకొడుకు. 'ఏంరా నాయనా ఏమయింది' అనడిగింది తల్లి. 'చెరువు దగ్గర స్నానం చేస్తూ, డబ్బు మరిచిపోయానమ్మా ఆలస్యమైతే ఎవళ్ళకంటన్నాబడితే, డబ్బు మనకి దక్కదు. నేను వెళ్లొస్తా'నని లేవబోయాడు. 'విస్తరిముందు కూర్చుని లేవకూడదు. నువ్వు తింటూవుండు నేను తెస్తా'నని తల్లి

వెళ్ళిపోయింది.

ఆ బ్రాహ్మడు పెళ్ళాన్ని పిలిచి తొందరగా అన్నం తినిపించ సాగాడు. తల్లి చెరువు కెళ్లిందని చెప్పేనుకదూ! అక్క డెంత వెతి కినా రూపాయిలు కనపడలేదు. అస లుంటేకదూ కనపడడానికి! దాంతో కోపంవచ్చి ఛర్రున యింటికొచ్చే సింది.

ఇంకేముంది? కోడలికి అన్నం తినిపిస్తున్న కొడుకుని చూసింది. 'అవ్వ అవ్వ' అని నోరు నొక్కు కుని, కొడుకుని కోపంతో యిల్లు వెళ్ళగొట్టింది. పాపం ఆ అమాయ కుడు 'ఛీ ఛీ నాదీ ఒక బతుకేనా? పెళ్లానికి కడుపునిండా అన్నం పెట్ట లేని వాణ్ణి" అని విచారిస్తూ వెళ్ళి పోయాడు. తనూ వస్తానంది అతని పెళ్ళాం. 'నే నెక్క డెక్కడికి తిరుగు తానో! నాతో నీ కెందుకీ తిప్పలు? ఉండిపో'మన్నాడతను.

కాని ఆవిడ వినలేదు. "మీరుండబట్టి నాకు గంజినీళ్ళైనా పోస్తున్నాది. మీరు వెళ్తే నాకు దిక్కెవరు? నేనూ 'వస్తా'నని అత నితో కూడ ఇల్లు బయలుదేరింది.

అలా వెళ్లగా వెళ్లగా రాత్రయే సరికి ఒక అడవి చేరుకున్నారు. అక్కడొక పెద్ద మర్రిచెట్టుంది. దానికింద పడుకున్నారిద్దరూను. కొంచెం సేపటికి వెన్నెలొచ్చింది. పెళ్ళాం పడుకున్న చోట వెన్నెల పడింది. అతను పడుకున్న దగ్గర చెట్టు చాటయింది కనక చీకటి వచ్చింది.

బాగా అలిసిపోయి వుందేమో ఆ ఆడకూతురికి యిట్టే నిద్దర పట్టే సింది. అతనుమాత్రం నిద్దరపో లేదు. కొంత సేపటికి లేచి పెళ్లాన్ని ఆ అర్థాన్న పుటడవిలో వదిలి ఎక్క డికో వెళ్లిపోయాడు.

అర్ధరాత్రప్పుడు ఆవిడకి తెలి వొచ్చింది. పక్కని మొగుడు లేడు ఎటుపోయారోనని చాలా సేపు ఏడ్చింది. వెఱ్ఱిగాని, ఏడిస్తే పోయిన వాళ్లొస్తారా? అలా ఏడ్చి ఏడ్చి అక్కడున్న ఇసకతో ఇల్లుకట్టింది."

కుతూహలంగా వింటున్న కొడుకును మళ్ళీ అడ్డు తగిలాడు. "ఏడుస్తూ కూచోక ఇల్లు కట్టడం యెందుకమ్మా" అని ప్రశ్నించాడు.

"విచారంతో మతి స్థిరంగా వుం డదు నాయనా! పిచ్చిగా ఆలో చిస్తూ యిల్లు కట్టింది 'ఇదే పెద్ద పట్నంకావాలి. ఇదే మా యిల్లు కావాలి. ఇవే సంపదలు కావాలి. ఇవే ధాన్యంకావాలి—' ఇలా కుప్పలుపోసి మళ్ళా పడుక్కుంది.

తెలివొచ్చేసరికి అడవీ లేదు. కుప్పలూ లేవు. తనొక పెద్ద భవం తిలో వుంది. కావలసినంత సిరీ సంపదా. ఆ ప్రదేశమంతా పెద్ద పట్నం అయిపోయింది. వెన్నెల కుప్పలు దేవుడి దయవల్ల పట్నం అయింది. ఆ పట్నం పేరే వెన్నెలవాడ."

కొడుకడిగాడు ఆ తర్వాతే మయిందమ్మా" అని.

"ఆ తర్వాత ఆ యిల్లాలికి చక్కదనాల కొడుకు పుట్టేడు. వాడు పెరిగి రెండేళ్ళవాడయేడు. నీలాగే తల్లిని రోజూ కథ చెప్పమనే వాడు."

"బలే బలే. బాగుందమ్మా. అయితే...మరి ఆ బ్రాహ్మడే మయాడు?" అని ప్రశ్నించాడు కొడుకు తెలియదంది తల్లి.

అరుగుమీద కూచుని కథ వింటున్న బ్రాహ్మణుడనుకున్నాడు, "ఈవిడ చెప్పిన కథ మా బతుకు కథలాగేవుంది. ఈవిడెవరు చెప్మా"

బ్రతుకు కథ

అని. ఇంతలో విస్తరి పారెయ్యడానికి ఆ తల్లి ఇవతలి కొచ్చింది. పరధ్యానంగావున్న అతనినిచూసి గుర్తు పట్టింది. బ్రహ్మానందం పొందింది. దగ్గరికి వెళ్ళి, "ఎంతసేపయింది మీరొచ్చి?" అనడిగింది.

"ఇందాకా వచ్చాను, నువ్వు కథ చెబుతూంటే," అన్నాడు.

"బాగుంది," అని పిల్లణ్ణి పిలిచింది. వాడొచ్చాడు. అరుగుమీద తల్లితోనున్న అతనిని చూసి "ఈయనెవరమ్మా" అనడిగాడు. బ్రాహ్మణుడు పిల్లడిని ఎత్తుకోబోయాడు. "నీకు కథలు చెప్పడం వచ్చా" అని ప్రశ్నించాడు పిల్లడు.

"ఓ చాలావచ్చు. మీ అమ్మ కథ చెప్పింది చూశావ్! ఆ బ్రాహ్మడు మళ్ళీ కొన్నాళ్ళకి వెన్నెలవాడొచ్చాడు. పెళ్ళాన్నీ, పిల్లడిని కలుసుకున్నాడు. అదీ కథ," అని పూర్తి చేసేడు తమ బతుకు కథ.

"ఈ కథ నీకూ వచ్చన్నమాట?" కొడుకు ప్రశ్నించాడు.

"ఇది కథ కాదు నాయనా. నిజంగా జరిగిందే. అందుకే మీఅమ్మ బతుకు కథ అంది దీన్ని. కథలో బ్రాహ్మణ్ణి నేను. నా పెళ్లాం మీ అమ్మ. నువ్వు మా చిట్టి తండ్రివి. ఇదీ మన బ్రతుకుకథ," అని కొడుకుని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడతను. "అత్తగారు వెళ్లగొట్టబట్టే మనకి సిరీసంపదా కలిగాయి. ఆవిడనికూడా తీసుకుర"మ్మంది భార్య. సరేనన్నాడతను. అంతా సుఖంగా వున్నారు. కథ కంచికి. మన మింటికి! ★

★ న్యూఢిల్లీ లేఖ ★

(5 వ పేజీ తరువాయి)

శ్రమాన్ని కొండంతలుగా వర్ణిస్తూ ప్రభుత్వ ప్రకటనలు ప్రచారమవుతున్నాయి. ప్రచారమయ్యేది ప్రభుత్వ కార్యక్రమాలైనా కాదు, మంత్రుల కార్యక్రమాలు. శ్రీమతి తారకేశ్వరీ సిన్హా ఇందుకొక ఉదాహరణ. ఈమె ఆర్థికశాఖలో చిన్న మొత్తాల పొదుపు విభాగానికి డిప్యూటీ మంత్రిణి. ఈమె పర్యటనకు బయలుదేరితే వెంట సమాచార శాఖకు సంబంధించిన సీనియర్ అధికారి ఒకరు ఉంటారు. ఈమె తన ఉపన్యాసాలలో రెండవ పంచవర్ష ప్రణాళికనుగూర్చి ఆవేశంతో ప్రచారంచేసున్నారు. ఈమె మాటలు మహా చిత్రంగా ఉంటాయి. విదేశీ ద్రవ్యాన్నిగూర్చి మద్రాసులో ఈమె ప్రసంగిస్తూ నేటి విదేశీద్రవ్యం కొరత సబబతవల్ల వచ్చింది కాదని, అభివృద్ధివల్ల ఏర్పడినదని అన్నారు. విదేశీ ద్రవ్యాభావంవల్లనే పరిశ్రమలకు కావలసిన ముడివస్తువుల దిగుమతులను కూడా తగ్గించుకోవలసి వచ్చింది. దిగుమతులను తగ్గించటంవల్ల పారిశ్రామికోత్పత్తి దెబ్బతినటం, నిరుద్యోగం వృద్ధికావటం ఒకవంక జరుగుతూనే ఉంది. ఇది అభివృద్ధి సూచన అని శ్రీమతి సిన్హాకు అనిపిస్తే అనిపించవచ్చునుగాని, కొత్తగా ఉద్యోగాలు పోగొట్టుకున్న వారికి మాత్రం ఇది పారిశ్రామిక స్తబ్దతకు సూచన అని అనిపించక తప్పదు. పారిశ్రామిక ఉత్పత్తి తగ్గటంవలన తప్పకుండా మాంద్యం ఏర్పడుతుంది.

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరోకు కలకత్తా, బొంబాయి, మద్రాసులాంటి ముఖ్యనగరాలలో ప్రాంతీయ కార్యాలయాలున్నాయి. డిప్యూటి ప్రిన్సిపల్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు అనబడే సీనియర అధికారులు ఈ కార్యాలయాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయాలద్వారా పని జరుపుకునే అవకాశమున్నప్పుడు న్యూఢిల్లీనుంచి ఇన్ఫర్మేషన్ అధికారులను మంత్రులవెంట పంపించటం ఎందుకో తెలియటంలేదు. దీనివల్ల ప్రజాధనం దండగకావటమేకాక, మంత్రులలో మంత్రులకు అసూయలు పెరగటం, ప్రధాన కార్యాలయంలో పని చెడిపోవటం జరుగుతుంది.

* * *

మతం నల్లమందులాంటిదని లెనిన్ అన్నాడు. భారతదేశంలో మంత్రులకు ప్రచారం నల్లమందులాంటిది. ఈ దేశంలో తప్పితే ఇంకేదేశంలోనూ మంత్రులు రోజూ వార్తాపత్రికల్లో పేజీలకు పేజీలు తమ అభిప్రాయాలతో, ప్రసంగాలతో నింపేయ్యరు సాధారణంగా ఈ అభిప్రాయాలు వ్యాకరణయుక్తంగానూ ఉండవు, యుక్తంగానూ ఉండవు. మితిమీరిన ఈ ప్రచారం వలన మంత్రులు తమకేమీ ఫరవాలేదని భీమా చేసినంత ధీమాగా ఉండటం జరుగుతుంది. ఈ దుర్భ్రమ శ్రీ ఎన్. వి. గాడ్గిల్ ఉదాహరణతో తొలగిపోవలసిందేగాని ఎందుకనో తొలగిపోలేదు. కేంద్ర ప్రభుత్వంలో శ్రీ గాడ్గిల్ అంతగా ప్రచారం చేయించుకున్న మంత్రి ఇంకొకరు లేరు. అయినా ప్రధాన మంత్రి శ్రీ గాడ్గిల్‌ను తన రెండవ ప్రభుత్వంలో చేర్చుకోకుండా వదిలేశారు. కిందటి ఎన్నికలలో వోటర్లుకూడా శ్రీ గాడ్గిల్‌ను వదిలేశారు. అందుచేత అనవసర ప్రచారంవల్ల జరిగే లాభం, ఒరిగే ప్రయోజనం ఏమీ లేదనీ, ఎంత నిరక్షరులైనా భారతీయ వోటర్లు మూర్ఖులు కారని స్పష్టమవుతోంది.

* * *

కనాట్ ప్లేస్ వరాండాలనుంచి చిలర వస్తువు లమ్ముకునేవారిని, ఊరికనే బైఠాయించే వాళ్లని తొలగించటానికై వాటిని పబ్లిక్ వీధులుగా పరిగణించటానికి న్యూఢిల్లీ పురపాలక సంఘం నిశ్చయించింది. ఈవార్త



శ్రీమతి పోతరాజు రుక్మిణి కృష్ణా రావుగారు బొంబాయినుండి న్యూయార్కుకు 7-7-58 తేది T. .W. A. విమానంలో వెళ్ళినారు.

పెద్ద పెద్ద శీర్షికలలో ప్రకటితమైనది.

భారత పరిపాలకులను ఒక దుర్బుద్ధిని జాడ్యంలా పట్టుకుంది ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక దురాచారాలను చట్టాలు చేసి, నిబంధనలు చేసి రూపుమాపగలమని పరిపాలకులు ఒక దుర్బుద్ధిమలో పడ్డారు.

ఉదాహరణకు వండిన పదార్థాలను మూతలు లేకుండా బజార్లలో అమ్మరాదని నిబంధనలున్నాయి. అయినా ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పక్కనా, మునిసిపల్ కార్యాలయాలకు కొద్ది దూరంలోనూ వండిన పదార్థాలను గాలికివదిలేసి అమ్ముతూ ఒక సైకిల్ వర్తకుడు కనిపిస్తాడు. సైకిల్ బండిమీద వస్తువులు పెట్టుకుని కొన్ని ప్రాంతాల్లోనే వర్తకం చెయ్యాలని న్యూఢిల్లీ సైకిల్ వర్తకుల ఫెడరేషన్‌తో ఒక ఒడంబడిక చేసుకున్నారు ఈ ఒడంబడికను కూడా వండిన పదార్థాలను మళ్లేనే గాలికి వదిలేసి సైకిల్ వర్తకులు న్యూఢిల్లీఅంతటా తమ విపణిని విస్తరింపజేశారు. కనాట్ ప్లేస్‌ను శుభ్రంగా ఉంచాలనే నిర్ణయంఅమోఘమైనదనటంలో సందేహం లేదు. కాని పబ్లిక్ వీధులుగా ఇదివరకే పరిగణింపబడి, అధికారుల అనుమతి లేకుండా చిన్నచిన్న కట్టడాలు కట్టుకుని నానా అంకభండాలమైపోయిన ఇతర ప్రదేశాల మాటేమిటో అని ప్రశ్న. ఆ ప్రదేశాలెక్కడున్నాయో పురపాలక అధికారులకు తెలియదా? తెలియకేం, తెలుసు. ఇండియా గేట్ దగ్గర్లో ఒక చిన్న సైజు నరకం ఉన్నది. అక్కడ తినుబండారాల వర్తకం ప్రతిరోజూ జోరుగా సాగుతూ ఉంటుంది. మునిసిపల్ ఉపనిబంధనలకు వ్యతిరేకంగా ఇళ్లలోగిళ్లలో నివసించే వేలాదిపశువుల మాటేమిటి?

కనుక చట్టాలకు కరువులేదు; వాటిని అమలుచెయటమే బరువుగా ఉంది అవి అమలుకాకుండా చూసే బాధ్యత పార్లమెంటు సభ్యులు, మంత్రులు తమ భుజాస్కంధాలపై వేసుకున్నారు.


మానవ కారుణ్యంపేరిట వీరు పరిపాలనలో అసమర్థతను వృద్ధిచేస్తున్నారు. పురపాలక సంఘం సిబ్బందిలో అవినీతి స్వయంగా కాకపోయినా పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారు.

జరుగుతున్నదిది: ప్రజల ఒత్తిడి మూలంగా పురపాలక సంఘం రోడ్ల పక్కన ఎవరూ నివసించకూడదని కఠిన చర్యలు తీసుకోవటం మొదలుపెడుతుంది. వెంటనే పార్లమెంటు సభ్యులలో మానవ కారుణ్యం పాలసముద్రంలా పొంగి పొర్లుతుంది. నిజానికి, మునిసిపల్ చట్టం ఉల్లంఘించే వారిని రక్షించటానికి మేమంటే మేమని కాంగ్రెసువారు, కమ్యూనిస్టులు, జనసంఘీయులు పోటీలు పడతారు. పబ్లిక్ రోడ్లమీద అధికారుల అనుమతిలేకుండా కట్టిన కట్టడాలను ఈ రాజ్యాంగ రక్షకులు కాపాడుతున్నారు. చట్టం దృష్టిలో అంతా సమానులేనని రాజ్యాంగం చెబుతున్నది. కాని ఢిల్లీలో చట్టంప్రకారం నడుచుకునే వారికే శిక్షపడుతుంది. చట్టం ఉల్లంఘించే వారికి ఏ శిక్షాపడదు. ఢిల్లీ ప్రజా ప్రతినిధులకు తమదేశంమీదకంటే తమ పలుకుబడి మీదనే మక్కువ ఎక్కువ అని దీని తాత్పర్యం.

ఇటీవల ఒక విచిత్ర సంఘటన జరిగింది. యమునానది మార్గం మారింది. ఇప్పుడది ఢిల్లీకి ఎడమై పోతున్నది. ఈ సందర్భంలో హోంశాఖలో మంత్రి శ్రీ దతార్ నదిలో పాలుపోసి పూజలు వగైరా జరిపారు.

మొదటిసందేహం: పూజచేసి నదీ మార్గాన్ని మార్చగలిగినట్లయితే నదుల మీద ఇన్నికోట్ల ప్రజాధనాన్ని ఎందుకు ఖర్చుచేయటం? శ్రీ దతార్ వీలుచూసుకుని వెంటనే కోసీ నదికివెళ్ళి పూజచేసి దాని మార్గాన్ని మారిస్తే వరదలబాధ నుంచి బీహారును రక్షించిన వారవుతారు.

రెండోది:—భారతదేశం మతాతీత రాజ్యం. ఒక్క ప్రధాన మంత్రిని మినహాయిస్తే రాష్ట్రపతి దగ్గర్నించి యావన్మందీ ఈ దేశంలో బ్రాహ్మణమతాన్ని ప్రచారం చేస్తున్నవారే శ్రీ దతార్ తనంతట తనుగా ఏ పూజ చేసినా ఎవరికీ అభ్యంతరం లేదు. మంత్రిగా ఈ తతంగం అంతా చేయటమే బాగాలేదు. శుభ్రమైన పాలు యమునపాలు చేస్తూండగా ఆయన ఫోటోలు తీయించుకున్నారు. వాటిని ఢిల్లీ పత్రికలు బాగా ప్రకటించాయి. యమునలో పారపోయటానికి పాలున్నాయిగాని సరియైన పోషణ లేని వేలాది చిన్న పిల్లలకు పోసేందుకు పాలు కరువైనాయి. ఇది భారతదేశం మార్కు సామ్యవాదం! ★



న్యాయమూర్తి: ఈ నేరంలో ముద్దాయి ప్రదర్శించిన అద్భుతమైన సాహసం,...చాకచక్యం...

ముద్దాయి: మహా ప్రభువులు! అంతగా పొగడకండి బాబయ్యా...

సినిమా

★ చిత్రాలూ, చైత్రాలూ ★

నిడుపు ఎక్కువ అని దేశీయ చిత్రాలు చూడ నిరాకరించేవారి సంఖ్య ఎక్కువ అవుతోందని తమిళదర్శకుడు నటుడు, ఎస్. బాలచందర్ ఒక సభలో అన్నారు. పల్లెటూళ్ళ మాట ఎలావున్నా నగరాలలో వారంతా తరుచు ఈ కారణంమీదనే ఇంగ్లీషు సినిమాలకు వెళ్తున్నారని ఆయన చెప్పారు.


పల్లెటూరివాళ్ళు, నెలాళ్ళకోసారి సినిమాకి వస్తారనీ ఆ వచ్చినపుడు చిత్రం 18 వేల అడుగులకు తగ్గితే వాళ్ళకు రుచించదనీ, అనుభవజ్ఞులైన పెద్దలు కొందరు వాదిస్తారు.

బాలచందర్ ఈ వాదాన్ని అంగీకరిస్తూనే మధ్యేమార్గంగా ఒక సూచన చేశారు. అది: ఇరవై వేల అడుగుల ఫిలిం ఒకటి తీసేబదులు, పదివేలవి రెండు తియ్యవలసిందని. పల్లెటూరి ప్రేక్షకులకు ఈ రెండూ చూపించాలనీ, నగరాలలో ఒక చిత్రం చూపించి, దానివెంట వార్తాచిత్రం, డాక్యుమెంటరీ చూపితే సరిపోతుందనీ, ఇవికాక వాణిజ్య ప్రకటనలకు చెందిన ఎనభై తొంభై అడుగుల చిత్రాలు అరడజను ఎలాగా ఉంటాయనీ ఆయన వివరించారు.

ఊహ చాలా మంచిదేనా, ఆచరణలో పెట్టేసరికి సమస్యలు చాలా ఎదురై పలకరిస్తాయని దీనిమీద ఒక నిర్మాత వ్యాఖ్యానించారు. ఇరవైయేళ్ళ పెళ్ళికొడుకు బదులు పదేళ్ళ వాళ్ళిద్దర్ని కటబెట్టమన్న సామెతనుకూడా ఆయన ప్రయోగించారు. సామెత ముతకగా ఉన్నా, కొందరికి మెతిక అనిపించినా, మొత్తానికి, బాలచందర్



ప్రభావారి 'ఆడపెత్తనం'లో సూర్యకళ, కన్నాంబ, రేలంగి.



తిరుమలావారి 'సమాజం'లో జగ్గయ్య, గిరిజ.

సూచనలో ఆలోచించతగ్గ సాధక బాధకాలు రెండూ ఉన్నాయనడానికి సందేహం లేదు.

20 వేల అడుగుల చిత్రం ఒకటి తీయడానికి పెట్టే ఖర్చులనూ పడే శ్రమనూ రెండుతోనో మూడుతోనో హెచ్చవేస్తే తప్ప పది వేల అడుగుల చిత్రాలు విడివిడిగా తయారు కావు, వేరే నటులు, వేరే కథ, కమామీషూ అన్నీ వేరే.

తీరా ఇంతా శ్రమ పడడం దేనికి? నగరాలలో ఉన్న విద్యార్థులకోసమే కదా? మనకి ఎన్ని నగరాలు ఉన్నాయి. ఆంధ్రకు హైదరాబాదు, మద్రాసుకు మద్రాసు. మిగతా పెద్దబస్తీలలో ఉండేవాళ్లు చాలా మంది చిన్న చిత్రాలు రావాలని ముచ్చట పడినా, ఆ బస్తీలలో సినీమాలను పోషించేవాళ్ళు, ఎక్కువగా చుటుపక్కల పల్లెటూళ్ళవాళ్లే. అంచేత ఈ పథకం అక్కడ లాభం లేదు. లేదా, చిత్రం త్వరగా తెమిలిపోవాలనుకున్నవాళ్లు ఒక చిత్రంచూచి, లేచిపోవాలన్న మాట మొత్తానికి, తేలేది, ఏదో ఒక్క నగరంలో కొంతమందికోసం అని, చిత్ర నిర్మాణ యజ్ఞం రెండుసార్లు చెయ్యాలా అని, ఈ పథకం విమర్శకులు అంటున్నారు

బాలచందర్ పథకం హఠాత్తుగా రేపొద్దుటనుండి అమలుజరపడం అతిసులభమైనపని ఏమాత్రం కాదు; కాని, ఆయన సూచనలో అసలు సమస్య సహృదయంతో పరిశీలించతగినది. పద్దెనిమిది వేలకు తగ్గితే పల్లెటూరివాళ్లురారు అన్నది శాశ్వత సత్యం కాదు. పరిశ్రమలో యావన్మందీ సమాలోచించుకుని, ఒక నిర్ణయానికి వస్తే (ముడి ఫిలిం 'కట్' కట మూలంగా 15 వేలకు దిగినట్టు) అన్ని చిత్రాలూ చిన్నవిగానే తీస్తే ఈ సమస్య రాదు.

రెండున్నర గంటల వినోదం కోసం హంగులన్నీ ఒక్క కథలోనే బిగించేబదులు, కథని కథ పట్టు చెడకుండా తీసి, హాస్య ప్రధానం చిత్రాలూ, సంగీత ప్రధాన చిత్రాలూ చిన్న చిన్నవి విరివిగా తీసుకుంటే అటు మంచికథా చిత్రాలూ ఇటు చక్కని చిన్న చిత్రాలూ కూడా ఉంటాయి. వీటిని ఎన్ని సార్లేనా ఏ చిత్రంతోనైనా కలిపి వాడుకోవచ్చును.

అందరూ ఒక మాటమీద నిలిస్తే, చిన్న చిత్రాలు తియ్యడం అంతమంచిపని లేదు అని మన ప్రముఖ నిర్మాతలు పలువురు వ్యక్తిగతంగా అభిప్రాయం వెలిబుచ్చుతున్నారు. దీనివల్ల ఖర్చు కలిసివస్తుంది. శ్రమ, కాలం కలిసివస్తాయి. నటులకు తీరుబాటు దొరుకుతుంది చిత్రాలు బాగుపడతాయి.

నిజానికి యీనాడు వస్తూన్న [illegible] చిత్రాలు సవ్యంగా ఉండకపోవడానికి ఎవరి అసమర్థతా కారణం కాదు; కథకు మించిన నిడివే. కథలు చిన్నవైనందువల్ల, వాటిని సాగదీస్తున్నారు. అందుకనే చిత్రాలు 'చిత్రాలు' అవుతున్నాయి.

అందుకే అవి పురిలేని దారాలై పోతున్నాయి. సర్వ దుఃఖాలకూ జన్మమే మూలకారణమని వెనకటికో మహనీయుడన్నాడు. సినీ పరిభాషలో, సర్వ కష్టనష్టాలకూ నిడివే కారణమని చెప్పుకోవచ్చు ★

చిత్రసమీక్షలు:

జలరుహావారి 'రాజనందిని'

జలరుహావారి తొలి జానపదచిత్రం 'రాజనందిని' సర్వాంగ సౌష్ఠవంగా రూపొందింది, రంగులు తక్కువగా, సీమ నుండి వచ్చే 'కాస్ట్యూమ్' చిత్రాలకు అన్ని విధాలా దీటయినదనిపించుకుంది. వాటికీ దీనికి, తేడా శాస్త్రిగారి జాను తెనుగు.

కథాసంవిధానం, నృత్య సంగీత ప్రయోగం నటన, సంభాషణలతీరు. అలంకరణ, దానిని రాణింపుకు తెచ్చిన ఛాయాగ్రహణం మొదలైన అంగోపాంగాలన్నీ అందంగా, అపశ్రుతులు లేకుండా కలసి అమరాయి. సింఫనీలో వాద్యాలలా ఒకదాని కొకటి ఉపశ్రుతిగా పలికేలా వీటి కలయికను హృద్యంగా సముచిత స్థాయిలో సమకూర్చిన దర్శకుడు వేదాంతం రాఘవయ్యగారు అభినందనీయులు.

'రాజనందిని' చిత్రం అక్కడక్కడ క్రింది మెట్టుమీదికి దిగిపోయినా, మొత్తంమీద తారస్థాయిలో, ధాటీగా, ధీమాగా అంగలు వేసుకుంటూ సాగి, మొదటినుండిచివరదాకా రక్తకట్టింది. చివర, మనమనసుకు హత్తుకుపోయే వ్యక్తులు ముగురు మళ్ళీరమ్మని చెబుతారు. వాళ్ళు: అంజలీదేవి నటించిన రమణి, మహంకాళి వెంకయ్య దొంగలదొర జి. వరలక్ష్మి విమల. వీరు కాక, "ఈ అహంకారి నిన్ను క్షమించ లేదు" అంటూ తన తప్పును రాచరీవితో ఒప్పుకుని, హుందాగా చనిపోయిన తిరుమల నాయకుడి (రాజనాల)పాత్ర గొప్పగా ఉంది.

నిజానికి ఇదొక్కటే కాక, ఇందులో అందరినీ అంత రీవిగానూ జీవించ నిచ్చినందువల్ల చిత్రానికే అరుదైనరీవి అబ్బింది.

భూపతిఅనే దొంగల నాయకుడివల్ల తన ప్రజలు నానాక్షోభా పడుతున్నారనీ, ఆ దండుకు, పొరుగురాజు తిరుమలనాయకుడి మద్దతువున్నదనీ తెలిసికూడా, రామరాజు ఆత్మగౌరవం, రాచరీవి పేరిట నాయకుడి చెలిమి అర్థించడానికి అంగీకరించడు యువరాజు జయచంద్రుడు నచ్చచెప్పిన కొద్దీ ఆయన కోపం హెచ్చిపోతుంది. ఇలా సంఘర్షణలో చిత్రం ఆరంభమవుతుంది తరువాత జయచంద్రుడు స్వతంత్రించి, పొరుగు పరగణా వెళ్తాడు నాయకుడితో సంధికి. ఈ వైనాన్ని దొంగలదొర భూపతి పసిగడతాడు.

"రాజులిద్దరూ ఏకమైనారో—" అంటారు భూపతి కుడిభుజం కిరీటి; అతని బహిఃప్రాణం, భూపతికూన అయిన రమణీను. -కోట పట్టుకోవాలని సూచించి.

"ఔ లెస్స—" అంటాడు అయ్యదొర భూపతి దొంగలు కోటను పట్టుకుంటారు. తిరుమల నాయకుడిని చంపివేస్తారు. నాయకుడి కూతురు శ్రీదేవిని, ఆమెదాది విమలనూ శ్రీదేవివలచిన జయచంద్రుడినీ బందీచేస్తారు. కాని జయచంద్రుడు, మామూలు సినీ కథలలో హీరోలా 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' రకం మనిషి కాడు. తొందరపడి డ్యూయెట్ లు పాడడు. నెమ్మదిగా, మనిషి తాహాను అర్థం చేసుకుని, ఆమెమీద గౌరవం కలిగిన మీదట, వాత్సల్యం పెల్లుబికిన మీదట ("నీకెవరూ అన్యాయం 'చెయ్యలేరు' రమణీ" అంటాడతడు) రమణిని ప్రేమిస్తాడు.

రేలంగి, మంచి హాస్యంచేస్తూ, సమస్యను పరిష్కరించడానికి మార్గాలు చూస్తున్నా అందరూ బందీలుగా ఉన్న ఆ సెల్లో జి. వరలక్ష్మి కొంచెం కారెక్టర్ యాక్షన్ చేసి, నిండుకొలువులో భూపతినిచంపేస్తుంది. రమణి దొంగలదొర కూన అయినా, దొరసాని బుద్ధిగల మనిషి. విమలచేసిన అకార్యంలో ఆంతర్యం, న్యాయం గ్రహించి, గొప్ప ఔదార్యంచూపి, విమలను క్షమించి శ్రీదేవికి రాజ్యం ఇచ్చివేస్తుంది. అంతే కాదు; విమల ఫ్లాష్‌బాక్‌లో తనకథ ఏకరువు పెడితే, అంతా ఓపిగా వింటుంది "ఇప్పుడిది ఎందుకు చెప్పినట్టూ?" అని మాట



'ఆడపెత్తనం'లో రేలంగి



20 ఏళ్లనాడు బే.బీ షెర్లి టెంపుల్ గా అందరికీ అభిమాన పాత్రురాలైన బాలనటి ఇప్పుడు టెలివిజన్ ప్రదర్శనాలలో నాయిక పాత్రలు ధరిస్తోంది. 'లెజెండ్ ఆఫ్ స్లీపీహాలో' అనే నాటకంలో జాన్ ఎరిక్ సన్, జూల్స్ మున్షిన్, షెర్లీ టెంపుల్, బారిస్ కార్లాఫ్.

మాత్రం కూడా వినుకోడు. ఈ మంచితనం, గొప్పబుద్ధిమాచి, జయచంద్రుడు ముగ్ధుడై, ఆమెను పెళ్లాడుతున్నటు ప్రకటిస్తాడు. చిన్నమనసుగల, ఆ ఉన్న కొస్తా జయచంద్రుడికి ఇచ్చుకున్న, పెద్దమనిషి పట్టమహిషి శ్రీదేవి కంట ఇది కంటకం అవుతుంది; రమణికి తను హీరోగా రమణీయ స్వప్నాలు అల్లుకున్న కిరీటికీ ఆశాభంగం కలుగుతుంది. అందువల్ల ఆయిద్దరూ ఈ యిద్దర్నీ వేరుచేసి చెరొకర్నీ పెళ్లి చేసుకోవాలని కుట్ర చేస్తారు. శ్రీదేవి, తన ప్రాణదాత రమణిని చంపబోయి, కన్నతల్లికన్న మిన్నగా పెంచి పెద్దచేసిన విమలను చంపివేస్తుంది. రమణితో జయచంద్రుడు తనయింటికి వెళ్లేసరికి, ఆమె మీద హత్యానేరం ఆరోపించి శిక్ష వ్రాస్తుంది రామరాజును. (తండ్రికొడుకుల ఘర్షణ ఘట్టంలో గుమ్మడి స్మరణీయమైన నటన ప్రదర్శించాడు.) తత్ఫలితంగా, అక్కడ తిరిగి నాయికా నాయకులు వేరు కావడంతో, పతాక సన్నివేశం ఆరంభం అవుతుంది. మహాబలిపురం కొండలమీద తరమడం, కత్తియుద్ధం ముష్టియుద్ధం మొదలైనవన్నీ భారీఎత్తున జరుగుతాయి. 'మనసంగతి తడో పేడో తేల్చుకుందామ'ని యుద్ధానికి సిద్ధపడ్డ కిరీటిముక్కలో మనసుమార్చుకోవడం వల్ల యుద్ధం కొంచెం ఎక్కువసేపు జరుగుతుంది. అయినా బాగుంది. టి. వి. రాజు ఆ

'రాజనందిని'

నటులు: ఎన్. టి. రామారావు, అంజలీదేవి, జి. వరలక్ష్మి, గిరిజ, కృష్ణకుమారి, రాగిణి, రేలంగి, గుమ్మడి, రాజనాల, ఆర్ నాగేశ్వరరావు, మహంకాళి వెంకయ్య, కె. వి. ఎస్. శర్మ, బొడ్డపాటి కృష్ణారావు, రావులపల్లి సత్యం, ఎస్. వి. జగ్గారావు.

కథ, మాటలూ పాటలూ మల్లాది రామకృష్ణశాస్త్రి, సంగీతం టి. వి రాజు, నేపథ్య గాయకులు జిక్కి, సుశీల, లీల, ఎ ఎం. రాజా, పి. నాగేశ్వరరావు, ఎం. ఎస్. రామారావు. నృత్యాలు వెంపటి సత్యం.

ఛాయాగ్రహణం రెహమాన్, ప్రసాద్, సి. నాగేశ్వరరావు, కళ తోట, సెట్స్‌నిర్మాణం వెంగయ్య, కూర్పు ఎస్. ఎస్. ప్రకాశం.

స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వేదాంతం రాఘవయ్య. నిర్మాత ఎం. జగన్నాధరావు. నిడివి18000, స్టుడియో వీనస్.


మూడు మైళ్ల జానపద సీమ

ఘట్టంలో మంచి నేపథ్య సంగీతం వినిపించారు.

ఇది లేనిచోట్ల కూడా రామకృష్ణ శాస్త్రిగారి జానపదపదాల నాదం పదివాద్యాల పెట్టుగా శ్రుతిమధురంగా వినిపించింది. ఈ చిత్రంలో సంభాషణలకు కండపుష్టి ఉంది. అర్థపుష్టి ఉంది. వాటిని మనం ముట్టుకోవచ్చు. పట్టుకోవచ్చు. వాటి సౌరభాన్ని ఆఘ్రాణించి ముగ్ధులంకావచ్చు. పాటలు కూడా సొగసు, హొయలుతో ఒప్పి అలరిస్తాయి. టి. వి. రాజుగారు చక్కని వరసలు కట్టారు. "నీమీద మనసాయెరా" అనే పాట, సుశీలగాత్రంలో పట్టుదారంమీద ముత్యాలలా ప్రవహించి స్వరాలా, అక్షరాలాకూడా మధురంగా వినిపించింది.

ఈ చిత్రం నటవర్గంలో కృష్ణకుమారి పేరు చూచి ఉంటారు. ఆమెకు పోర్షను లేదు అనుకుని కూడా ఉంటారు. అది పొరబాటుకాదు. కాని ఆమె ఇందులో చాలా మంచి నృత్యం ఒకటి చేసింది. మొలనూలు వగైరాలు సహా, ఆమెను రాజకుమారుడి కథలలో వర్ణకిలా ముస్తాబు చేశారు. నృత్యం, దానికి ఆలంబనమైన పాట కూడా చాలా బాగున్నాయి. వినోద ప్రధానమైన ఈ చిత్రానికి అది మంచి ముక్తాయింపు.

అసలు సిసలైన జానపద సీమలో, అద్భుతాలూ సాహసాలూ చూస్తూ, మంచి పాటలు వింటూ, నృత్యాలు చూస్తూ మూడు మైళ్ళు షికారుచేసి రావడానికి అన్ని విధాలా యోగ్యమైన మార్గం ఇది. ★



ప్రధాని సువర్ణపతకం అంగకున్న బాలచిత్రం 'హంపంచీ ఏక్ డాల్ కే' నిర్మాత శ్రీ మెయ్యప్పన్‌కు గత వారం మద్రాసు చలనచిత్రాభిమానుల సంఘం సన్మానం చేసింది (ఎడమనుండి:) శ్రీయుతులు ఎస్. బాలచందర్, ఎస్. ఎస్. వాసన్, మద్రాసు ముఖ్యమంత్రి కామరాజ్, శ్రీమతి అమ్మస్వామినాధన్, శ్రీ మెయ్యప్పన్.

ఎం. ఎ. వి. వారి 'ముందడుగు'

"ఇది ఆత్రేయ సబ్జెక్టూ, జగ్గయ్య పిక్చరూను" అన్నారొక సినీ మనీషి 'ముందడుగు' (ఎం. ఎ. వి. పిక్చర్స్) చిత్రం చూశాక. ఇది 'ఫిలిం హాలం'లో వినబడే జానుతెనుగు. అయినా తాత్పర్యం దుర్భేద్యం, దురూహ్యం కాదు. ఇటువంటి కథలు ఆత్రేయకు అభిమాన వస్తువులనీ, ఇటువంటి కథలలో ముఖ్య పాత్రలను జగయ్య చాలా బాగా ఒప్పించి నమ్మకం కలిగించగలడనీ ఆ యిద్దరూ ఇందులో ప్రవీణులనిన్నీ పైపెచ్చు మనీషి హృదయం ఇది పసిగట్టడానికి మనం, కాశీమజిలీ కథలో రాకుమారుడు పంజరంలో చిలక చిరునామా కోసం చేసేటంత ప్రయత్నం చెయ్యనక్కరలేదు. ఒకసారి ఈ చిత్రం చూస్తే ఈ యిదరిమీదా మనకీ గౌరవం పెరుగుతుంది. అయితే అప్పుడుకూడా, ఎవరికి అలవాటైన భాషలో వారు, 'ఇది ఆత్రేయ సబ్జెక్టూ జగ్గయ్య పిక్చరూ' అనే అనుకుంటారు. మరో విధంగా అనుకోవడానికి ఈ చిత్రకథ సదుపాయం చెయ్యదు. ఇది 1958 మార్కు డైలాగూ చొక్కా తొడుక్కున్న కాశీమజిలీ తరహా వచ్చటికథ; తియ్యటి కల.



రేలంగి వెంకటరామయ్య ఇటీవల హైదరాబాద్ వెళ్ళినప్పుడు వీడ్కోలు చెప్ప వచ్చిన "సినీ ఫూన్స్ రెంట్స్ గిల్" సభ్యులు సునీల్ కుమార్, రమేష్ కుమార్ బృందం.

అయితే ఈ కథకు నవదర్శకుడు కృష్ణారావుగాని, మాటలపాటల రచయిత ఆత్రేయగాని, ముఖ్యపాత్ర ధరించిన జగ్గయ్యగాని బాధ్యులు కారు. కథ బలీయమైతే ఎవరూ

ముందడుగు

నటులు జగ్గయ్య, జానకి. గిరిజ, హేమలత, సీత, ఆర్. నాగేశ్వరరావు, చదలవాడ కుటుంబరావు బాలకృష్ణ, వల్లం నరసింహారావు మహంకాళి వెంకయ్య.

మాటలు, పాటలు: ఆత్రేయ సంగీతం కె. వి. మహదేవన్. నేపథ్య గాయకులు జానకి, జమునారాణి సరోజిని, పిఠాపురం నాగేశ్వరరావు, ఎం. ఎస్. రామారావు.

దర్శకుడు: కృష్ణారావు, నిర్మాత ఎం. ఎ. వేణు. నిడివి 15,000 అడుగులు.

అమావాస్యమీద చందమామ


ఎదురు తిరగలేరు. అందులోను బాక్సాఫీస్ హిట్ అయిన కథ మరీ బలీయం. 'ముందడుగు', పూర్వజన్మంలో 'ముదలాళి' (యజమాని) అనే తమిళ చిత్రకథ. తెలుగు దర్శకుడు కృష్ణారావు, చిన్న నటులలో ఆ కథను చిత్రంగా తీసి, తమిళనాట విశేష జనాదరణ పొందారు కొస్త్యం చిత్రాలకన్న గొప్పవిజయం సాధించిందది. ఇప్పుడు అదేకథను, దాదాపు యథాతథంగా తెలుగులో మళ్ళీ తీశారు. ఇలాటి కథలు ముఖ్యంగా ఈ ఫ్యాక్టరీ సమస్యల కథలు — నాటకాలు అయినా నవలలయినా సినిమాలయినా, సమస్యలగురించి ఒక్క ఘడియ వర్ణించి, ఘాటుమాటలలో చప్పట్లు కొట్టించి అక్కణ్ణించి మెల్లిగా అబద్ధాలలాంటి ఆదర్శాల స్వర్గసీమలోకి వెళ్ళిపోతాయి. అక్కడ, ఈ సమస్యమీద ఆసక్తులైన వాళ్ళకి అమావాస్యమీద చంద్రుణ్ణి వెలిగించి చూపి జోలపాడి జోకొడతాయి. అందువల్లనే శ్రామికులూ పారిశ్రామికులూ కూడా ఈ తరహా కథలను గట్టిగా పట్టించుకోరు రచయితలూ నటులూ సమస్యలను పరిష్కరించి తీరాలని ఎవరూ శాసించరు; చిత్రించగలిగితే చాలు. కొంగల కార్యం గంధర్వుల భారం అనుకోవచ్చు. 'ముందడుగు, దర్శకరచయితలూ, నటుడూ కూడా కథ అవధులూ, స్వరూపం అవగతం చేసుకొని, తమ విధులను, ఉన్నంతలో వీలైనంత సామర్థ్యంతో నిర్వర్తించారు దర్శకుడు కృష్ణారావు మామూలుగా ఈ రకం సినిమాలలో కనబడే బాక్సాఫీస్ జిత్తు సన్నివేశాలు రానివ్వలేదు. ఆత్రేయ కూడా అంతే. సాధ్యమైనంతవరకు సహజంగా కనిపించేలా కథను చిత్రించారు. హీరోని తప్ప మరెవ్వర్నీ భూతద్దం క్రింద




'పగున్' హిందీచిత్రంలో మధుబాల

నిలబెట్టలేదు. 'తనతో తాను'లు రెండు తానులపాడుగున్నా, పాత్రలన్నీ 'తనగురించి తాను'లు చెప్పుకున్నా మొత్తంమీద కథ చిత్రణ పోయిగా, సాఫీగా సాగింది. కామెరా చైతన్యవంతంగా తిరిగి, సన్నివేశాలను స్వచ్ఛంగా కొత్తగా చూపించింది. ముఖ్యంగా జానకి, జగ్గయ్యల ప్రణయ సన్నివేశాలను చూడ ముచ్చటగా, ఆహ్లాదకరంగా చిత్రించారు. వాళ్ళిద్దరూ కూడా, ఆత్రేయ సంభాషణలంత అందంగా సరదాగా నటించి అలరించారు. యుగళగీతాలు కూడా పాత్రోచితమైన భావలో రమ్యంగా రూపొంది, వినసొంపైన స్వరాలలో వినిపించాయి.

ఇందులో మెచ్చతగ్గ నటన ప్రదర్శించినవాడు ఆర్. నాగేశ్వరరావు. ఈయన నటించిన పినీదుష్టుడి పాత్ర సహజంగానూ, సొగసుగానూ కూడా ఉంది. ఇతర నటులు కుటుంబరావు, సీత, నరసింహారావు, హేమలత, కథోచితంగా పాత్రలు నిర్వహించారు. హేమలత తన అసలు కొడుకెవరో తెల్సుకోలేక క్షోభపడ ఘట్టంలో మంచి నటన ప్రదర్శించింది. లావుపాటి పుస్తకం చదువుకోగలపాటి చదువుకుని, పెద్ద ఫ్యాక్టరీకి అధిపతిని అయి ఉండికూడా పెల్లెగ్రామ్య భావనగురించి తెలియని మనిషిగా చూపించడంవల్ల ఇతరభాగాలలో ఆమె బాగా నటించినా, రాణించలేదు. కాని కథకు ఇది ముఖ్యం. కథలో ఫ్యాక్టరీ అధిపతి మరణించాడు. ఈమె కొడుకు అమెరికాలో ఉన్నాడు. ఈమె పెత్రిబాగుంది. ఈ అలుసుచూసుకొనే మానేజరుగిరీ చేస్తున్న దుష్టుడు నాగేశ్వరరావు కార్మికులను హింసించి, వంచించి డబ్బు తినేస్తూ ఉంటాడు. అమెరికానుండి తిరిగివస్తున్న యువరాజు జగయ్య బొంబాయిలో దిగీదిగుతూనే బీదవాళ్ళ కష్టాల కథ ఒకటి విని, నొచ్చుకుని, పరిస్థితులు మార్చాలన్న ఉత్సాహంతో మారువేషంలో స్వగ్రామం వెళ్ళి తన ఫ్యాక్టరీలోనే కూలిగా చేరుతాడు. అక్కడ తోటి కూలీల కష్టాలు కనివినీ మానేజరూ, తన కాబోయే ఇల్లాలూ డబ్బు


నేషనల్ ప్రొడక్షన్స్‌వారి 'అంతా పెద్దలే' చిత్రం డబ్బింగ్ ఆరంభమైన సందర్భంలో తీసిన చిత్రం. కుడి చివర ఉన్నవారు సంగీత దర్శకుడు సుబ్రహ్మణ్యంరాజు.



జలరుహావారి 'రాజనందిని'లో జి. వరలక్ష్మి, గిరిజ, అంజలీదేవి, రామారావు.

కోసం చేస్తున్న అఘాయిత్యాలు తెలుసుకుని రెండు మూడు రీళ్లు బాధ పడతాడు. ఆతరవాత, ఒక కూలిపిల్లను వలచి వలపించు కుంటాడు. బీదదైతే నేంగాక ఆపిల్ల బాగుం టుంది. నీలుకుబట్టలూ అవీ కట్టుకుని మంచి హెయర్ స్టయిల్ మేకప్ వగైరాలతో చక్కగా ఉంటుంది. హీరోకూడా మాసిపోయిన గాబర్డిన్‌లూ, శేయాకాలు తొడుక్కుంటాడు. సరే ఆ యిద్దరూ తీయని యుగళగీతాలు పాడుతూ రెణ్ణెల్లు (లేక పదిరీళ్లు) కాలక్షేపం చేశాక, జగయ్య లీలాతీతమైందని అసలు వేషంలో ఇంట్లోకివస్తాడు—దుష్టుల్ని దండించి, పని వారికిజీతాలు పంచుతానని ప్రకటించడానికి. దొంగ పద్దులు తనికీచేసి మానేజర్ను ఇరకా టంలో పెడతాడు. అప్పుడు మానేజరు, జగ్గయ్య అసలు హీరోకాదని, ఇన్నాళ్లూ ఫాక్టరీలో కూలీగా ఉన్న చంద్రమే, ఈ వేషంలో వచ్చి ఆస్తికాజేయ చూస్తున్నా డనీ అభాండం వేస్తాడు. కన్నతల్లి కూడా కుమారుడిని శంకిస్తుంది. కాని పోలీసు ఇన్ స్పెక్టరు మహంకాళివెంకయ్యకు, హీరో అంటే చాలా యిష్టం. అతనికి ఇతనే హీరో అని తెలుసు.

అందువల్ల గ్రూప్ ఫోటో ఇలా ఉంటుంది.

పేక్ వన్! (ఎడమనుండి కుడికివరసగా) ఓడిన గిరిజ, హేమలత, దుష్టుడు ఆర్. నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ మహంకాళి వెంకయ్య, హీరో జగ్గయ్య, సింద్రెలా నాయిక జానకి, వాళ్లనాన్న, నేపథ్యంలో పోలీసులు.

పేక్ టూ: పైనున్న యావన్మందిన్నీ. (విలన్లు గిరిజ, నాగేశ్వరరావు, పోలీసులూమినహా)

★

ఓడ పగిలిపోయిన తర్వాత ఒక నావికుడు అతి కష్టం మీద ఒకద్వీపం జేరుకున్నాడు. అచట అతను ప్రాణాలు గుప్పిట్లోపెట్టు కుని ఆరు సంవత్సరాలు కాలం గడిపాడు. అదృష్టవశాత్తు ఒక రోజు అచటకు ఒకఓడవచ్చింది. ఆ ఓడలోని నావికుడు ద్వీపం లోని మనిషిని చూచాడు. కొద్ది సేపట్లో న్యూసుపేపరు కట్టలు తీసుకువచ్చి అతని ముందు పడ వేసి ఇలా అన్నాడు.

"ప్రపంచంలో జరిగే విష యాలు అన్నీ మీరు ఈవార్తా పత్రికలో చూడవచ్చు. మిమ్మ ల్ని తిరిగి మన దేశం తీసుకువెళ్ల డానికి మాకు ఎలాంటి అభ్యం తరంలేదు. మీరు యీ వార్తా పత్రికలు చదివిన తర్వాత మీ నిర్ణయం తెలియజేయండి."

—సుభాస్.]

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



అశ్వారూఢ

ఫోటో : సంపగోపాల్—హైదరాబాదు.

Regd No. M. 4479 Andhra Patrika Illustrated Weekly.